ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002

# జనంసాక్షి


www.janamsakshi.org

మంగళవారం 14.01.2025 | సంపుటి : 11 సంచిక : 187 | పేజీలు : 12 వెల: రూ. 4/-

RNI NO.TELTEL / 2013 /50370




తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



## కుంభమేళా షురూ..

### కదిలిన భక్తకోటి

ప్రయాగ్‌రాజ్(జనంసాక్షి): ఉత్తరప్రదేశ్‌లో మహా కుంభమేళా ప్రారంభమైంది. తొలి రోజు ఉదయం గంగా , యమునా, సరస్వతి నదులు కలిసిన త్రివేణి సంగమం వద్ద దాదాపు 50 లక్షల మందికిపైగా భక్తులు పుణ్యస్నానాలు చేశారు. ప్రపంచంలోనే అత్యధిక మంది సమ్మేళనమైన కార్యక్రమంగా ఈ మహా కుంభమేళా రికార్డుల్లోకి ఎక్కనుంది. ఈ కుంభమేళాకు దాదాపుగా 45 కోట్ల

మిగతా 2లో..



పాఠకులకు,ప్రకటనకర్తలకు

## సంక్రాంతి శుభాకాంక్షలు

పండుగ సందర్భంగా నేడు కార్యాలయానికి సెలవు. కావున రేపటి సంచిక వెలువడదు. పునర్దర్శనం గురువారం.

# ఈ నెల 26 నుంచే కొత్త రేషన్‌కార్డులు




### మార్గదర్శకాలు జారీ చేసిన తెలంగాణ సర్కారు

### మంత్రివర్గ ఉపసంఘం సిఫారసులకు అనుగుణంగా లబ్దిదారుల ఎంపిక ప్రక్రియ

### కార్డుల్లో సభ్యుల మార్పులు, చేర్పులకూ అవకాశం

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణలో కొత్త రేషన్ కార్డుల మంజూరుకు సంబంధించిన మార్గదర్శకాలను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ నెల 26 నుంచి పౌరసరఫరాల శాఖ–ఆహార భద్రత (రేషన్) కార్డులు జారీ కానున్నాయి. దీంతో దీర్ఘకాలంగా అపరిష్కృతం గా ఉన్న వినతుల పరిష్కారం దిశగా సర్కారు ముందడుగు వేసినట్లయింది. మంత్రివర్గ ఉపసంఘం సిఫారసులకు అనుగుణంగా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ జరగనుంది. దరఖాస్తులను నిశితంగా పరిశీలించిన తర్వాత కులగణన సర్వే ఆధారంగా రేషన్ కార్డులు లేని కుటుంబాల జాబితాను జిల్లా కలెక్టర్, జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు క్షేత్రస్థాయి పరిశీలన నిమిత్తం పంపిస్తారు. మండల స్థాయిలో ఎంపీడీవో, యూఎల్‌బీలో మున్సిపల్ కమిషనర్ ఈ మొత్తం ప్రక్రియకు బాధ్యులుగా వ్యవహరిస్తారు. ముసాయిదా జాబితాను గ్రామసభ, వార్డులో ప్రదర్శించి, చదివి వినిపించి చర్చించిన తర్వాత ఆమోదం లభించనుంది. ఆహార భద్రత కార్డుల్లో సభ్యుల చేర్పులు, మార్పులు జరగనున్నాయి. అర్హత కలిగిన కుటుంబాలకు ఈ నెల 26 నుంచి పౌరసరఫరాల శాఖ కొత్త ఆహార భద్రత కార్డులు జారీ చేయనుంది.



## పెట్టుబడులకు కేరాఫ్ తెలంగాణ

### ప్రపంచ ప్రఖ్యాత కంపెనీలకు రాష్ట్రంలో అనుకూలమైన వాతావరణం:సీఎం రేవంత్

### ఫ్యూచర్‌సిటీ ప్రత్యేకతలను ప్రపంచవేదికపై పరిచయం చేసేందుకు సిద్ధంగా ఉండాలి

### పరిశ్రమల శాఖపై ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష సమావేశం

2లో



## కౌశిక్‌రెడ్డి అరెస్ట్

హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకున్న కరీంనగర్ పోలీసులు

భారాస ఎమ్మెల్యేపై మూడు కేసులు నమోదు

హైదరాబాద్(జనంసాక్షి): హుజూరాబాద్ భారాస ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని కరీంనగర్ పోలీసులు అరెస్టు చేశారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో ఓ న్యూస్ ఛానల్

మిగతా 2లో..

## కౌశిక్‌రెడ్డి నాపై దాడిచేశాడు

వీధిరౌడీలా ప్రవర్తించాడు

ఘటనపై స్పీకర్‌కు ఫిర్యాదు చేశా :ఎమ్మెల్యే సంజయ్



2లో

## తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టుకు సాగునీరే లక్ష్యం

### మంచి పనులు చేసి ప్రజల మన్ననలు పొందుతాం: మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

### మంచుకొండఎత్తిపోతల పథకానికి మంత్రుల శంకుస్థాపన

ఖమ్మం,జనవరి13(జనంసాక్షి):ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రాబోయే నాలుగేళ్లలో అన్ని ప్రాజెక్టు పనులు పూర్తి చేస్తామని మంత్రులు స్పష్టం చేశారు. సీతారామ పూర్తి చేసి గోదావరి జలాలు.. ఖమ్మం జిల్లాకు

మిగతా 2లో..



## జాతీయ పసుపుబోర్డు ఛైర్మన్‌గా పల్లె గంగారెడ్డి

### కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్

## కొంపముంచిన న్యూఇయర్‌వేడుకలు

### సంబరాల్లో కాల్చిన బాణసంచావల్లే లాస్ ఎంజిల్స్‌లో మొదలైన కార్చిచ్చు

### ఇంకా అదుపులోకి రాని మంటలు

లాస్‌ఏంజిల్స్(జనంసాక్షి):అమెరికాలోని లాస్ ఏంజెల్స్‌లో కార్చిచ్చు వ్యాప్తి కొనసాగుతోంది. వేగంగా వీస్తున్న గాలులతో మంటలు కొత్త ప్రాంతాలకు వ్యాపిస్తున్నాయి. దీంతో వేలాది ఇండ్లు కాలి బూడిదవుతున్నాయి. లక్షల కోట్ల రూపాయల ఆస్తి నష్టం వాటిల్లుతోంది. ప్రాణనష్టం సైతం క్రమంగా పెరుగుతోంది. ఇప్పటి వరకూ అందిన సమాచారం ప్రకారం.. కార్చిచ్చులో మరణించిన వారి సంఖ్య 24కు పెరిగింది. మరణించిన వారిలో

మిగతా 2లో..

## ‘జడ్-మోడ్’ భారత రక్షణ రంగానికి వ్యూహాత్మకంగా చాలా కీలకం

- సొరంగాన్ని ప్రారంభించిన ప్రధాని మోదీ
- టన్నెల్ పొడవు 6.5 కిలోమీటర్లు
- నిర్మాణం కోసం రూ.2,500 కోట్లు ఖర్చు

న్యూఢిల్లీ(జనంసాక్షి):ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం జమ్ముకశ్మీర్‌లోని సోన్‌మార్గ్ ప్రాంతంలో జడ్ మోడ్ సొరంగాన్ని ప్రారంభించారు. ప్రధాని రాక నేపథ్యంలో జమ్ముకశ్మీర్‌లో అధికారులు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. టన్నెల్ ప్రారంభోత్సవంలో జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ తదితరులు పాల్గొన్నారు. శ్రీనగర్ నుంచి కార్గిల్ వెళ్లే దారిలో శ్రీనగర్–లేహ్ జాతీయ రహదారిపై ఈ టన్నెల్‌ను నిర్మించారు. ఈ టన్నెల్ నిర్మాణం కోసం ఏకంగా రూ.2,500 కోట్లు ఖర్చు చేశారు. భారత రక్షణ రంగానికి వ్యూహాత్మకంగా ఈ టన్నెల్ చాలా కీలకం కానుంది. ఈ జడ్ మోడ్ సొరంగం 6.5 కిలోమీటర్ల పొడవు ఉంది. ఈ టన్నెల్ ద్వారా ఏ సీజన్‌లోనైనా లడఖ్‌కు చేరుకోవడానికి వీలవుతుంది. టన్నెల్‌కు సంబంధించి 2015లో ప్రారంభమైన నిర్మాణ పనులు గత ఏడాది పూర్తయ్యాయి. ఈ జెడ్ మోడ్ టన్నెల్ భారత్‌కు వ్యూహాత్మకంగా చాలా కీలకమైనది. దాదాపు సముద్రమట్టానికి 8,500 అడుగుల ఎత్తులో దీన్ని నిర్మించారు. అత్యంత శీతలమైన లడఖ్‌ను ఏ సీజన్‌లో అయినా సందర్శించేందుకు ఈ టన్నెల్ ఉపయోగపడనుంది. ఈ సొరంగం రవాణా వ్యవస్థతోపాటు రక్షణ వ్యవస్థకు కూడా కీలకం కానుంది. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లోనూ సోనామార్గ్ పట్టణానికి టన్నెల్ ద్వారా వెళ్లొచ్చు. జమ్ముకశ్మీర్‌లో ‘జడ్ మోడ్’ టన్నెల్ ఏర్పాటుతో కార్గిల్ మరింత సురక్షితంగా మారింది. గతంలో కార్గిల్‌లో పాకిస్తాన్ ఉగ్రవాదులు దుశ్చర్యలకు పాల్పడగా భారత్ ఏకంగా యుద్ధమే చేయాల్సి వచ్చింది.

మిగతా 2లో..



## బ్రహ్మణదంపతులు నలుగురు పిల్లల్ని కనండి

### రూ.లక్ష కొట్టండి

### మధ్యప్రదేశ్ బోర్డు ఆఫర్

భోపాల్(జనంసాక్షి):మధ్యప్రదేశ్ ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే పరశురామ్ కల్యాణ్ బోర్డు ఓ ప్రకటన చేసింది. తమ కమ్యూనిటీని పెంచుకునేందుకు ఎక్కువ మంది సంతానాన్ని కనాలని పిలుపునిచ్చింది. నలుగురు పిల్లలను కనే బ్రాహ్మణ దంపతులకు రూ.లక్ష నజరానా ఇస్తామని ప్రకటించింది. మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో పరశురామ్ కల్యాణ్ బోర్డు ధ్యక్షుడు పండిత్ విష్ణు రాజోరియా ఈ ప్రకటన చేశారు. “మనం మన కుటుంబాలపై దృష్టి పెట్టడం

మిగతా 2లో..

## పేదల సొంతింటి కల సాకారం చేస్తాం

### వారికికిచ్చిన ప్రతి ఒక్క హామీని అమలు చేస్తాం

### మోడల్ ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన మంత్రి పొంగులేటి




ఖమ్మం(జనంసాక్షి):తెలంగాణ రాష్ట్రంలో పేదల సొంత ఇంటి కల నెరవేరబోతోందని రాష్ట గృహ నిర్మాణ, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. . తెలంగాణ ప్రభుత్వం పేదలకు ఇచ్చిన ప్రతి ఒక్క హామిని అమలు చేస్తోందని అన్నారు. ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ రాష్ట్రంలో సంక్షేమ పాలన కొనసాగిస్తున్నామని తెలిపారు. ఖమ్మం జిల్లాలోని పాలేరు నియోజకవర్గం కుసుమంచిలో నిర్మించిన మోడల్ ఇందిరమ్మ ఇళ్లను సోమవారం ప్రారంభించారు. రూ. 5 లక్షల వ్యయంతో నిర్మించిన ఇంటిని మంత్రి శ్రీనివాస రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. ఎన్ని కుట్రలు, ఎన్ని ఆటంకాలు ఎదురైనా పేదల కల నెరవేర్చుతామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రంలో రాజకీయాలు, కులమతాలకు అతీతంగా ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు జరుగుతుందని తెలిపారు.


మిగతా 2లో..



## తిరుమల ఘాట్ రోడ్డులో బస్సు ప్రమాదం

తిరుమల(జనంసాక్షి): తిరుమల రెండో ఘాట్ రోడ్డులో బస్సు ప్రమాదానికి గురైంది. ఆర్టీసీ బస్సు పిట్టగోడను ఢీకొనడంతో పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదం కారణంగా ఘాట్ రోడ్డులో కిలోమీటరు మేర వాహనాలు నిలిచిపోయాయి. ఇటీవల తిరుమలలో వరుసగా దుర్ఘటనలు చోటు చేసుకుంటున్న సంగతి తెలిసిందే. ఇటీవల తిరుపతిలో దర్శన టోకెన్ కౌంటర్ల వద్ద చోటుచేసుకున్న తొక్కిసలాటలో ఆరుగురు భక్తులు మృతి చెందిన విషయం తెలిసిందే. అంతేకాక ఆ ఘటనలో అనేక మంది గాయాలపాలయ్యారు.

## భారత్ సరిహద్దు సమీపంలో చైనా భారీగా సైనిక విన్యాసాలు



న్యూఢిల్లీ(జనంసాక్షి):టిబెట్‌లోని అత్యంత ఎత్తైన ప్రదేశంలో చైనా భారీగా సైనిక విన్యాసాలను మొదలు పెట్టింది. అత్యంత కఠిన ప్రదేశాల్లో యుద్ధ సన్నద్ధత, లాజిస్టిక్స్ సరఫరా వంటి అంశాలను దృష్టిలోపెట్టుకొని పీఎల్‌ఏ వీటిని నిర్వహిస్తోంది. ఇండియన్ ఆర్మీ ఫౌండేషన్ డే ఇంకొన్నాళ్లలో ఉండగా చైనా వీటిని మొదలు పెట్టడం గమనార్హం.షింజియాంగ్ మిలటరీ కమాండ్‌కు చెందిన రెజిమెంట్ వీటిని చేపట్టింది. అత్యాధునిక సైనిక టెక్నాలజీ, ఆల్ టెర్రైన్ వెహికల్స్, అన్‌మ్యాన్డ్ సిస్టమ్స్, డ్రోన్లు, ఎక్సో స్కెలిటెన్స్ వంటి వాటిని ఈ విన్యాసాల్లో వినియోగిస్తున్నారు. మరోవైపు వీటిని దృష్టిలో ఉంచుకొని భారత దళాలు అప్రమత్తమయ్యాయి.తాజాగా బీజింగ్ చేపట్టిన లాజిస్టిక్స్ సపోర్ట్ ఎక్సర్‌సైజ్‌లు చాలా వ్యూహాత్మకమైనవి. అత్యంత ఎత్తైన ప్రదేశాల్లో యుద్ధం వేళ వేగంగా దళాలకు అవసరమైన పరికరాలు, ఆహారం వంటివి సరఫరా చేయడంపైనా సాధన చేస్తున్నారు. ఈ విన్యాసాలు చేపట్టిన ప్రదేశం కూడా లద్ధాఖ్‌ను ఆనుకొని ఉంది. ఇక్కడి వాతావరణం కారణంగా శారీరకంగా ఎదురయ్యే సవాళ్లను తట్టుకొనేలా చైనా దళాలు ఎక్సోస్కెలిటెన్లు వినియోగించడం విశేషం.2020లో గల్వాన్ లోయలో చోటుచేసుకొన్న భారత్–చైనా సైనిక ఘర్షణ తర్వాత ఈ ప్రాంతం ఉద్రిక్తంగా మారింది. పలు మార్లు సైనిక–దౌత్య స్థాయిల్లో చర్చలు జరిపి పరిస్థితిని కొంత శాంతపర్చారు. బలగాలను వెనక్కి తీసుకొనే అంశంపై గతేడాది అక్టోబర్‌లో కీలక ఒప్పందం జరిగింది. భారత సైన్యం కూడా హిమాలయాల్లో పోరాటపటిమను పెంచుకొనేందుకు ఏటా హిమ్ విజయ్ డ్రిల్స్ నిర్వహిస్తోంది. తీవ్రమైన వాతావరణ

మిగతా 2లో..

### ఎల్‌ఏసీ వద్ద పరిస్థితి స్థిరంగానే ఉంది


### ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది

న్యూఢిల్లీ(జనంసాక్షి):చైనాతో సరిహద్దులు పంచుకొంటున్న వాస్తవాధీన రేఖ (ఎల్‌ఏసీ) వద్ద పరిస్థితి సున్నితంగా కొనసాగుతున్నా.. స్థిరంగానే ఉందని ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది పేర్కొన్నారు. తూర్పు లద్దాఖ్‌లో డెప్సాంగ్,

మిగతా 2లో..

## ఉధృతి మొదలైంది..

### భారత్‌లో క్రమంగా పెరుగుతున్న హెచ్‌ఎంపీవీ వైరస్ కేసులు



న్యూఢిల్లీ(జనంసాక్షి):భారత్‌లో హ్యూమన్ మెటాప్ న్యూమో వైరస్ కేసులు క్రమంగా పెరుగుతున్నాయి. తాజాగా మరోచిన్నారి ఈ వైరస్ బారిన పడింది. పుదుచ్చేరికి చెందిన చిన్నారికి హెచ్‌ఎంపీవీ వైరస్ పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. ఆరోగ్య శాఖ అధికారి రవిచంద్రన్ తెలిపిన వివరాల ప్రకారం.. సదరు చిన్నారి జ్వరం, దగ్గు, జలుబుతో ప్రభుత్వ ఆధీనంలో నడుస్తున్న జవహర్‌లాల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పోస్ట్‌గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ సెంటర్‌లో చేరినట్లు తెలిపారు. ప్రస్తుతం చిన్నారి వైద్య చికిత్సకు సహకరిస్తోందని చెప్పారు. కాగా, తాజా కేసుతో పుదుచ్చేరిలో హెచ్‌ఎంపీవీ కేసులు రెండుకు చేరాయి. గతవారం మూడేండ్ల చిన్నారి ఈ వైరస్ బారిన పడిన విషయం తెలిసిందే. చికిత్స తర్వాత పూర్తిగా కోలుకొని డిశ్చార్జ్ అయ్యింది. తాజా కేసుతో కలిపి భారత్‌లో హెచ్‌ఎంపీవీ కేసులు 18కి చేరాయి.

## మా సైనికులను విడుదల చేయండి

### ఉత్తర కొరియా బందీలను అప్పగిస్తాం:జెలెన్‌స్కీ

కీవ్(జనంసాక్షి):ఉక్రెయిన్‌తో జరుగుతోన్న యుద్ధంలో రష్యాకు మద్దతుగా ఉత్తరకొరియా సైన్యం పోరాడుతున్న సంగతి తెలిసిందే. రష్యా తరపున పోరాడుతున్న ఇద్దరు ఉత్తర కొరియా సైనికులను తాము అదుపులోకి తీసుకున్నామని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ శనివారం ప్రకటించారు. రష్యాలో బందీగా ఉన్న తమ సైనికులను విడుదల చేస్తే.. ఉత్తర కొరియా సైనికులను వారి అధినేత కిమ్ జోంగ్ ఉన్‌కు అప్పగిస్తామని ఆయన తాజాగా ప్రకటించారు.’ రష్యాలోని కుర్స్క్ ప్రాంతంలో ఇద్దరు ఉత్తర కొరియా సైనికులను అదుపులోకి తీసుకున్నాం. ఆ దేశానికి చెందిన మరికొందరు సైనికులను పట్టుకోవడానికి మా దళాలు ప్రయత్నిస్తున్నాయి.

మిగతా 3లో..

## కావాలనే ఆలస్యం చేస్తున్నారు

న్యూఢిల్లీ(జనంసాక్షి):అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఢిల్లీ మద్యం విధానంపై కాగ్ ఇచ్చిన నివేదిక తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ అంశంపై తాజాగా ఢిల్లీ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది.కాగ్ నివేదికపై అసెంబ్లీలో చర్చించకుండా కావాలనే ఆలస్యం చేస్తున్నారని ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వంపై అసహనం వ్యక్తంచేసింది. ఈ తీరు పలు అనుమానాలకు తావిస్తోందని వ్యాఖ్యానించింది. ఢిల్లీ మద్యం విధానంపై కాగ్ ఇచ్చిన నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెట్టేందుకు గానూ ప్రత్యేక సెషన్‌కు ఆదేశించాలని కోరుతూ భాజపా ఎమ్మెల్యేలు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై తాజాగా విచారణ జరిపిన న్యాయస్థానం.. “ఈ నివేదిక విషయంలో మీరు ఉద్దేశపూర్వకంగా అలసత్వం ప్రదర్శించడం దురదృష్టకరం. మీరు వాటిని వీలైనంత

మిగతా 2లో..




### ‘కాగ్’ నివేదికపై ఉద్దేశపూర్వకంగానే అలసత్వం ప్రదర్శిస్తున్నారు

### ఢిల్లీ సర్కారుపై హైకోర్టు అసహనం

జనంసాక్షి www.janamsakshi.org | మంగళవారం 14.01.2025

# పెట్టుబడులకు కేరాఫ్ తెలంగాణ

**హైదరాబాద్(జనంసాక్షి):** పెట్టుబడులకు గమ్య స్థానంగా ఇప్పటికే తెలంగాణ దేశంలో అందరి దృష్టిని ఆకర్షిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. దేశ విదేశాల్లో పేరొందిన కంపెనీలు భారీగా పెట్టుబడులు పెట్టేందుకు రాష్ట్రంలో అనుకూలమైన వాతావరణముందని అభిప్రాయ పడ్డారు. ఫ్యూచర్ సిటీగా వెలుగొందుతున్న హైదరాబాద్ సిటీలో ఉన్న సానుకూలతలను ప్రపంచ వేదికపై పరిచయం చేసేందుకు సన్నద్ధంగా ఉండాలని అధికారులను సీఎం ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పారిశ్రామిక విధానం అందరినీ ఆకర్షిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. తొలి ఏడాదిలోనే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన పథకాలు, అభివద్ధి పనులన్నీ తెలంగాణను బలమైన ఆర్థిక వ్యవస్థగా నిలబెట్టాయని అన్నారు. జూబ్లీహిల్స్ లోని నివాసంలో పరిశ్రమల శాఖపై అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్ రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారుజనవరి 20 నుంచి దావోస్ పర్యటన నేపథ్యంలో రాష్ట్రంలో పెట్టుబడుల సమీకరణ, వాటి పురోగతి ని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సమీక్షించారు. గత ఏడాది ప్రభుత్వం తో ఒప్పందం చేసుకున్న ఏయే కంపెనీ లు రాష్ట్రంలో కార్యకలాపాలను ప్రారంభించాయి.. అవి ఏయే దశలో ఉన్నాయని ముఖ్యమంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. తొలి ఏడాదిలో రాష్ట్రానికి భారిగా పెట్టుబడులు వచ్చాయని ముఖ్యమంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు. గత ఏడాది దావోస్ లో జరిగిన వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ సదస్సులో చేసుకున్న ఒప్పందాలతో రాష్ట్రానికి రూ.40232 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. 14 ప్రముఖ కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడుల కు ముందుకు వచ్చాయి. దాదాపు 18 ప్రాజెక్టులకు ఒప్పందాలు కుదిరాయి. వీటిలో దాదాపు 17 ప్రాజెక్టులు ప్రారంభమయ్యాయని అధికారులు సీఎంకు వివరించారు. పది ప్రాజెక్టులు వివిధ దశల్లో వేగం పుంజుకున్నాయని, ఏడు ప్రాజెక్టుల అమలు ప్రారంభ దశలో ఉందని తెలిపారు. కంపెనీల వారిగా పురోగతిని మంత్రి శ్రీధర్ బాబు తో సీఎం చర్చించారు. ఈ నెల 16 నుంచి 19 వరకు సింగపూర్, 20 నుంచి 22 వరకు ముఖ్యమంత్రి దావోస్ లో పర్యటించనున్నారు. ముఖ్యమంత్రితో పాటు మంత్రి శ్రీధర్ బాబు, పరిశ్రమల శాఖ ఉన్నతాధికారులు ఈ పర్యటన లో ఉంటారు. సింగపూర్ లో స్కిల్ యానివర్సిటీతో ఒప్పందాలతో పాటు ఇతర పెట్టుబడులకు పలు సంస్థల తో సంప్రదింపులు జరుపుతారు. దావోస్ లో వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ వార్షిక సదస్సులో పాల్గొంటారు. ఈ ఆరు రోజుల పర్యటనకు సంబంధించిన షెడ్యూలుతో పాటు, అక్కడ జరిగే సదస్సులు, వివిధ పరిశ్రమల ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశాల ప్రణాళికను అధికారులు సీఎంకు వివరించారు.

### ప్రజలకు సిఎం రేవంత్ సంక్రాంతి శుభాకాంక్షలు

కొత్త ఏడాదిలో వచ్చే తెలుగువారి పెద్ద పండుగ సంక్రాంతి. మూడు రోజుల పాటు జరిగే ఈ పండుగ తొలిరోజు భోగి. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిలు తెలుగు ప్రజలకు భోగి పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ ఎక్స్‌లో ట్వీట్ చేశారు. భోగిమంటలతో సమస్యలు తీరిపోయి ప్రతి ఇంటా భోగ భాగ్యాలు కలగాలని ఇద్దరు సీఎంలు ఆకాంక్షించారు.

## జాతీయ పసుపుబోర్డు ఛైర్మన్‌గా పల్లె గంగారెడ్డి

**హైదరాబాద్(జనంసాక్షి):** జాతీయ పసుపు బోర్డు ఛైర్మన్‌గా పల్లె గంగారెడ్డి నియమితులయ్యారు. మూడేళ్ల పాటు ఆయన ఈ పదవిలో కొనసా గనున్నారు. కేంద్ర ప్రభుత్వం సోమవారం నోటిఫికేషన్ విడుదల చేసింది.

# మరెక్కడా లేని విధంగా తెలంగాణ పథకాలు

**రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాలకు రూ.45 వేల కోట్ల ఖర్చు**
**ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వెల్లడి**

**ఖమ్మం(జనంసాక్షి):** ప్రజా సంక్షేమం కోసం దేశంలో ఎక్కడ కూడా తెలంగాణలో ఉన్నటువంటి వంటి పథకాలు లేవని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. రైతు రుణం, ధాన్యం బోనస్ చారిత్రాత్మకమైన పథకాలు తెలంగాణ సర్కార్ ఇస్తుందన్నారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాలకు రూ.45 వేల కోట్ల రూపాయాలు ఖర్చు పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఖమ్మం జిల్లాలో మల్లు భట్టి విక్రమార్క పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతు భరోసాకు 19 వేల కోట్ల రూపాయలు.. ఆత్మీయ భరోసాకు రూ.2 వేల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ఇక, ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు అన్ని పథకాలను అమలు చేస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారు. ప్రతి స్కీంలో కన్ఫ్యూజన్ ఏం లేదు.. పథకాలపై సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నాం.. అలాగే, ఉపాధి హామీ పథకంలో సభ్యులకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు అర్హులు అని వెల్లడించారు. ఇందులో సెంట్ భూమి లేని వారికి వర్తిస్తుంది అన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన స్పష్టత ప్రభుత్వం దగ్గర ఉంది. అధికారులు ఇందిరమ్మ కమిటీలు సమన్వయంతో పని చేయాలి అని సూచించారు. గ్రామాల్లో గ్రామసభ డయాస్ ఏర్పాటు చేసి చర్చించాలి.. గ్రామాల్లో ముడు చోట్ల ప్లెక్సీలని ఏర్పాటు చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు.

## అనర్హులకు ఇళ్లు వస్తే కలెక్టర్లదే బాధ్యత

**మంత్రి కోమటిరెడ్డి సున్నితంగా హెచ్చరిక**

**ఖమ్మం,జనవరి13(జనంసాక్షి):** అర్హులైన వారికే ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాల్సి ఉందని, భవనాలు ఉన్న వారికి ఇళ్లు ఇస్తే మొదటి బాధ్యులు కలెక్టర్ అవుతారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. అర్హులైన వారికి ఇళు రావాలన్నారు. అధికారులు, సిబ్బంది కీలక పాత్ర వహించాల్సి వుంటుంది.. అధికారులు, సిబ్బంది అలసత్వం ఉండొద్దు.. గ్రామాలు మీ ఇళ్లు అనుకుని పని చేయండి అని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సూచించారు.

## తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టుకు

# సాగునీరే లక్ష్యం



తీసుకు వస్తామన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమం లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కాంగ్రె స్ పార్టీకి అండగా నిలిచిన మీ త్యాగాలు మర్చిపోమని పేర్కొన్నారు. గత ప్రభుత్వం రూ. పది వేల కోట్లు ఖర్చు చేసి ఒక్క ఎకరాకు కూడా సాగునీరు ఇవ్వలేదని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. జూ లూరుపాడు టన్నెల్ పూర్తయితే.. పాలేరుకు గోదావరి జలాలు వస్తాయన్నారు. ఖమ్మం జిల్లాలోని 10 అసెంబ్లీ నియోజకవర్గాలు సస్యశ్యామలం చేయాలన్నదే తన రాజ కీయ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. అలాగే సీతారా మ ప్రాజెక్ట్ పూర్తి కావడంతోపాటు భద్రాచలంకి రైల్వే లైన్, కొత్తగూడెంకు ఎయిర్ పోర్ట్ రావాలన్నారు. మీ కష్టాలు తెలుసు, మీ అవసరాలు సైతం తనకు తెలుసునన్నారు. అన్ని పనులు పూర్తి చేసి.. మీతో శబాష్ అనిపించుకుంటా నని.. అంతే తప్ప. ఛీ ఛీ అని మాత్రం అనిపిం చుకోనని ఆయన పేర్కొన్నారు. సోమవారం ఖమ్మం జిల్లాలోని రఘునాథపాలెం మండలం మంచుకొండ ఎత్తిపోతల పథకానికి తుమ్మలతోపాటు ఉపముఖ్య మంత్రి భట్టి విక్రమార్క, ఇతర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగిలేటి శ్రీనివాసరెడ్డి తదితరులు శంకుస్థాపన చేశారు. అనంతరం వరుసగా మంత్రులు మాట్లాడారు. ఆ క్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఈ ఏడాది సత్తుపల్లి ట్రంక్ పూర్తి చేసి గోదావరి జలాలను పూర్తి చేస్తానని స్పష్టం చేశారు. పామాయిల్ సాగు చేయాలని ఈ సందర్భంగా రైతులకు ఆయన పిలుపు నిచ్చారు. ప్రతి జిల్లాలో పామాయిల్ ఫ్యాక్టరీలు స్థాపించి.. రైతులను రాజు లుగా నిలబెట్టే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిదని ఆయన పేర్కొన్నారు. 46 మండలాలకు సాగు నీరు అందించే భాగ్యం తనకు దక్కిందంటూ మంత్రి తుమ్మల ఈ సందర్భంగా సంతోషం వ్యక్తం చేశారు. ఒక్క రఘునాథ పాలెం మండలానికి సాగు నీరు ఇవ్వలేక పోయానన్న బాధ గతంలో ఉండేదని.. ఇప్పుడా ఆ బాధ సైతం తనకు లేదన్నారు. మీరు పామాయిల్ సాగు చేయండి.. ఉగాది నాటికి సాగు నీరు తీసుకు వచ్చి మీ మొక్కలు బతికిస్తాంటూ రైతులకు మంత్రి తుమ్మల భరోసా ఇచ్చారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. ఇందిరమ్మ రాజ్యం వచ్చి ఏడాది పూర్తియిందని గుర్తు చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను ఒకొక్క టిగా నెరవేరుస్తున్నామని అన్నారు. ప్రతిపక్షం అవాక్కులు చవాక్కులు పేలినా.. వాటిని పట్టించుకో కుండా అభివృద్ధి, సంక్షేమం కొనసాగిస్తున్నామని తెలిపారు. ప్రతి పేద వాడికి అభివృద్ధి సంక్షేమం అందజేస్తామన్నారు. అలాగే మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ.. 2500 ఎకరాలకు సాగునీరు అందించే ఎత్తిపోతల పథకం పనులు ప్రారంభించటం సంతోషంగా ఉందన్నారు. అపర భగీరథుడు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వ రరావు మీకు మంత్రిగా ఉండటం అదృష్టమని పేర్కొన్నారు. మంత్రులమంతా సమన్వయంతో పని చేస్తున్నామని తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ఈ సందర్భంగా ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు. ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. మంచుకొండ ఎత్తిపోతల ప్రాజెక్ట్ ను తక్కువ ఖర్చు రూ. 54 కోట్లతో 2,500 ఎకరాలకు సాగునీరు అందించనుండడం సంతోషంగా ఉందన్నారు. చరిత్రలో ఏ ప్రభుత్వం చేయని విధంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు తాము అమలు చేస్తున్నామని చెప్పారు. ఖమ్మం జిల్లాకు వ్యవసాయంతో పాటు పరిశ్రమల స్థాపనకు కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ ను మంత్రి తుమ్మల పట్టబట్టి మరి సాధించారన్నారు. సంక్రాంతి కానుకగా రఘునాథపాలెం ప్రజలకు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం ఇవ్వాలని తుమ్మల పట్టుబట్టారని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. మంత్రులమం దరం అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్నామని చెప్పారు. రూ.1.8 లక్షల కోట్లు ఖర్చు చేసి నామమాత్రంగా ఆయకట్టు నిర్మించినా.. సాగులోకి మాత్రం తీసుకు రాలేదన్నారు. రూ. లక్ష కోట్లు ఖర్చు చేసి కాళేశ్వరం నిర్మించి.. ఒక్క ఎకరాకు సైతం సాగు నీరు అందించలేదన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఈ ఏడాది ఎన్నడూ లేని విధంగా రైతులు పంట పండించారన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రాబోయే నాలుగేళ్లలో అన్ని ప్రాజెక్టు పనులు పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. సీతారామ పూర్తి చేసి గోదావరి జలాలు.. ఖమ్మం జిల్లాకు తీసుకు వస్తామ న్నారు. రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమం లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచిన మీ త్యాగాలు మర్చిపోమని ఆయన పేర్కొన్నారు.

# పేదల సొంత ఇంటి కల సాకారం చేస్తాం

ఒక్క రూపాయి ఎవరికీ ఇవ్వాల్సిన పని లేదని స్పష్టం చేశారు. కేవలం పేదవారయితే చాలు ఇందిరమ్మ ఇల్లు వస్తుందని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు నిరంతర పక్రియ అని చెప్పారు. సంక్రాంతి పండుగ సందర్భంగా రాష్ట్రంలో పేదవాడికి తీయని కబురు చెబుతున్నామని అన్నారు. త్వరలోనే అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేయబోతున్నామని అన్నారు. నాలుగేళ్లలో 20 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం జరుగబోతోందన్నారు. రైతులకు రైతు బంధు పథకం ద్వారా ఎకరాకు రూ. 12 వేలు ఇస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో అర్హులైన పేదలకు రేషన్ కార్డు ఇవ్వబోతున్నామని చెప్పారు. రాష్ట్రంలో భూమి లేని నిరుపేదలకు దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఇందిరమ్మ భరోసా పథకం ద్వారా రూ.12 వేలు రెండు విడతలుగా ఇవ్వబోతున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.

## జాతీయ పసుపుబోర్డు ఛైర్మన్‌గా పల్లె గంగారెడ్డి

**హైదరాబాద్(జనంసాక్షి):** జాతీయ పసుపు బోర్డు ఛైర్మన్‌గా పల్లె గంగారెడ్డి నియమితులయ్యారు. మూడేళ్ల పాటు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం సోమవారం నోటిఫికేషన్ విడుదల చేసింది.

## భారత్ సరిహద్దు సమీపంలో చైనా భారీగా సైనిక విన్యాసాలు

పరిస్థితుల్లో వివిధ దళాల సమన్వయంతో ఆపరేషన్లు నిర్వహించడంపై సాధన చేశారు. చైనా దళాల కదలికలను గుర్తించేందుకు వీలుగా అత్యాధునిక నిఘా వ్యవస్థలు, ఉపగ్రహ చిత్రా లు, డ్రోన్లను భారత్ వినియోగిస్తోంది. సరిహద్దుల్లో కీలకమైన రోడ్లు, వంతెనలు, సొరంగాలు నిర్మాణాలను భారత్ వేగవంతం చేసింది. దీంతో దళాల కదలిక మరింత సులువుగా జరిగేలా చేసింది.

## బ్రహ్మణదంపతులు నలుగురు పిల్లల్ని కనండి

మానేశాం. ఈ మధ్య యువత ఒక బిడ్డను కని ఆగిపోతున్నారు. ఇది చాలా సమస్యాత్మకంగా మారుతోంది. భవిష్యత్ తరాన్ని కాపాడాల్సిన బాధ్యత మనదే. అందుకే కనీసం నలుగురు సంతానం ఉండాలని కోరుతున్నా" అని రాజోరియా తెలిపారు."నలుగురు పిల్లల్ని కనే మహిళలకు బోర్డు తరఫున రూ.లక్ష నజరానా అందిస్తాం. నేను బోర్డు అధ్యక్షుడిగా దిగిపోయిన తర్వాత కూడా ఈ అవార్డు కొనసాగుతుంది" అని ఆయన అన్నారు. ప్రస్తుతం ఈ వార్త నెట్టింట వైరల్‌గా మారింది.

## ఎల్‌ఏసీ వద్ద పరిస్థితి స్థిరంగానే ఉంది



దెమ్‌చోక్ ప్రాంతాల్లో పెట్రోలింగ్ మొదలైందని తెలిపారు. న్యూఢిల్లీలో నిర్వహించిన వార్షిక ప్రెస్‌మీట్‌లో ఆయన ఈ విషయాలను వెల్లడించారు. భారత సైన్యం మోహరింపులు బలంగా, సమతౌల్యంతో ఉన్నాయని ద్వివేది చెప్పారు. ఎటువంటి పరిస్థితినైనా సైన్యం ఎదుర్కోగలదన్నారు. సరిహద్దుల్లో మౌలిక వసతుల కల్పనను వేగవంతం చేయడంతోపాటు.. సామర్థ్యాలను బలపరుస్తున్నట్లు చెప్పారు. ఇక పాకిస్థాన్ వైపు ఉన్న నియంత్రణ రేఖ వద్ద చొరబాటు యత్నాలను అడ్డుకొంటున్నట్లు ద్వివేది వెల్లడించారు. పాక్ వైపు ఉగ్ర స్థావరాలు కొనసాగుతున్నాయన్నారు. ప్రస్తుతం జమ్మూకశ్మీర్‌లో పరిస్థితి పూర్తిగా నియంత్రణలో ఉందని పేర్కొన్నారు. గతేడాది ఇక్కడ మట్టుబెట్టిన వారిలో 60 శాతం మంది ఉగ్రవాదులు పాక్ నుంచి వచ్చినవారేనని తెలిపారు. ఈశాన్య భారత్‌లోని మణిపుర్‌లో ప్రభుత్వం తీసుకొన్న చురుకైన చర్యలు ఫలితాన్ని చూపిస్తున్నాయని జనరల్ ద్వివేది చెప్పారు. ఈ రాష్ట్రంలో పరిస్థితి అదుపులో ఉందన్నారు. "భద్రతా దళాలు, ప్రభుత్వం చురుగ్గా చేపట్టిన చర్యలు అక్కడి పరిస్థితిని అదుపులోకి తెచ్చాయి" అని చెప్పారు.

## 'జడ్ - మోడ్' భారత రక్షణ రంగానికి వ్యూహాత్మకంగా చాలా కీలకం

శీతాకాలంలో తీవ్రంగా మంచు కురిసే సమయాన్ని ఆసరా చేసుకుని ఉగ్రవాదులు భద్రతాబలగాలపై దాడులకు తెగబడ్డారు. అప్పట్లో కార్గిల్ ప్రాంతం పాకిస్థాన్ ఉగ్రవాదుల హస్తగతమైతే శ్రీనగర్ లేహ్ మధ్య రాకపోకలు నిలిచిపోయేవి. ఇప్పుడు సొరంగం ద్వారా సైన్యం కార్గిల్‌కు వేగంగా చేరుకునే అవకాశం ఉంది.

## కావాలనే ఆలస్యం చేస్తున్నారు

త్వరగా స్పీకర్‌కు పంపి.. అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి ఉండాల్సింది. మీరు ఉద్దేశపూర్వకంగా అసెంబ్లీ సమావేశాలు నిర్వహించకుండా ఆలస్యం చేస్తున్నారని స్పష్టమవుతోంది. ఈ చర్య మీ నిజాయతీపై సందేహాలను లేవనెత్తుతోంది" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ అంశంపై భోజన విరామం తర్వాత పూర్తిస్థాయిలో విచారణ జరుపుతామని కోర్టు వెల్లడించింది. దిల్లీ మద్యం పాలసీపై కాగ్ రూపొందించిన నివేదిక లీకైనట్లు ఇటీవల జాతీయ మీడియాలో కథనాలు వచ్చాయి. మద్యం విధానం కారణంగా ప్రభుత్వానికి రూ.2,026 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ తమ నివేదికలో పేర్కొన్నట్లు సమాచారం. మద్యం విధానంపై నిపుణుల కమిటీ సిఫార్సులను నాటి డిప్యూటీ సీఎం మనీశ్ సిసోదియా నేతృత్వంలోని మంత్రుల బృందం విస్మరించిందని కాగ్ అందులో తెలిపింది. అంతేకాకుండా, ఈ పాలసీపై కీలక నిర్ణయాలు తీసుకునే క్రమంలో మంత్రిమండలి, లెఫ్టినెంట్ గవర్నర్ ఆమోదం కూడా తీసుకోలేదని వెల్లడించింది. లైసెన్సుల జారీ, నిబంధనల ఉల్లంఘనలు జరిగినట్లు పేర్కొంది. అసెంబ్లీ ఎన్నికల వేళ ఈ నివేదిక రాజకీయ దుమారం రేపింది.

# కౌశిక్‌రెడ్డి అరెస్ట్

నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని తిరిగి వెళ్తుండగా 35 మంది పోలీసులు వచ్చి అదుపులోకి తీసుకున్నారు. ఆదివారం కరీంనగర్ కలెక్టరేట్‌లో రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డుల జారీ సన్నద్ధతపై నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ సంజయ్ మాట్లాడే సమయంలో.. ఆయన పక్కనే కూర్చున్న కౌశిక్‌రెడ్డి లేచి అభ్యంతరం తెలిపారు. 'ఈయనకు మైకు ఇవ్వొద్దు.. నువ్వు ఏ పార్టీవయా..?' అంటూ వేలెత్తి చూపిస్తూ మాటల దాడికి దిగారు. దీంతో డాక్టర్ సంజయ్ 'నీకేం సంబంధం.. నాది కాంగ్రెస్ పార్టీ.. నువ్వు కూర్చో' అన్నారు. ఈ క్రమంలో వాగ్వాదం పెరిగింది. ఒక దశలో సంజయ్ చేతిని కౌశిక్‌రెడ్డి తోసేశారు. అనంతరం కౌశిక్‌రెడ్డి పరుష పదజాలం వాడటంతో గొడవ పెద్దదై పరస్పరం తోసుకునే స్థాయికి చేరింది. అనూహ్య పరిణామానికి వేదికపై ఉన్న మంత్రులతో పాటు ప్రజాప్రతినిధులు నిర్ఘాంతపోయారు. పక్కనే ఉన్న రామగుండం, పెద్దపల్లి ఎమ్మెల్యేలు మక్కాన్‌సింగ్, విజయరమణారావులు వారించే యత్నం చేసినా కౌశిక్‌రెడ్డి వినలేదు. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు పోలీసులు ఆయనను బలవంతంగా సమావేశం నుంచి బయటకు తీసుకెళ్లారు. ఈ ఘటనపై కరీంనగర్ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఎమ్మెల్యే సంజయ్ ఫిర్యాదు మేరకు కౌశిక్‌రెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు. సమావేశంలో గందరగోళం, పక్కదారి పట్టించారని ఆర్డీవో మహేశ్వర్ ఫిర్యాదు మేరకు మరో కేసు నమోదైంది. తన పట్ల దురుసుగా ప్రవర్తించారని జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మల్లేశం ఇచ్చిన ఫిర్యాదుపై కౌశిక్‌రెడ్డిపై ఇంకో కేసును ఫైల్ చేశారు. ఈమేరకు వేర్వేరుగా మూడు కేసులను పోలీసులు నమోదు చేశారు.

**కౌశిక్‌రెడ్డిపై మూడు కేసులు నమోదు**

బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి పండుగపూట బిగ్ షాక్ తగిలింది. ఆయనపై పోలీసులు మూడు కేసులు నమోదు చేశారు. కరీంనగర్ వన్ టౌన్ పీఎస్‌లో ఈ కేసులు నమోదు అయ్యాయి. కరీంనగర్ ఆర్డీవో, లైబ్రరీ చైర్మన్ సత్తు మల్లేష్, ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పీఏల ఫిర్యాదు మేరకు బీఎన్ఎస్ యాక్టు 132, 115 (2), 352,292 కింద కేసులు నమోదు అయ్యాయి. మరో ఫిర్యాదు ఆధారంగా 126 (2),115(2) పోలీసులు కేసులు నమోదు చేశారు. ఆదివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన కరీంనగర్ జిల్లా సమీక్షా సమావేశం రసాభాసగా మారింది. సమావేశంలో ఎమ్మెల్యేలు కౌశిక్ రెడ్డి, సంజయ్ కొట్టుకున్నారు. నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పర్యటన సందర్భంగా జిల్లా సమీక్షా సమావేశంలో ప్రభుత్వ పథకాలపై చర్చ జరిగింది. ఈ సమావేశానికి మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ సహా ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఎమ్మెల్యేలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్ మైక్ తీసుకుని మాట్లాడే ప్రయత్నం చేశారు. దీంతో ఆగ్రహానికి గురైన కౌశిక్ రెడ్డి నువ్వు ఏ పార్టీ అంటూ సంజయ్‌ను ప్రశ్నించారు. దమ్ముంటే కాంగ్రెస్ టికెట్‌పై గెలవాలని సవాల్ చేశారు. దీంతో ఇద్దరి మధ్య మాటల యుద్ధం జరిగింది. వాగ్వాదం కాస్తా ముదిరి ఇద్దరూ ఒకరిపై మరొకరు చేయి చేసుకున్నారు. మంత్రుల ఎదుటే కొట్టుకున్నారు. దీంతో రంగ ప్రవేశం చేసిన పోలీసులు కౌశిక్ రెడ్డిని కలెక్టరేట్ నుంచి బలవంతంగా బయటకు లాక్కెళ్లారు. వివాదం నేపథ్యంలో అక్కడంతా గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. కాగా, బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచి కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా మాట్లాడడం ఏంటని కౌశిక్ రెడ్డి మండిపడ్డారు. మరోవైపు కౌశిక్ రెడ్డి ఎక్కడుంటే అక్కడ వివాదాలు ఉంటాయని కాంగ్రెస్ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ అమ్ముడుపోయారని పాడి కౌశిక్ రెడ్డి ఆరోపించారు. సంజయ్‌ను నువ్వు ఏ పార్టీ అని అడిగితే కాంగ్రెస్ పార్టీ అని చెబుతున్నారన్నారు. అలా అయితే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి కాంగ్రెస్ టికెట్‌పై గెలిచి చూపించాలని కౌశిక్ రెడ్డి సవాల్ చేశారు. కేసీఆర్ పెట్టిన భిక్ష వల్ల నువ్వు ఎమ్మెల్యేగా గెలిచావని.. అలాంటిది ఆయనపైనే విమర్శలు చేస్తున్నావు, నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నావన్నారు. తాము కచ్చితంగా నిలదీస్తామని.. అడుగడుగునా అడ్డుకుంటామని తెలిపారు. కాగా ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి తీరుపై మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. కౌశిక్ రెడ్డి వ్యవహారాన్ని మంత్రి ఉత్తమ్ తీవ్రంగా ఖండించారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌ను అడ్డుకుని దాడి చేయడంపై కరెక్ట్ కాదంటూ మండిపడ్డారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. పేదవానికి మేలు జరిగే కార్యక్రమంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ప్రవర్తన ఏ మాత్రం బాగోలేదని మండిపడ్డారు. పోలీసులు అదుపు చేసిన ఆగకపోవడం దారుణమని అన్నారు. ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిపై తప్పకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## కౌశిక్‌రెడ్డి నాపై దాడిచేశాడు


**కరీంనగర్(జనంసాక్షి):**
హుజూరాబాద్ భారాస ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి వీధిరౌడీలా తనపై దాడిచేశారని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ అన్నారు. ఆదివారం కరీంనగర్ జిల్లా సమీక్షా సమావేశంలో జరిగిన ఘటనపై ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో కౌశిక్‌రెడ్డిపై ఫిర్యాదు చేసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు."కౌశిక్‌రెడ్డి స్వతహాగా చేశారా? ఎవరైనా రెచ్చగొడితే చేశారా? అనేది తేలాలి. ఘటనపై స్పీకర్‌కు ఫిర్యాదు చేశా. నివేదిక తెప్పించుకుని చర్యలు తీసకుంటారని భావిస్తున్నా. గతంలో ఇతర పార్టీల నేతలను భారాసలో చేర్చుకున్నారు. ఇతర పార్టీల నుంచి చేరికలపై కేసీఆర్, కేటీఆర్ క్షమాపణలు చెప్పాలి. క్షమాపణలు చెప్పి కేసీఆర్, కేటీఆర్ రాజీనామా చేస్తే నేను కూడా చేస్తా" అని సంజయ్ అన్నారు. కరీంనగర్ కలెక్టరేట్‌లో రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్‌కార్డుల జారీ సన్నద్ధతపై నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ సంజయ్ మాట్లాడే సమయంలో.. ఆయన పక్కనే కూర్చున్న కౌశిక్‌రెడ్డి లేచి అభ్యంతరం తెలిపారు. 'ఈయనకు మైకు ఇవ్వొద్దు.. నువ్వు ఏ పార్టీవయా..?' అంటూ వేలెత్తి చూపిస్తూ మాటల దాడికి దిగారు. దీంతో డాక్టర్ సంజయ్ 'నీకేం సంబంధం.. నాది కాంగ్రెస్ పార్టీ.. నువ్వు కూర్చో' అన్నారు. ఈ క్రమంలో వాగ్వాదం పెరిగింది. ఒక దశలో సంజయ్ చేతిని కౌశిక్‌రెడ్డి తోసేశారు. అనంతరం కౌశిక్‌రెడ్డి పరుష పదజాలం వాడటంతో గొడవ పెద్దదై పరస్పరం తోసుకునే స్థాయికి చేరింది. అనూహ్య పరిణామానికి వేదికపై ఉన్న మంత్రులతో పాటు ప్రజాప్రతినిధులు నిర్ఘాంతపోయారు. పక్కనే ఉన్న రామగుండం, పెద్దపల్లి ఎమ్మెల్యేలు మక్కాన్‌సింగ్, విజయరమణారావులు వారించే యత్నం చేసినా కౌశిక్‌రెడ్డి వినలేదు. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు పోలీసులు ఆయనను బలవంతంగా సమావేశం నుంచి బయటకు తీసుకెళ్లారు.

# కొంపముంచిన న్యూఇయర్‌వేడుకలు!

అత్యధికంగా ఏటోన్స్ ÷ర్‌లోనే 16 మంది కాగా, పాలిసేడ్స్‌లో 8 మంది ఉన్నారు. మరణాల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఇక ఈ అగ్ని ప్రమాదాల్లో సుమారుగా 16 మంది తప్పిపోయినట్లు స్థానిక మీడియా నివేదించింది. మంటల ధాటికి ఇప్పటి వరకూ 12,000 నిర్మాణాలు అగ్నికి ఆహుతయ్యాయి. అంతేకాదు, పాలిసేడ్స్‌లో 23,707, ఏటోన్‌లో 14,117ఎకరాలు, కెన్నెత్‌లో 1,052, ముర్సెట్‌లో 779 ఎకరాలు దగ్ధమైనట్లు పేర్కొంది. మంటలను ఆర్పేందుకు కాలిఫోర్నియాతో పాటు అమెరికాలోని తొమ్మిది నగరాలు, మెక్సికోకు చెందిన అగ్నిమాపక బృందాలు పని చేస్తున్నాయి. కాగా, లాస్ ఏంజెల్స్‌లో నివసించే హాలీవుడ్ నటులు వారికి కేటాయించిన నీటి కంటే ఎక్కువ వినియోగించుకున్నారని, దీంతో ఇప్పుడు మంటలు ఆర్పేందుకు నీటి కొరత ఏర్పడిందని మర్శలు వ్యక్తమవుతున్నాయి. అమెరికా చరిత్రలోనే ఇది అత్యంత వినాశకరమైన ప్రకృతి వైపరీత్యమని కాలిఫోర్నియా గవర్నర్ గావిన్ న్యూసోమ్ అన్నారు. కార్చిచ్చు కొత్త ప్రాంతాలకు వ్యాపిస్తుండటం ఆందోళన కలిగిస్తున్నది. ప్రస్తుతం పాలిసేడ్స్ అగ్ని బ్రెంట్‌వుడ్ వైపు మళ్లింది. ఈ ప్రాంతంలో అమెరికా ఉపాధ్యక్షురాలు కమలా హారిస్‌తో పాటు పలువురు క్రీడాకారులు, నటీనటుల ఇండ్లు ఉన్నాయి. దీంతో ఉపాధ్యక్షురాలి హోదాలో చేయాల్సిన తన చివరి విదేశీ పర్యటనను కమలా హారిస్ రద్దు చేసుకున్నారు. మరోవైపు అమెరికాలోని టెక్సాస్, ఓక్లహోమా, మరికొన్ని రాష్ట్రాలను మంచు తుఫాను అతలాకుతలం చేస్తున్నది. లాస్ ఏంజెలెస్‌లోని కార్చిచ్చుల వ్యాప్తి కొనసాగుతూనే ఉంది. కొన్ని చిన్న మంటలను అదుపు చేసినా.. పాలిసేడ్స్, ఏటోన్ ప్రాంతాల్లో వ్యాపించిన మంటలను మాత్రం పూర్తిస్థాయిలో అదుపు చేయలేకపోతున్నారు. మరోవైపు నూతన సంవత్సర వేడుకల సందర్భంగా కాల్చిన బాణాసంచాతోనే ఇది మొదలైనట్లు అనుమానిస్తున్నారు. ఇప్పటివరకు ఈ అగ్ని ప్రమాదాల్లో మరణించిన వారి సంఖ్య 24కు చేరింది. అత్యధికంగా ఏటోన్ ఫైర్‌లోనే 16 మంది ప్రాణాలు కోల్పోగా.. పాలిసేడ్స్‌లో 8 మంది మరణించారు. ఈ సంఖ్య మరింత పెరగవచ్చని అధికారులు చెబుతున్నారు. అగ్నికీలల వ్యాప్తిని నెమ్మదింపజేయడానికి కొన్ని రసాయనాలు కలిపిన ఫోస్ చెక్ అనే మిశ్రమాన్ని దాదాపు 9 విమానాలు, 20 హెలికాప్టర్ల సాయంతో నగరంపై వెదజల్లుతున్నారు. పింక్ రంగులో ఉన్న ఆ పదార్థం అక్కడి నిర్మాణాలు, మొక్కలపైనా అవి పడి అగ్నికీలల వ్యాప్తిని నెమ్మదింపజేస్తుంది. దీనిలోని అమ్మోనియం పాలీఫాస్ఫేట్ అంతవేగంగా ఆవిరి కాదు. దేనిమీదైనా పడితే సుదీర్ఘకాలం ఉండిపోతుంది. ఇది వృక్షాలపై పడి.. అగ్నికి ఆక్సిజన్ అందకుండా చేయడంతో అవి వేగంగా వ్యాపించలేవు. లాస్ ఏంజెలెస్‌లో అతిపెద్దదైన పాలిసేడ్స్ ఫైర్ కారణం న్యూఇయర్ వేడుకలని అనుమానిస్తున్నారు. నూతన సంవత్సరం సందర్భంగా కాల్చిన టపాసులతో అంటుకొని అక్కడ అగ్నిప్రమాదం జరిగింది.

# కుంభమేళా షురూ..

మందికిపైగా భక్తులు తరలివస్తారని నిర్వాహకులు అంచనా వేస్తున్నారు. ఇది అమెరికా, రష్యా దేశాల జనాభా కంటే కూడా ఎక్కువ కావడం గమనార్హం. కుంభమేళా ప్రతి పన్నేండేళ్లకు ఒకసారి జరుగుతుంది. అయితే ఇప్పుడు జరిగేది మహా కుంభమేళా. ఈ మహా కుంభమేళా 144 ఏళ్లకు ఒకసారి జరుగుతుంది. ఇవాళ ప్రారంభమైన కుంభమేళా ఫిబ్రవరి 26 వరకు కొనసాగనుంది. ఈ మహా కుంభమేళా ఉత్తరప్రదేశ్ సర్కారును ఆర్థికంగా ఎంతో బలోపేతం చేయనుంది. ఈ 45 రోజుల మహా కుంభమేళా నిర్వహణ కోసం యూపీ సర్కారు రూ.7 వేల కోట్ల బడ్జెట్‌ను కేటాయించింది. అయితే మహా కుంభమేళాకు రూ.7 వేల కోట్లు ఖర్చు చేస్తే.. యూపీకి ఆదాయం రూపంలో దాదాపు రూ.2 లక్షల కోట్లు వచ్చే అవకాశం ఉన్నదని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. ఒకవేళ భక్తులు 45 కోట్ల మంది రాకపోయినా 40 కోట్ల మందే వచ్చినా.. ఒక్కో భక్తుడు రూ.5 వేల చొప్పున ఖర్చు చేసినా రాష్ట్రానికి రూ.2 లక్షల కోట్ల ఆదాయం సమకూరే అవకాశం ఉన్నదని వారు చెబుతున్నారు. ఇక భక్తులు రూ.10 వేల చొప్పున ఖర్చు చేస్తే మొత్తం రూ.4 లక్షల కోట్ల ఆదాయం సమకూరినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదని తెలిపారు. కాగా 2019లో జరిగిన అర్థ కుంభమేళా ద్వారా రాష్ట్ర



ప్రభుత్వానికి రూ.1.2 లక్షల కోట్ల ఆదాయం సమకూరినట్లు ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్ చెప్పారు. ఆ కుంభమేళాకు 24 కోట్ల మంది భక్తులు వచ్చారు. ఐదేళ్ల క్రితం 24 కోట్ల మంది భక్తులు వస్తేనే రూ.1.2 లక్షల కోట్ల ఆదాయం వచ్చినప్పుడు.. ఈసారి 40 కోట్ల మంది కంటే ఎక్కువ భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున రూ.2 లక్షల కోట్ల ఆదాయం రావడం అసాధ్యమేమీ కాదని ఎక్స్‌పర్ట్స్ చెబుతున్నారు.

# సందడిగా కైట్ ఫెస్టివల్

● చిన్న పెద్ద తేడా లేకుండా వేడుకల్లో పాల్గొన్న ప్రజలు

**హైదరాబాద్, జనవరి 13 (జనంసాక్షి) :** సంక్రాంతి పండుగ అంటే ముందుగా గుర్తుకు వచ్చేది ముగ్గులు.. ఆ తరువాత పతంగులు. సంక్రాంతి సందర్భంగా యువత ఎంతో ఉత్సాహంగా కైట్స్ ఎగురవేస్తుంటారు. మహిళలు ఇంటి ముందు పెద్ద పెద్ద ముగ్గులతో పండుగను జరుపుకోగా.. మగవారు పతంగులు ఎగురవేస్తూ ఆడి పాడి ఎంజాయ్ చేస్తుంటారు. చిన్నా పెద్దా అనే తేడా లేకుండా పతంగులు ఎగురవేస్తుంటారు. అలాగే సంక్రాంతి పండుగను పురస్కరించుకుని పలు చోట్ల కైట్స్ ఫెస్టివల్స్‌ను నిర్వహిస్తున్నారు. పెద్ద సంఖ్యలో ప్రజలు అక్కడకు చేరుకుని పతంగులు ఎగురవేస్తారు. ఒకరితో ఒకరు పోటీ పడి మరీ గాలిపటాలను ఎగురవేస్తారు. వివిధ రకాల పతంగులు ప్రస్తుతం మార్కెట్లలో లభిస్తున్నాయి. ఇక చిన్న పిల్లల జోష్ మామూలుగా ఉండదు. ఇంట్లోని తమ తండ్రి, అన్నలతో కలిసి పిల్లలు





కైట్స్‌ను ఎగురవేస్తూ ఆనందిస్తుండగా.. యువత తమ స్నేహితులతో కలిసి పతంగులు ఎగురవేస్తారు. అలాగే కైట్స్ ఫెస్టివల్‌ను డీజే మోతతో హోరెత్తిస్తుంటారు. మరోవైపు హైదరాబాద్‌లో పతంగుల సందడి మొదలైంది. సిటీలోని పలు ప్రాంతాల్లో కైట్స్ ఫెస్టివల్‌ను నిర్వహిస్తున్నారు. డీజే హోరు మధ్య భవనాలపై పతంగులు ఎగురుస్తున్నారు యువత. పోటాపోటీగా పతంగులు ఎగరేస్తూ యువత సందడి చేస్తోంది. బోయినపల్లిలో ఏర్పాటు చేసిన కైట్ ఫెస్టివల్‌లో చిన్నారులతో కలిసి మాజీ మంత్రి మల్లారెడ్డి పతంగులు ఎగిరవేశారు. మరోవైపు హైదరాబాద్‌లో మూడు రోజుల పాటు 7వ అంతర్జాతీయ కైట్ ఫెస్టివల్ జరుగనుంది. అంతర్జాతీయ కైట్ ఫెస్టివల్‌ను రాష్ట్ర పర్యాటక, భాషా సాంస్కృతిక శాఖ నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. ఈరోజు సాయంత్రం 4 గంటలకు నగరంలోని పరేడ్ గ్రౌండ్‌లో కైట్ ఫెస్టివల్ ప్రారంభమవగా.. దాదాపు 19 దేశాల నుంచి 47 మంది ఇంటర్నేషనల్ ప్రొఫెషనల్ కైట్ ఫ్లైయర్స్ ఫెస్టివల్‌లో పాల్గొననున్నారు. అలాగే14 రాష్ట్రాల నుంచి కైట్ ఫెస్టివల్‌లో 54 మంది నేషనల్ ప్రొఫెషనల్ కైట్ ఫ్లైయర్స్ పాల్గొంటారు. పతంగుల పండుగకు ఇండోనేషియా, స్విట్జర్లాండ్, ఆస్ట్రేలియా, శ్రీలంక, కెనడా, కంబోడియా, స్కాట్లాండ్, థాయిలాండ్, కొరియా, ఫిలిప్పీన్స్, వియత్నాం, మలేషియా, ఇటలీ, తైవాన్, సౌత్ ఆఫ్రికా, నెదర్లాండ్స్, తదితర దేశాలకు చెందిన 50 మంది కైట్ ఫ్లైయర్స్ హాజరుకానున్నారు. అలాగే గుజరాత్, పంజాబ్, తమిళనాడు, కేరళ, హరియాణా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ తదితర రాష్ట్రాలకు చెందిన 60 మంది క్రీడాకారులు తరలిరానున్నారు. ఈ మూడు రోజుల పాటు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు కైట్ ఫెస్టివల్ జరుగనుంది.

## అనతికాలంలోనే 'జనంసాక్షి'కి జనాదరణ

● జనంసాక్షి క్యాలెండర్‌ను ఆవిష్కరించిన మంత్రి శ్రీధర్ బాబు



మంథని, (జనంసాక్షి) : తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక జనంసాక్షి దినపత్రిక 2025 నూతన సంవత్సర క్యాలెండర్ ను సోమవారం సాయంత్రం హైదరాబాద్ లోని న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్ లో ఐటీ పరిశ్రమల, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. కరీంనగర్ కేంద్రంగా ఆవిర్భవించి అనతి కాలంలోనే జనంసాక్షి దినపత్రిక తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా తనదైన శైలిలో ప్రాచుర్యం పొంది ప్రధాన పత్రికల్లో ఒకటిగా నిలిచిందని కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలకు, పెద్దపల్లి జిల్లా ప్రజలకు, ముఖ్యంగా మంథని నియోజక వర్గ ప్రజలకు మంత్రి శ్రీధర్ బాబు ఈ సందర్భంగా సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో జనంసాక్షి మంథని ఆర్సి ఇన్చార్జి మాటేటి కుమార్, మహిళా కాంగ్రెస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షురాలు, రామగుండం కార్పొరేటర్ కొలిపాక సుజాత మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు ప్రభుత్వానికి వారధి 'జనంసాక్షి'

● జిల్లా అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్



**నిర్మల్ బ్యూరో, జనవరి 13 (జనంసాక్షి) :** ప్రజలకు,ప్రభుత్వానికి వారధిగా జనంసాక్షి దినపత్రిక మరింత ముందుకు సాగాలని నిర్మల్ జిల్లా అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ అన్నారు. నిర్మల్ జిల్లా కేంద్రంలో జనంసాక్షి దినపత్రిక నూతన సంవత్సర కాలసూచిక 2025ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని అన్నారు. సమాజంలోని లోపాలను పత్రికలలో వార్తలుగా రాస్తూ జనంసాక్షి దినపత్రిక ముందుండాలని ఆకాంక్షించారు. జనంసాక్షి పత్రిక వెలువడిన అతికొద్ది సమయంలోనే ఇంతింతై వటుడింతై ప్రదానపత్రికలతో పోటీపడుతూ ముందుకు సాగడం అభినందనీయమని అన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా విలేకరుల బృందం పాల్గొన్నారు.

## ముగిసిన అస్మిత ఫుట్‌బాల్ లీగ్ అండర్- 13

**రామకృష్ణాపూర్, జనవరి 13(జనంసాక్షి):** తెలంగాణ ఫుట్బాల్ అసోసియేషన్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఫుట్బాల్ అసోసియేషన్ సంయుక్తంగా పోటీల ఆర్గనైజర్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఫుట్బాల్ సెక్రటరీ పిన్నింటి రఘునాథ్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన అస్మిత ఫుట్బాల్ లీగ్ అండర్ - 13 ఉమెన్స్ లీగ్ సోమవారం రోజున ఘనంగా ముగిశాయి. ఈ పోటీలలో మొదటి బహుమతి తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ హకీంపేట, రెండో బహుమతి హైదరాబాద్ ఉమెన్స్ ఫుట్బాల్ క్లబ్, మూడవ బహుమతి పీకేఆర్ లెవెల్ స్టార్ క్లబ్, ఆదిలాబాద్, వాలాఫ్ ఖాన్ ఫుట్బాల్ ట్రోఫీని కేర్ ఫుట్బాల్ అకాడమీ నిజాంబాద్ వారు సొంతం చేసుకున్నారు. బెస్ట్ డిస్ప్లిన్ టీం అవార్డు గజ్వేల్ ఫుట్బాల్ క్లబ్ మెదక్ గెలుచుకున్నారు. ఎమర్జింగ్ ప్లేయర్స గా నక్షత్ర కేర్ ఫుట్బాల్ అకాడమీ నిజామాబాద్ సింధు పీకేఆర్ 11 ఫుట్బాల్ క్లబ్ అదిలాబాద్ ఎంపికయ్యారు.బెస్ట్ గోల్ కీపర్ గా దీక్షిత పి కే ఆర్ 11 ఫుట్బాల్ క్లబ్ ఆదిలాబాద్, బెస్ట్ డిపెండెర్‌గా హరిణి కేర్ ఫుట్బాల్ అకాడమీ నిజాంబాద్, బెస్ట్ మెడ్ పిల్లర్‌గా హిమబిందు హైదరాబాద్ ఉమెన్స్ ఫుట్బాల్ క్లబ్, ఖమ్మం టోర్నమెంట్ టాప్ స్కోరర్,ధృతి తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ హకీంపేట,ప్లేయర్ ఆఫ్ ద టోర్నమెంట్,అక్షర హైదరాబాద్ ఉమెన్స్ ఫుట్బాల్ క్లబ్ ఖమ్మం అవార్డులను గెలుపొందారు. గెలుపొందిన వారికి మంచిర్యాల ఆర్డీఓ జి. శ్రీనివాస్ రావు, మందమర్రి సి ఐ శశిధర్ రెడ్డి , ఏ ఐ టి యు సి రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, క్యాతనపల్లి మునిసిపల్ కమిషనర్ గద్దె రాజు హాజరై విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలకు క్రీడలలో పాల్గొనడం చాలా ముఖ్యమని క్రీడలు క్రమశిక్షణను అలవరుస్తాయని , మానసిక ఒత్తిడిని తగ్గిస్తాయని, ఆలోచనా శక్తిని పెంచుతాయని తెలిపారు. క్రీడలు వల్ల క్రీడాకారుల సహకార నైపుణ్యాలను మెరుగుపరుస్తాయని, ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయని అన్నారు. ముఖ్యంగా ఆటలు ఆడటం వల్ల మనిషి ఆరోగ్యంగా ఉంటాడనీ , సామాజికంగా ఉండడానికి కూడా అవకాశాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మందమర్రి ఎస్ ఓ టు జి ఎం, విజయేంద్ర ప్రసాద్, సివిల్ డీఈ శ్రీధర్, రామకృష్ణాపూర్ ఎస్ఐ రాజశేఖర్, కాంగ్రెస్ పార్టీ పట్టణాధ్యక్షుడు పల్లె రాజు , జిల్లా అధికార ప్రతినిధి వోడ్నాల శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గోపతి రాజయ్య , సీనియర్ నాయకులు నీలం శ్రీనివాస్ గౌడ్, గాండ్ల సమ్మయ్య, మాజీ ఎంపిపి మహంకాళి శ్రీనివాస్ , క్యాతనపల్ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ విద్యాసాగర్ రెడ్డి, ఏ ఐ టి యు సి బ్రాంచి సెక్రటరీ అక్బర్ అలీ, వ్యాయామ ఉపాధ్యాయులు సీనియర్ క్రీడాకారులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.




## పశువుల అందాల పోటీలో ప్రైజ్ మనీ కొట్టేసిన ఖానాపురం పొట్టేళ్లు

**ఖానాపురం, జనవరి13 (జనంసాక్షి) :** ప్రతి ఏటా శాంతి రైతు సేవా సంఘం ఆధ్వర్యంలో నర్సంపేట పట్టణంలో నిర్వహించే డివిజన్ స్థాయి పశువుల అందాల పోటీల్లో సోమవారం ఖానాపురం గ్రామానికి చెందిన తండ్రి కూతుర్లు జటంగి రాజ్ కుమార్, జటంగి రాజేశ్వరి గొర్రె పొట్టేళ్లకు ప్రథమ, ద్వితీయ బహుమతులు గెలుచుకొని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి చేతుల మీదుగా ప్రైజ్ మనీ అందుకున్నారు. ఈ సందర్భంగా గొర్రె పొట్టేళ్లను అందంగా ముస్తాబు చేసి వరుసగా రెండవసారి ఖానాపురం మండల కేంద్రానికి చెందిన జటంగి రాజ్ కుమార్ కు చెందిన పొట్టేళ్లకు బహుమతులు పొందారు. ఈ సందర్భంగా పశువుల అందాల పోటీల్లో ఖానాపూర్ మండల కేంద్రానికి వరుసగా రెండోసారి బహుమతులు రావడం కోసం పొట్టేళ్లను ముస్తాబు చేసిన తండ్రి కూతుర్లను గ్రామస్థులు అభినందించారు.







## మా సైనికులను విడుదల చేయండి

రష్యా వద్ద బందీలుగా ఉన్న మా వారిని విడుదల చేస్తేనే వీరిని ఉత్తర కొరియాకు అప్పగిస్తాం" అని జెలెన్‌స్కీ సోషల్ వీరీడియా వేదికగా పేర్కొన్నారు. వారికి సంబంధించిన వీడియోను కూడా షేర్ చేశారు. పట్టుబడిన సైనికుల గురించి ఉక్రెయిన్ భద్రతా సర్వీస్ ఎస్‌బీయూ అధికారులు మాట్లాడుతూ.. ఒక సైనికుడు దగ్గర ఎలాంటి ధ్రువపత్రం లేదని, మరో సైనికుడి దగ్గర రష్యా మిలిటరీ కార్డు ఉందని తెలిపారు. రష్యా%-%ఉక్రెయిన్ యుద్ధంలో రష్యాకు మద్దతుగా దాదాపు 10వేల మంది ఉత్తరకొరియా సైనికులు రంగంలోకి దిగారని ఉక్రెయిన్ ఆరోపిస్తూ వచ్చింది. కానీ దీనిపై మాస్కో మాత్రం ఎలాంటి ప్రకటనా ఇవ్వలేదు. రష్యా సైన్యానికి మద్దతుగా పోరాడుతున్న ఉత్తరకొరియా సైనికులు కూడా భారీగా చనిపోయినట్లు ఇప్పటికే జెలెన్‌స్కీ ప్రకటించారు. అయితే అందులో వారి పేర్లు, వివరాలను మార్చేసి రష్యాకు చెందిన వారిగా తప్పుడు పత్రాలు సృష్టించినట్లు గుర్తించామని పేర్కొన్నారు. ఉత్తరకొరియా సైనికులను సజీవంగా పట్టుకోవడం అంత సులభం కాదని జెలెన్‌స్కీ అన్నారు. యుద్ధంలో వారి పాత్ర బయటపడకూడదనే ఉద్దేశంతో గాయపడిన ఆ దేశ సైనికులు తమకు చిక్కకుండా ఉండేందుకు రష్యా వారిని కాల్చి చంపేస్తోందని ఆరోపించారు. వారు తప్పుడు గుర్తింపు కార్డులతో రష్యా సైనికుల తరహా దుస్తుల్ని ధరించి పనిచేస్తున్నారని, చూడడానికి మాస్కో దళాల మాదిరిగానే కనిపిస్తున్నారని ఉక్రెయిన్ వర్గాలు చెబుతున్నాయి. అంతర్గత సంభాషణల్ని రహస్యంగా విన్నప్పుడు వారు ఉత్తర కొరియా యాసలో మాట్లాడుతున్నట్లు బయటపడిరదన్నారు.

## నిష్పక్షపాత వార్తలనే పత్రికలు ప్రచురించాలి

● జనంసాక్షి క్యాలెండర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే



**మంచిర్యాల ప్రతినిధి, జనవరి 13 (జనంసాక్షి) :** మంచిర్యాల జిల్లా జనంసాక్షి దినపత్రిక నూతన సంవత్సర క్యాలెండర్‌ను మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ సాగర్ రావు ఆవిష్కరించారు. సోమవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో జనంసాక్షి 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పత్రికలు ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా ఉంటూ నిష్పక్షపాత వార్తలను ప్రచురించాలని అన్నారు. నేటి సమాజంలో మీడియా పాత్ర గొప్పదని, ప్రజల సమస్యలను వార్తల రూపంలో పాలకులకు అందిస్తూ వారధిగా నిలవాలని అన్నారు. ప్రజలకు భోగి ,మకర సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనంసాక్షి బ్యూరో ఇంచార్జ్ పింగిళి సంపత్ రెడ్డి, పిఆర్ఓ శ్రీధర్, మంచిర్యాల ఆర్‌సి సారంగ రావు, నస్పూర్ రిపోర్టర్ నరేందర్ గౌడ్,లక్సెట్టిపేట రిపోర్టర్ సత్యనారాయణ, జైపూర్ రిపోర్టర్ సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు

● మాజీ సీఎం కేసీఆర్



**హైదరాబాద్, జనవరి 13 (జనంసాక్షి) :** రాష్ట్ర ప్రజలకు బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. సంక్రాంతి రైతులు, వ్యవసాయానికి ప్రత్యేకమైన పండుగ అని చెప్పారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ వ్యవసాయానికి పండుగ శోభ సంతరించుకుందన్నారు. దేశంలో మరెక్కడా లేని విధంగా రైతు సంక్షేమానికి పెద్దపీట వేసిన ఘనత బీఆర్ఎస్ పార్టీదే అన్నారు. 'పండిన పంటల రాశులతో ఇండ్లు కళకళలాడుతుంగా, రైతుల జీవితాల్లో సంక్రాంతి శోభ నిండుదనాన్ని సంతరించుకుంటుంది. నూతన తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయం పండుగ కావాలని నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక పథకాలు ప్రారంభించింది. రైతు సంక్షేమమే తొలి ప్రాధాన్యతాంశంగా నాడు అమలు చేసిన కార్యాచరణ పదేండ్ల అనతికాలంలోనే సత్ఫలితాలు ఇచ్చింది. 24 గంటల ఉచిత విద్యుత్, రైతుబంధు, రైతు బీమా పథకాలు పటిష్ఠంగా అమలు చేశాం. తద్వారా సాధించిన వ్యవసాయ ప్రగతి ప్రపంచవ్యాప్తంగా పలు ప్రశంసలు అందుకుంది. దేశానికే తెలంగాణను ఆదర్శంగా నిలిపామని తెలిపారు. కుల వృత్తులకు నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం అందించిన ప్రోత్సాహం, ఆర్థిక సహకారం సబ్బండ కులాల జీవితాల్లో సంక్రాంతి శోభను నింపింది. పదేండ్ల బీఆర్ఎస్ సర్కార్ వ్యవసాయరంగ అభివృద్ధి కోసం దాదాపు నాలుగున్నర లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేసింది. రైతుల జీవితాల్లో వెలుగు నింపాలనే దృఢ సంకల్పంతో ముందుకెళ్లాం. ఉమ్మడి రాష్ట్రంలో దండగన్న తెలంగాణ వ్యవసాయం బీఆర్ఎస్ హయాంలో పండుగలా మారింది. రాజకీయాలకు అతీతంగా రైతన్న సంక్షేమమే ధ్యేయంగా పదేండ్ల ప్రగతి ప్రస్థానాన్ని నేటి ప్రభుత్వం కొనసాగించాలి.' అని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు.

## భోగి వేడుకల్లో పాల్గొన్న మాజీ మంత్రి కేటీఆర్

**హైదరాబాద్, జనవరి 13 (జనంసాక్షి) :** తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతి సందడి మొదలైంది. మకర సంక్రాంతికి ముందు రోజు వచ్చే భోగి పండుగను తెలుగు ప్రజలు ఘనంగా జరుపుకుంటున్నారు. పిల్లలు, పెద్దలు ఉదయాన్నే వీధుల్లో భోగి మంటలు వేసి సందడి చేశారు. సామాన్య ప్రజలతోపాటు సినీ, రాజకీయ ప్రముఖులు సైతం భోగి వేడుకల్లో పాల్గొన్నారు. ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ఇంట్లో భోగి సెలబ్రేషన్స్ ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీశ్‌రావు పాల్గొన్నారు. ఆయనతోపాటు ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, ముఠా గోపాల్, బండారి లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే బల్క సుమన్, పట్లోల్ల కార్తిక్ రెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.





### రాష్ట్ర ప్రజలందరికీ కవిత భోగీ పండుగ శుభాకాంక్షలు

తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత భోగీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కేబీఆర్ పార్క్ వద్ద తెలంగాణ సంస్కృతి ఆధ్వర్యంలో వైభవంగా భోగి వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలకు ఎమ్మెల్సీ కవిత ముఖ్య అతిథిగా హాజరై భోగి మంటలను వెలిగించారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున మహిళలు వచ్చారు.

## పండుగ పూట నీటి కష్టాలు

**హైదరాబాద్, జనవరి 13 (జనంసాక్షి) :** నగరంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం నుంచి 24 గంటల పాటు నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడనుంది. ఈ మేరకు హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు ఓ ప్రకటనను విడుదల చేసింది. హైదరాబాద్‌కు తాగు నీటిని సరఫరా చేసే మంజీరా ప్రాజెక్ట్ ఫేజ్-2లో మరమ్మతుల కారణంగా నీటి సరఫరా నిలిచిపోనున్నట్లు అధికారులు తెలిపారు. కలబ్‌గూర్ నుంచి హైదర్‌నగర్ వరకు ఉన్న 1500 ఎంఎం డయామీటర్ పంపింగ్ మెయిల్‌లో పలు చోట్ల భారీగా లీకేజ్‌లు ఏర్పడిందని.. దీనివల్ల నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడిందని జలమండలి అధికారులు వెల్లడించారు. లీకేజ్ మరమ్మతులు చేపట్టామని.. దీంతో తాత్కాలికంగా నీటి సరఫరా నిలిచిపోనున్నట్లు తెలిపారు. దాదాపు 24 గంటల పాటు.. అంటే ఈరోజు ఉదయం 6 గంటల నుంచి రేపు ఉదయం (జనవరి 14) 6 గంటల వరకు నీటి సరఫరా నిలిచిపోనున్నట్లు వెల్లడించారు. నీటి సరఫరాలో అంతరాయం నేపథ్యంలో ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని జలమండలి అధికారులు సూచనలు చేశారు.

## డీసీఎం వ్యాన్‌ను ఢీకొట్టిన కారు

● ఒకరు మృతి.... నలుగురు తీవ్ర గాయాలు

**పెద్దపల్లి, జనవరి 13 (జనంసాక్షి) :** పెద్దపల్లి జిల్లాలో పండుగపూట విషాదం చోటు చేసుకుంది. ఆగి ఉన్న డీసీఎంను కారు ఢీ కొట్టడంతో ఒకరు మృతి చెందగా మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళ్తే... జిల్లాలోని గోదావరిఖని ఇందిరా గాంధీ చౌరస్తా వంక బెండు వద్ద ఆగి ఉన్న వ్యానును ఢీ కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఒకరు మృతి చెందగా మరో చిన్నారి పరిస్థితి విషమంగా ఉంది. గమనించిన స్థానికులు క్షతగాత్రులను హాస్పిటల్‌కు తరలించి పోలీసులకు సమాచారమిచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## హామీలు అమలు చేసే వరకు పోరాడుతాం

● మాజీ మంత్రి జోగురామన్న




**ఆదిలాబాద్, జనవరి 13 (జనంసాక్షి) :** కేవలం అధికారంలోకి రావటానికే మాత్రమే హామీలు గుప్పించి ఇప్పుడు హామీలు అమలు చేయడం లేదని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేసేంత వరకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఉద్యమిస్తూనే ఉంటామని తెలిపారు. సోమవారం రైతు భరోసా కింద రూ.15000 అందజేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆదిలాబాద్‌లో ఆందోళన చేపట్టారు. మాజీ మంత్రి జోగురామన్న ఆధ్వర్యంలో అదిలాబాద్ బస్టాండ్ ముందు బైఠాయించి నిరసన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన మాట తప్పి మోసం చేసిందని జోగు రామన్న ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు పోరాడుతామన్నారు. కాగా, పోలీసులు శాంతియుతంగా నిరసన చేపడుతున్న జోగు రామన్న అడ్డుకున్నారు.

## భర్తను చంపిన ఇద్దరు భార్యలు

**సూర్యాపేట, జనవరి 13 (జనంసాక్షి) :** భర్తను ఇద్దరు భార్యలు కలిసి ఘోరంగా హత్య చేసిన సంఘటన చివ్వెంల మండలం గుర్రంతండాలో ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం గుర్రంతండాకు చెందిన ఓ వ్యక్తికి ఇద్దరు భార్యలు ఉన్నారు. ఇక భర్తపై కక్ష పెంచుకున్న భార్యలు.. అతన్ని అంతమొందించాలని నిర్ణయించుకున్నారు. దీంతో గుట్టుచప్పుడు కాకుండా ఆదివారం అర్ధరాత్రి రోకలి బండతో కొట్టిచంపారు. ఈ ఘటనపై స్థానికులు పోలీసులను అప్రమత్తం చేశారు. పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. భర్తను చంపిన ఇద్దరు భార్యలను పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## సంక్రాంతి ముసుగులో నిబంధనలు ఉల్లంఘన

● ఆర్‌టిఎ తనిఖీల్లో ప్రైవేట్ ట్రావెల్స్‌పై 300 కేసులు



**హైదరాబాద్, జనవరి13 (జనంసాక్షి) :** సంక్రాంతి నేపథ్యంలో నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న ప్రైవేటు ట్రావెల్స్‌పై రవాణాశాఖ కొరడా ఝుళిపించింది. గత నాలుగు రోజులుగా రవాణాశాఖ తనిఖీలు చేపట్టింది. హైదరాబాద్, రంగారెడ్డి, నల్గొండ, నిజామాబాద్, మహబూబ్ నగర్ తదితర ప్రాంతాల్లో 12 ప్రత్యేక బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేపట్టింది. హైదరాబాద్ నగరంలోని ఎల్బీ నగర్, ఆరాంఘర్ వద్ద తనిఖీల సందర్భంగా నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతోన్న ప్రైవేట్ ట్రావెల్స్‌పై 300లకు పైగా కేసులు నమోదు చేసినట్లు రవాణాశాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ జాయింట్ ట్రాన్స్ పోర్ట్ కమిషనర్ చంద్రశేఖర్ గౌడ్ తెలిపారు. తనిఖీలు నిరంతరం కొనసాగుతూనే ఉంటాయని స్పష్టం చేశారు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో ప్రైవేట్ ట్రావెల్స్ యజమానులు ఇష్టారాజ్యంగా ప్రయాణికుల నుంచి ఛార్జీలు వసూలు చేస్తున్నట్లు తమకు ఫిర్యాదులు వస్తున్నాయని..ఆ నేపథ్యంలో విస్తృత తనిఖీలు చేపట్టామన్నారు. వీటితో పాటు నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వాహనాలపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు.

# సంక్రాంతి రోజు భోగి పళ్ళు ఎందుకు పోసుకుంటారు?



భోగి రోజు అన్ని చెడు కర్మలు తొలగాలి అని పాతవస్తువులు భోగి మంటవేస్తారు. ఆ భోగిను 0డి దీపం తెచ్చి ఇంట్లో దేవుడి ముందుఉంచుతారు. ఇదిసంప్రదాయం. దాంతో పాటు ఆరోజు సాయంత్రం ఐదు సంత్సారాలలోపు పిల్లలకు భోగి పండ్లుపోస్తారు. పిల్లలకు ఐదు సంత్సరంలోపు ఉండే 'బాలఅరిష్టాలు, దిష్టి తొలగి పోయిఆరోగ్యంగా ఉండాలి.' అని కోరుకొని ఈపండ్లు పోస్తారు.ఆ వయసు పిల్లలకు బ్రహ్మరంధ్రం పలుచగా ఉంటుంది రేఖి అరా కూడా పలచగా ఉంటుంది. ఈ రేగి పండ్లుకి రోగని రోధక శక్తిని ఇచ్చే పోషక విలువలు ఉంటుంది. అవిపోసిన సమయం రేగి పండ్లు నుండి వచ్చే వాయువు పిల్లలతలపైన బ్రహ్మరంధ్రానికి శక్తినిఇస్తుంది. మేధస్సుకి శక్తి వస్తుంది. ఈ పండ్లు తలపైన నుండిపడటం వల్లతలలోని, మెదడులోని నరాలకు రేగిపండ్ల నుండ వచ్చేవాయువు వల్ల ఆక్టివ్ అవుతారు. శీతాకాలంలోవచ్చేజబ్బులువల్లపిల్లలు మెతక బడి పోతారు. ఈ రేగి పళ్లలో ఎక్కువగా ఆక ర్షించే గుణం వల్ల పిల్లలకు ఆరో గ్యం లభిస్తుంది. ఇది ఒకశాస్త్రీ యసంప్రదాయం.అలాగేచుట్టూ ఉండే అరాబలపడుతుంది. ఎటువంటి పరిస్థితులు అయినా ఎదుర్కనే శక్తి పిల్ల లకురావాలి అనే ఉద్దేశంతో ఈ రేగి పండ్లునే పోస్తారు, అలాగే పిల్లలకు ఉన్న దిష్టి ప్రభావం తగ్గుతుంది. చుట్టు పక్కల వారు కూడా వచ్చివారు కూడా రేగి పండ్లు పోయడంవల్ల పిల్ల లకు అందరి కలు గుతుంది. రేగుపళ్లలో 'సి'విటమిన్ చాలా ఎక్కువగా ఉంటుంది. పైగా జీర్ణసంబంధమైన వ్యాధులను నివారించేందుకు, ఉదర సంబంధ ఇబ్బందుల నుంచి ఉపశమనం కలిగించేందుకు రేగుపళ్లు ఉపయోగపడతాయి. అందుకే రేగుపళ్లని ఎండుపెట్టి వాటితో వడియాల నురేగు తాండ్రనూచేసుకుని తినేఅలవాటుఇప్పటికీ తెలుగునాటఉంది. ఇంకోకారణం భోగి ముగిశాక సూర్యుడు దక్షిణాయణం నుం చిఉత్తరాయణానికి మరలుతాడు. ఆ రోజే మకరరాశిలోకి అడుగుపెడతాడు. సంక్రాంతి సూర్యుడి పండుగ కాబట్టి సూర్యుణ్ని పోలినగుండ్రని రూపం, ఎర్రటిరంగు కారణంగా దీనికి అర్కఫలం అనేపేరు వచ్చింది. సూర్యభగవానుడి ఆశీస్సులు పిల్లవాడికి లభించాలనే సచనగా ఈభోగి పండ్లను పోస్తారు. రేగిపండ్లును బదరీఫలం అంటారు. సాక్షాత్తూ ఆనరనారాయణులు ఈబదరీవృక్షం రెగుచేట్టు వద్ద ఆశ్రమాన్ని ఏర్పాటు చేసుకున్నారనీ ఫలాలని తింటూతమ తపస్సుని కొనసాగించారనీ ప్రతీతి. వారుతపస్సుచేసేసమయంలో దేవతలు వారి తలపైన రేగి పండ్లు కురిపించారుఅంటారు, చెబుతారు. భారతీయ వాతావరణానికి తగినట్లుగా నేరేగుచెట్లు ఎలాంటి ఒడుదొడుకులనైనా ఎదుర్కొని పెరుగుతుంది. -15డిగ్రీల 50డిగ్రీల వరకూ ఎలాంటిఉష్ణోగ్రతనైనా తట్టుకుని నిలబడుతుంది. మన దేశంలోనే కాకుండా తూర్పు దేశాల న్నింటిలోనూ రేగుని తమ సంప్రదాయ వైద్యంలోవాడతారు. జలుబు దగ్గర నుంచీ సంతానలేమి వరకూ రేగుని అన్నిరకాల రుగ్మతలకీ దివ్యౌషధంగా భావిస్తారు. రేగుపళ్లు ఉన్నచోట క్రిమికీటకాలు దరిచేరవని ఒక నమ్మకం. ఈ పండ్ల నుంచి వచ్చే వాసన మనసు మీద ఆహ్లాదకరమైన ప్రభావం చూపిస్తుంది. భూటాన్‌లో అయితే కేవలం ఇంటిని సువాసన భరితంగా ఉంచేందుకు ఈ పళ్లను మరిగిస్తారు. రేగిపండ్లు, బంతిపూల రెక్కలు వీటికివాయువులో ఉండే క్రిములను నాశన ముచేసేగుణం ఉంది. చిల్లర కూడా కలిపి పిల్లలతలపైన నుండి దోసిటీతో పోయాలి. చివరిగా దిష్టి తీయాలి. అలా పోసే టప్పుడుఇంటి దేవుణ్ణి స్మరించాలి. చివరిగా చివరిగా కర్పూరంతో పిల్లలకు దిష్టితీయాలి. పిల్లలు లేనివారు కొత్త దంపతులు చిన్నికృష్ణునికి బోగిపళ్ళుపోసి పూజచేసి పిల్లలు కోరుకోవాలి, పిల్లలుపెద్దవాళ్ళు అయిఉంటే ఆఇంట్లో సరదాగా భక్తిగా కూడా కృషుడికి భోగి పళ్ళు పోసి వేడుకగా భజన చేయవచ్చు. 12 సంవస్తారాలలోపు పిల్లలకు బోగి పళ్ళు పోయవచ్చు.

**ఉమాశేషారావు వైద్య**
**లెక్చరర్, 9440408080**

# రైతుల జీవితాలను మార్చే సాంకేతికత




డిజిటల్ విప్లవాన్ని వ్యవసాయానికి విస్తరించడం ద్వారా, ఆర్థిక వ్యవస్థలోని క్లిష్టమైన రంగాలకు వినూత్న, సాంకేతికతతో నడిచే పరిష్కారాలలో ప్రపంచంలో అగ్ర స్థానాన్ని మరింత పటిష్టం చేసుకోవాలని మనదేశం లక్ష్యంగా పెట్టుకుంది. రైతులకు ఆదాయ మద్దతును పెంచడం ద్వారా రైతుల సంక్షేమం కోసం భారత ప్రభుత్వం చేపట్టిన వివిధ పథకాలు, కార్యక్రమాలు, దేశంలో వ్యవసాయం వేగంగా, విస్తృతంగా అభివృద్ధి చెందడానికి కేంద్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టింది. అందులో డిజిటల్ అగ్రికల్చర్ మిషన్ ఒకటి. డిజిటల్ గుర్తింపు, సురక్షిత చెల్లింపులు, లావాదేవీలు దేశంలోని డిజిటల్ విప్లవానికి కొత్త బాటలు వేశాయి. ఇటీవలి సంవత్సరాల్లో పాలన తీరును, సేవా పంపిణీ వ్యవస్థను గణనీయంగా మార్చాయి. ఈ పురోగతి ఆర్థిక, ఆరోగ్య సంరక్షణ, విద్య, రిటైల్‌తో సహా వివిధ రంగాలలో అభివృద్ధి చెందుతున్న డిజిటల్ విస్తారిత వ్యవస్థకు మార్గం సుగమం చేసింది. పౌర కేంద్రీకృత డిజిటల్ పరిష్కారాలలో భారతదేశాన్ని అగ్రగామిగా నిలిపింది. ఈ పరివర్తన క్రమంలోనే ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన గత సెప్టెంబర్ నెల 2వ తేదీన జరిగిన కేంద్ర మంత్రివర్గ కమిటీ గణనీయమైన ఆర్థిక వ్యయం రూ.2,817 కోట్లతో 'డిజిటల్ అగ్రికల్చర్ మిషన్'కు ఆమోదం తెలిపింది. ఇందులో కేంద్ర ప్రభుత్వ వాటా రూ. 1,940 కోట్లు.

**ఒకే గొడుగు కిందకు అన్ని కార్యక్రమాలు :** డిజిటల్ వ్యవసాయ కార్యక్రమాలకు మద్దతు ఇవ్వడానికి వివిధ కార్యక్రమాలను ఒకే గొడుగు కిందకు తెచ్చే పథకంగా డిజిటల్ అగ్రికల్చర్ మిషన్ ను రూపొందించారు. వీటిలో డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (డీపీఐ), డిజిటల్ జనరల్ క్రాప్ ఎస్టిమేషన్ సర్వే (డీజీసీఈఎస్)ని అమలు చేయడం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, విద్యా, పరిశోధనా సంస్థల ద్వారా ఐటీ కార్యక్రమాలకు మద్దతు ఇవ్వడం వంటివి ఉన్నాయి. ఈ పథకం రెండు మూల స్తంభాలపై రూపొందించారు..అగ్రిస్టాక్, కృషి డెసిషన్ సపోర్ట్ సిస్టం, అదనంగా ఈ మిషన్ 'సాయిల్ ప్రొఫైల్ మ్యాపింగ్'ను కలిగి ఉంది. వ్యవసాయ రంగానికి సకాలంలో నమ్మదగిన సమాచారాన్ని అందించడానికి రైతు కేంద్రిత డిజిటల్ సేవలను ప్రారంభించడం లక్ష్యంగా పెట్టుకుంది.

**అగ్రిస్టాక్ :** కిసాన్ కి పెహచాన్ సేవలు, పథకం అమలు వ్యవస్థను క్రమబద్ధీకరించడానికి రైతు కేంద్రీకృత డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (డీపీఐ)గా రూపొందించారు. ఇది మూడు కీలక భాగాలను కలిగి ఉంటుంది. రైతుల రిజిస్ట్రీ, జియో-రిఫరెన్స్ గ్రామ మ్యాప్‌లు, సాగు అయ్యే పంట రిజిస్ట్రీ. అగ్రిస్టాక్ కీలకమైన అంశం ఏమిటంటే రైతులకు విశ్వసనీయమైన డిజిటల్ గుర్తింపుగా ఉపయోగపడే ఆధార్ కార్డ్ మాదిరిగానే 'రైతు ఐడీ'ని ప్రవేశపెట్టడం. రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రపాలిత ప్రాంతాల రూపొందించి, నిర్వహించే ఈ ఐడీలు భూమి రికార్డులు, పశువుల యాజమాన్యం, పంట సాగు, పొందే ప్రయోజనాలతో సహా వివిధ రైతు సంబంధిత డేటాకు అనుసంధానం అయి ఉంటుంది. వ్యవసాయ మంత్రిత్వ శాఖతో 19 రాష్ట్రాలు అవగాహన ఒప్పందాలపై సంతకాలు చేయడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యం ద్వారా అగ్రిస్టాక్ అమలు పురోగమిస్తోంది. రైతు ఐడీల రూపకల్పనకు, డిజిటల్ క్రాప్ సర్వేను పరీక్షించడానికి ఆరు రాష్ట్రాలైన ఉత్తరప్రదేశ్ (ఫరూఖాబాద్), గుజరాత్ (గాంధీనగర్), మహారాష్ట్ర (బీడ్), హర్యానా (యమునా నగర్), పంజాబ్ (ఫతేగఢ్ సాహిబ్), తమిళనాడు (విరుధ్‌నగర్) పైలట్ ప్రాజెక్టులు చేపట్టారు.

**ముఖ్య లక్ష్యాలు :** మూడేళ్లలో 11 కోట్ల మంది రైతులకు డిజిటల్ గుర్తింపులను రూపొందించడం (2024-25 ఆర్థిక సంవత్సరంలో 6 కోట్లు, 2025-26 ఆర్థిక సంవత్సరంలో 3 కోట్లు, 2026-27 ఆర్థిక సంవత్సరంలో 2 కోట్లు). 2024-25 ఆర్థిక సంవత్సరంలో 400 జిల్లాలు, 2025-26 ఆర్థిక సంవత్సరంలో అన్ని జిల్లాలను కవర్ చేస్తూ రెండేళ్ళలో దేశవ్యాప్తంగా డిజిటల్ క్రాప్ సర్వేను ప్రారంభించడం. కృషి డెసిషన్ సపోర్ట్ సిస్టమ్ (డీఎస్ఎస్) అనేది పంటలు, నేల, వాతావరణం, నీటి వనరులపై రిమోట్ సెన్సింగ్ డేటాను సమగ్ర భౌగోళిక వ్యవస్థకి అనుసంధానిస్తుంది. మట్టి ప్రొఫైల్ మాపింగ్ మిషన్ కింద దేశంలోని వ్యవసాయ భూమిలో దాదాపు 142 మిలియన్ హెక్టార్ల విస్తీర్ణంలో 1:10,000 స్కేల్ తో పూర్తి భూ సారం లక్షణాల చిత్రపటాన్ని రూపొందించడాన్ని పూర్తి చేయాలని భావిస్తున్నారు. సుమారు 29 మిలియన్ హెక్టార్ల మట్టి ప్రొఫైల్ సమాచార నిధి ఇప్పటికే పూర్తయింది.

ఉపాధి కల్పన : డిజిటల్ అగ్రికల్చర్ మిషన్ కింద, డిజిటల్ జనరల్ క్రాప్ ఎస్టిమేషన్ సర్వే (డీజీసీఈఎస్) వ్యవసాయ ఉత్పత్తి ఖచ్చితత్వాన్ని పెంపొందించడానికి ఖచ్చితమైన దిగుబడి అంచనాలను అందించడానికి పంట కోత ప్రయోగాలకు ఉపయోగిస్తారు.

ఈ మిషన్ వ్యవసాయంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధిని కల్పిస్తుందని, దాదాపు 2,50,000 మంది శిక్షణ పొందిన స్థానిక యువతకు, కృషి సఖిలకు అవకాశాలను కల్పిస్తుందని భావిస్తున్నారు. డేటా అనలిటిక్స్, ఏఐ, రిమోట్ సెన్సింగ్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడం ద్వారా, ఈ మిషన్ రైతులకు- ప్రభుత్వ పథకాలు, పంట రుణాలు, సలహాలు ఇవ్వడంతోపాటు అన్ని రకాల సేవలను అందిస్తారు.

**మిషన్ ముఖ్య భాగాలు :** డిజిటల్ అగ్రికల్చర్ మిషన్ ఎలాంటి మినహాయింపులూ లేకుండా అమలు చేయడంపై దృష్టి పెడుతుంది. రైతులను ప్రాథమిక లబ్ధిదారులుగా భావిస్తోంది.

**మిషన్ ప్రయాజనాలు :** సేవలు, ప్రయోజనాలు అందుబాటులోకి రావడంతో పాటు, రాతపనిని తగ్గించడం, వ్యక్తిగతంగా సందర్శించే అవసరం తగ్గించడం కోసం డిజిటల్ ప్రమాణీకరణ జరుగుతుంది. పంట విస్తీర్ణం, దిగుబడిపై ఖచ్చితమైన డేటా ద్వారా ప్రభుత్వ పథకాలు, పంటల బీమా, రుణ వ్యవస్థలలో మెరుగైన సామర్థ్యం, పారదర్శకత. మెరుగైన విపత్తు ప్రతిస్పందన, బీమా క్లెయిముల కోసం క్రాప్ మ్యాప్ రూపకల్పన, పర్యవేక్షణ కలిగి ఉంటుంది. డిజిటల్ మౌలిక వ్యవస్థ ద్వారా అన్ని విభాగాల నుంచీ లాభం చేకూరేలా చూడటం, పంట ప్రణాళిక, ఆరోగ్యం, తెగుళ్ల నిర్వహణ, నీటిపారుదల కోసం తగిన సలహా సేవలను అందిస్తారు.

**డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ :** కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2024-25 కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రాల భాగస్వామ్యంతో వచ్చే మూడేళ్లలో వ్యవసాయానికి డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (డిపిఐ)ని అమలు చేయనున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమం ఈ సంవత్సరం 400 జిల్లాలకు ఖరీఫ్ కోసం డిజిటల్ పంట సర్వేతో రైతులు, వారి భూములను దీని పరిధిలోకి తెస్తారు. 6 కోట్ల మంది రైతులు, వారి భూముల వివరాలతో రిజిస్ట్రీలను తాజా సమాచారంతో నింపుతారు. యూనియన్ బడ్జెట్ 2023-24 గతంలో వ్యవసాయం కోసం డీపీఐని ప్రవేశపెట్టింది. ఇది జనాభా వివరాలు, భూమి హక్కులు, సాగులో ఉన్న పంటలతో సహా రైతులపై సమగ్ర డేటాను అందించడాన్ని లక్ష్యంగా పెట్టుకుంది. పశువులు, చేపల పెంపకం, నేల ఆరోగ్యం, అందుబాటులో ఉన్న ప్రయోజనాలపై సమాచారంతో సహా రైతు-కేంద్రిత సేవల శ్రేణిని అందించడానికి డీపీఐ రాష్ట్ర, కేంద్ర డిజిటల్ మౌలిక సదుపాయాలతో ఏకీకృతం చేస్తుంది.

**మరిన్ని పథకాలు :** డిజిటల్ అగ్రికల్చర్ మిషన్‌తో పాటు మొత్తం రూ.14,235.30 కోట్లతో ఆరు ప్రధాన పథకాలకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ కార్యక్రమాలలో 2047 నాటికి ఆహార భద్రత, వాతావరణ స్థితిస్థాపకతను నిర్ధారించే లక్ష్యంతో క్రాప్ సైన్స్ కోసం రూ.3,979 కోట్లు, విద్యార్థులు, పరిశోధకులకు మద్దతుగా వ్యవసాయ విద్య, నిర్వహణ, సామాజిక శాస్త్రాలను బలోపేతం చేయడానికి రూ. 2,291 కోట్లు ఉన్నాయి. రూ.1,702 కోట్లు సుస్థిరమైన పశుసంపద, డెయిరీ ద్వారా ఆదాయాన్ని పెంచడానికి కేటాయించగా, ఉద్యానవనాల నుండి ఆదాయాన్ని పెంచడానికి హార్టికల్చర్ స్థిర అభివృద్ధి కోసం రూ.1,129.30 కోట్లు కేటాయించారు. అదనంగా, కృషి విజ్ఞాన కేంద్రాన్ని బలోపేతం చేయడానికి రూ.1,202 కోట్లు, సహజ వనరుల నిర్వహణ కోసం రూ.1,115 కోట్లు పెట్టుబడి పెట్టనున్నారు. ఈ సమగ్ర విధానాలు భారతదేశ వ్యవసాయ రంగంలో ఉత్పాదకత, సామర్థ్యం, స్థిరత్వాన్ని పెంపొందించడానికి డిజిటల్ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటాయి. దేశవ్యాప్తంగా లక్షలాది మంది రైతుల జీవితాలను మార్చగలవు.



**జనక మోహన రావు దుంగ**
**ఫోన్ : 8247045230**

# సుబ్రహ్మణ్యన్ @ ఏటా 51కోట్ల జీతం





ఎస్ సుబ్రహ్మణ్యన్ ఎవరు? ఆదివారం అని కాదు, అసలు వీక్లీ ఆఫ్ తీసుకోకుండా పని చేయాలని, సూచనలు, సలహాలు ఇస్తున్న ఇతను ఎవరు?కష్టపడి పని చేసి, తన రక్తాన్ని చెమటగా మార్చి నెలకు కనీసం పాతిక వేలు జీతం లేని,ఉత్పత్తి, ఉత్పధాకత, రవాణా, సర్వీస్ రంగాలకు, దేశానికీ పునాదులు అయిన శ్రామికులు, రోజుకు లక్షలు, ఏటా కోట్ల జీతం సంపాదించుకునే బ్యూరో క్రాట్ల కు, కంపెనీల సీఈఓ, ఎండి లకు చులకనగా కనిపిస్తున్నారు. తక్కువ గా, వారి కండ్లకు ఒక బానిసల్లా కనిపిస్తున్నారు.. మొన్నటికి మొన్న ఇన్ఫోసిస్ నారాయణ మూర్తి వారానికి 70గంటలు పని చేయాలని పేర్కొంటే, తాజాగా ఎల్అండ్ టీ,సీఈఓ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఉద్యోగులు వారానికి 90 గంటలు పని చేయాలని, ఆదివారాలు పని చేయాలని, అస్తమానం భార్యల ముఖాలు చూస్తూ ఏమి కూర్చుంటారు, అంటాడు! కడుపుల సల్ల కదులకుండా ఏడాదికి 51 కోట్ల జీతం తీసుకుంటున్న ఎల్అండ్ టీ సీఈఓ సుబ్రహ్మణ్యన్ కండ కావురపు మాటలు ఆందోళన కలిగిస్తున్నాయి.

**పని గంటలు పెరుగుతున్నాయి**


గతంలో కన్నా ఇప్పుడు పని గంటలు పెరిగాయి. పని గంటలు రోజుకు ఆరు గంటలే ఉండాలని ఐఎల్ఓ లో ప్రతిపాదనలు వస్తున్నాయి. ఇక్కడ సుబ్రహ్మణ్యం లాంటి వాళ్ళు పనిగంటలు ఇంకా పెంచాలని అంటున్నారు. చాలా చోట్ల 10, 12,16 గంటలు పని చేస్తున్నవాళ్లు ఆయనకు కనిపించడం లేదా! గృహిణులు ముఖ్యంగా భార్యలను అవమానించే విధంగా మాట్లాడుతాడా! ఆ ముఖాలే లేకుంటే నీ ముఖం కూడా చూసే వారు ఎవరైనా ఉంటారా? సుబ్రహ్మణ్యం నీకిది తగునా!ఒక్కో గృహిణి 16 నుంచి 18 గంటలు పని చేస్తున్న విషయం తెలియకుంటే, తెలుసుకో!

చాలా ప్రైవేట్ సెక్టర్స్‌లో, సర్వీస్ సెంటర్స్ లలో 8 గంటలు బదులు 12 గంటలు ఉద్యోగులు, కార్మికులు పని చేస్తున్నారు. గార్మెంట్ కంపెనీ లలో, స్పిన్నింగ్,జిన్నింగ్ మిల్ లలో, ఆసుపత్రుల లలో, షాప్స్, మాల్స్ లలో పనిగంటలు పెరిగాయి. ఒక ప్రభుత్వ రంగం లో తప్ప అన్ని చోట్ల పనిగంటలు రోజుకు 8 గంటలు అనే నిబంధనలు లేవు. కార్మిక చట్టాలు అన్ని కార్పొరేట్లకు అనుకూలంగా మార్చారు. 44 చట్టాలను 4 కోడ్లు గా మార్చి వేశారు. వెల్ఫేర్ స్కీంలు తగ్గించారు.తమ ప్రాణాలను పణం గా పెట్టి దేశానికీ వెలుగును అందిస్తున్న రాక్షసి బొగ్గును, పుట్టెడు బండ కిందకు వెళ్లి ఉత్పత్తి చేస్తున్న బొగ్గు గని కార్మికుల పెన్షన్ 1998 నుంచి పెరగనే లేదు. గత 20 ఏండ్ల క్రితం రిటైర్ అయిన కార్మికులకు వెయ్యి నుంచి రెండు వేలు మాత్రమే పెన్షన్ వస్తున్నది. దేశంలో ఉద్యోగులకు, కార్మికులకు, అధికారులకు వేతనాల్లో అసమానతలు నింగికి, నేలకు అనే విధంగా అంతరం ఉన్నది. ఇప్పటి లక్ష జీతం 2008 లో 38 వేల రూపాయలతో సమానం అనే పరిస్థితి ఉన్నది. సాఫ్ట్ వేర్ ఉద్యోగుల మీద సైతం పని భారం పెరిగింది.

**పెరిగిన అప్పుల భారం**

గతంలో మాదిరి జీతాలు ఇవ్వడం లేదు.ఉత్పత్తి, ఉత్పధకత, రవాణా రంగం లోను జీతాలు ఎక్కువ లేవు. పెరిగిన, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా జీతాలు పెరుగక, కోట్లాది మధ్యతరగతి కుటుంబాల్లో 18 శాతం మంది అప్పుల పాలు అవుతున్నారు. కార్పొరేట్ లు శ్రామికుల రక్తం పీల్చుకుని బతుకుతున్నారు. 8 కోట్ల మంది ఉద్యోగులు ఋణం తీసుకుని తిరిగి కట్ట లేక ఆగం అవుతున్న పరిస్థితి ఉన్నది. గోల్డ్ లోన్ గత పది ఏండ్లలో డబుల్ అయ్యింది. బంగారం కుదువ బెట్టి న వాళ్ళు తీసుకున్న ఋణం కట్టలేక, బంగారం విడిపించలేక ఆందోళన చెందుతున్నారు. దేశంలో ఉపాధి అవకాశం లేక ఇజ్రాయిల్, రష్యా కు ఏదో ఒకరూపం లో వెళ్లి సైన్యం లో సైతం చేరి పోతున్నారు. అక్రమంగా అమెరికా, కెనడా లకు కు కూడ ఉపాధి కోసం వెళుతున్నారు.






**మిడిల్ క్లాస్ ఆగం ఆగం**

మిడిల్ క్లాస్ కుటుంబాల ఆర్థిక స్థితి ఏమాత్రం బాగా లేదు. మిడిల్ క్లాస్ అనేది దాదాపు మాయం అయిపోయే పరిస్థితి వచ్చింది అంటే అతిషయోక్తి కాదు.ఇలాంటి పరిస్థితి లో సుబ్రహ్మణ్యం లాంటి వాళ్ళు ఎవరు కూడ పని చేయడం లేదని,అందరూ 90 గంటలు పని చేయాలని సలహాలు సూచనలు ఇవ్వడం,పీఎం నరేంద్ర మోడీ లాంటి వారికి ప్రభుత్వ రంగం పుట్టిందే చావడానికి అనే అభిప్రాయం ఉండడం, చౌక బారుగా ప్రభుత్వ రంగం ను కార్పొరేట్ లకు అమ్మి వేయడం, ప్రైవేటీకరణ, కార్పొరేటికరణను ప్రోత్సాహించడం జరుగుతున్నది. రాజ్యాంగం ఇచ్చిన ప్రతీ హక్కును ఏదో ఒక రకంగా హరించే కుట్ర జరుగుతుంది.

**సుబ్రహ్మణ్యం రూపంలో దౌర్భాగ్యం**

ఇప్పుడు ఎల్ అండ్ టీ,సుబ్రహ్మణ్యం రూపంలో వారం లో 90 గంటలు పని చేయాలని, చెబుతున్నారు.దేశానికీ పట్టెడు అన్నం పెడుతున్న రైతుల హక్కులు హరిస్తున్నారు. ఇలా కార్మికుల హక్కులు హరిస్తారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు ఉండవు. 60 ఏండ్లు ఉద్యోగ విరమణ వయసును పెంచి, యువకులకు ఉద్యోగాలు రాకుండా చేస్తారు. అంతా పాలకుల ఇష్టం!పేపర్ లీకేజీలు, కార్మికుల ను ఉద్యోగాల నుంచి తొలగింపులు, నిరసన పోరాటాలు, ఉద్యమాలు కొనసాగుతూనే ఉంటాయి. అయినా పట్టించుకోరు! ఎవరి గోస, ఎవరి ఘోష వారిదే! అదాని, అంబానీ లకు వత్తాసు, వేల నుంచి లక్షల కోట్ల వాళ్ళ ఆస్తులు పెరగడానికి సహకరిస్తారు!ఇవేవి ప్రశ్నించ కుండా కులం, మతం, మందిర్, మస్జీద్, చర్చి అంటూ నానా హంగామాలు!ఇంకెంత కాలం? సుబ్రమణ్యన్ ఆదివారం కూడ సెలవు తీసుకోవద్దు అంటాడు.ఇలాంటి వాళ్ళు మన శ్రామికుల ఉద్దరణ కోసం అవతరించిన సీఈఓ లు, ఎండి గా ఉన్నారు. ఇది మన దౌర్భాగ్యం కాకుంటే మరేమిటి?

**అదాని, అంబానీలకు వత్తాసు, వేల నుంచి లక్షల కోట్ల వాళ్ళ ఆస్తులు పెరగడానికి సహకరిస్తారు. ఇవేవి ప్రశ్నించ కుండా కులం, మతం, మందిర్, మస్జీద్, చర్చి అంటూ నానా హంగామాలు. ఇంకెంత కాలం? సుబ్రమణ్యన్ ఆదివారం కూడ సెలవు తీసుకోవద్దు అంటాడు. ఇలాంటి వాళ్ళు మన శ్రామికుల ఉద్దరణ కోసం అవతరించిన సీఈఓ లు, ఎండి గా ఉన్నారు. ఇది మన దౌర్భాగ్యం కాకుంటే మరేమిటి?**



**ఎండి.మునీర్**
**సీనియర్ జర్నలిస్ట్,**
**విశ్లేషకులు**
**9951865223**

# దిగజారుతున్న రాజకీయ విలువలు ప్రజలకు మేలు చేస్తాయా!

**(నిన్నటి తరువాయి భాగం)** ప్రజా నైతికత భావనను సాధించడానికి, గౌరవాన్ని కాపాడుకోవడంతో పాటు, చట్ట క్రమానికి కట్టుబడి ఉండటం రెండు కీలకమైన అంశాలు. ఒక వ్యక్తి రాజకీయ రంగంలో చురుకుగా పాల్గొంటున్న ప్పుడు, రాజకీయ అధికారుల ప్రవర్తనకు అవసరమైనప్పుడు ఈ అంశాలు ఆశించబడతాయి. ప్రతి పౌరుడికి ప్రతి అంశం పట్ల వారి స్వంత విశ్వాసం, నైతికత ఉంటుంది, అయితే రాజకీయ అధికారుల విధి ఇతరుల విశ్వాసాలను గౌరవించడం చట్టం రాజ్యాంగాన్ని అనుసరిస్తూ వారి నియోజకవర్గాల విశ్వాసాల కోసం వాదించడం. రాజకీయ నీతి ఇతర ప్రాంతంలో, ప్రధాన సమస్యలు సాధనాలు, ప్రయోజనాల మధ్య వైరుధ్యం కాదు, కానీ వాటి మధ్య వైరుధ్యాలు. ప్రపంచ న్యాయానికి సంబంధించిన ప్రశ్నలో, జాతీయ-రాజ్యం, దాని పౌరుల వాదనల మధ్య వైరుధ్యం ఉంది. సాంప్రదాయకంగా, దేశాల వాదనలకు ప్రాధాన్యత ఇవ్వబడింది, అయితే ఇటీవలి సంవత్సరాలలో, కాస్మోపాలిటన్‌లుగా పిలువబడే ఆలోచనాపరులు ప్రపంచంలోని పౌరులందరి వాదనలను నొక్కిచెప్పారు. పౌరులు (తత్వవేత్తలు) ఆదర్శ న్యాయం అంటే ఏమిటో విభేదించే ప్రజాస్వామ్య సమాజాలలో నైతిక విలువలను గ్రహించడం గురించి రాజకీయ నీతి వ్యవహరిస్తుంది. బహుళవాద సమాజంలో, ప్రభుత్వాలు ప్రగతిశీల పన్నులు, నిశ్చయాత్మక చర్య, అబార్షన్ హక్కు, సార్వత్రిక ఆరోగ్య సంరక్షణ వంటి విధానాలను సమర్థించడానికి ప్రయత్నిస్తాయి . రాజకీయ రాజీ, విజిల్‌బ్లోయింగ్ , శాసనోల్లంఘన, నేరపూరిత శిక్షల అవసరం వల్ల తలెత్తే నైతిక సమస్యలకు కూడా రాజకీయ నీతి సంబంధించినది .

**2.రాజకీయ తత్వశాస్త్రం:** రాజకీయ సమాజంలో సరైన ప్రసంగం లేదా హేతువు మొదటిసారిగా సోక్రటీస్ జీవితం మరణంతో ఒక ముఖ్యమైన సైద్ధాంతిక ప్రశ్న రాజకీయ సమస్యగా మారింది. సోక్రటీస్ అతనికి ముందు ఉన్న తత్వశాస్త్ర సంప్రదాయం నుండి వైదొలిగాడు, ఇతర విషయాలతోపాటు, తన తాత్వికత లేని సమకాలీనుల అభిప్రాయాలను బహిరంగంగా , ప్రైవేట్‌గా ప్రశ్నించడం ద్వారా నైతిక రాజకీయ ప్రశ్నలను పరిశోధించ డానికి అతని నిర్ణయం. ధర్మం, పౌరసత్వం గురించి స్వీకరించిన అభిప్రాయాన్ని అతను బహిరంగంగా ప్రశ్నించడం వలన అతని స్వస్థలమైన ఏథెన్స్‌లో అతనిపై నేరారోపణ , చివరికి అతని ఉరిశిక్ష విధించబడింది. ఈ ఆరోపణల నేపథ్యంలో అతను ఇచ్చిన రక్షణ, అతని విద్యార్థులైన ప్లేటో , జెనోఫోన్‌ల రచనలలో జ్ఞాపకార్థం, అతని ప్రాణాలను కాపాడి ఉండకపోవచ్చు, కానీ అది ప్రాచీన పాలనలో , ఆ తర్వాత పాశ్చాత్య దేశాలలో సైన్స్ లేదా ఫిలాసఫీ విశేష స్థానాన్ని పొందేందుకు సహాయపడింది. ప్రపంచం. సోక్రటీస్ రక్షణ ప్రసంగం, ప్లేటోచే వివరించబడినట్లుగా, వాక్ స్వాతంత్ర్యం ప్రామాణిక రక్షణ మూలకాలుగా మారే వాదనలను చేస్తుంది. ప్లేటో చెప్పడంలో, సోక్రటీస్ వాదించాడు, ప్రజలు తాము విశ్వసించే వాటిని విశ్వసించడంలో సహాయం చేయలేరు. అందువల్ల శిక్షించ బడకుండా సరిదిద్దాలి. తదనుగుణంగా, తప్పుడు లేదా చెడ్డ బోధనలకు సరైన పరిష్కారం నిజమైన, సరైన వాదన. అయితే, ఏథెన్స్ ప్రజలు మంచిగా ఎలా ఉండాలో పౌరులకు ఎలా నేర్పించాలో లేదా వారు నగరానికి, దాని సంప్రదాయాలకు ఎందుకు విధేయంగా ఉండాలనే దానిపై ఎన్నడూ కఠినంగా ఆలోచించలేదు. ఈ సంప్రదాయాలను ప్రశ్నించడానికి పౌరులను అనుమతించడం ద్వారా మాత్రమే రాజకీయాల జ్ఞానాన్ని ఎవరైనా పొందడం సాధ్యమవుతుంది, అలాంటి విధేయతను బలమైన పునాదులపై ఉంచవచ్చు. తత్వశాస్త్రం రాజకీయ వనరులపై సోక్రటీస్ అమెజాన్‌లో "ప్లేటో: పొలిటికల్ ఫిలాసఫీ"ని"ప్లేటోను ఎలా చదవాలి" ఈ వాదనలు వాక్ స్వాతంత్ర్య సూత్రాన్ని సూచిస్తున్నట్లు కనిపిస్తున్నందున, ఇతర సంభాషణలలో సోక్రటీస్ వాక్ స్వాతంత్ర్యాన్ని సమర్థించడమే కాకుండా దానికి వ్యతిరేకంగా వాదించడం విశేషం. ప్లేటోస్ రిపబ్లిక్‌లో , సోక్రటీస్ తన ప్రసిద్ధ "మాటలలో నగరం" కోసం అవసరమైన సామాజిక స్థిరత్వం కోసం పౌరులకు వారి మూలాలు నగరంలో వారి రాజకీయ , ఆర్థిక స్టేషన్ గురించి "గొప్ప అబద్ధం" చెప్పడం అవసరమని వాదించాడు.

గార్డియన్ క్లాస్ విద్య, అంతేకాకుండా, పాలనను రూపొందించే , దానిని నడిపించే తత్వవేత్తల కఠినమైన నియంత్రణలో రాడికల్ సెన్సార్‌షిప్ ప్రోగ్రామ్‌ను కలిగి ఉంటుంది. ప్లేటో యొక్క చట్టాలలో , నగరం ,దాని దేవుళ్ళ గురించి భిన్నమైన అభిప్రాయాలు వాటి గురించి బహిరంగ చర్చ ద్వారా సరిదిద్దబడవు, కానీ "రాత్రిపూట మండలి"తో వ్యక్తిగత సమావేశాల ద్వారా సరిదిద్దబడ్డాయి. విజ్ఞాన సాధనకు వ్యతిరేక దృక్కోణాల పట్ల బహిరంగత అవసరమని చాలా నిశితంగా తెలిసిన సోక్రటీస్, భిన్నవాదాన్ని అణచివేయడమే కాకుండా, తెలిసి అబద్ధాలను ప్రచారం చేయడం కూడా అవసరమని ఎందుకు భావిస్తున్నాడు?ఇక్కడ మనం సోక్రటిక్ రాజకీయ తత్వశాస్త్రం , ఆధునిక, హక్కుల ఆధారిత ప్రభుత్వానికి తెలియజేసే జ్ఞానోదయం రాజకీయ తత్వశాస్త్రం మధ్య ప్రాథమిక వ్యత్యాసాన్ని ఎదుర్కోవాలి. ఇది స్వేచ్ఛా వాక్ రాజకీయ సూత్రాన్ని స్వీకరించడానికి దారితీసింది. జ్ఞానోదయ రాజకీయ తత్వవేత్తలు సోక్రటీస్ , అతని విద్యార్థుల కంటే హేతుబద్ధతను విస్తృతం చేయాలనే గొప్ప ఆశలను కలిగి ఉన్నారు.

పౌరులకు సమర్ధవంతమైన సేవలు అందించాలన్న రాజకీయ నాయకులు లేకపోవడం విచారకరం. పైన పేర్కొన్న సోక్రటీ తన రాజకీయ సిద్ధాంతరీత్యా ప్రస్తుత రాజకీయ వ్యవస్థకు ఏ మేరకు దోహదపడుతుంది అన్న విషయాలు గమనించకపోవడం విచారకరం. ఇప్పటికైనా రాజకీయాలలో ఉందా తనం విడనాడి, అధికారపక్షమైన, ప్రతిపక్షమైన దూషణలు విడనాడకపోతే, గల్లలు గళ్ళలు పట్టుకోకపోతే తమ రాజకీయ విలువలు గల వ్యక్తిగా చెప్పవచ్చు. కానీ కొత్తగా రాజకీయాలలోనికి వచ్చిన వారందరికీ రాజకీయ పరిపాలన వ్యవహారాలు శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ముఖ్యంగా ఉందా తనం నైతిక విలువలు, సామాజిక అవగాహన, పరిపాలన రంగంపై వ్యవహారాలు శైలి కనీసం తెలివాల్సిన అవసరం ఉంది. అప్పుడే రాజకీయాలలో ఉందా తనం కొంతవరకైనా కనబడుతుంది.



**డాక్టర్. రక్కిరెడ్డి ఆదిరెడ్డి**
**కాకతీయ విశ్వవిద్యాలయం**

# ఆరు గ్యారెంటీల్లో ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నాం..

- ఈ నెల 26న రైతు భరోసా పథకం అమలు చేస్తాం
- వనపర్తి పట్టణంలో ముగ్గుల పోటీల కార్యక్రమంలో పాల్గొన్న వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి





**వనపర్తి బ్యూరో, జనవరి 13 (జనంసాక్షి) :** ఆరు గ్యారెంటీల్లో ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి అన్నారు. సోమవారం వనపర్తి పట్టణం 20వ వార్డులో అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఐద్వా ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ముగ్గుల పోటీల కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ వనపర్తి నియోజకవర్గ ప్రజలకు వనపర్తి పట్టణ ప్రజలకు సంక్రాంతి పండగ సందర్భంగా ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని ఆశిస్తూ ప్రజలందరికీ సంక్రాంతి భోగి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఐద్వా జిల్లా కార్యదర్శి లక్ష్మి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీ కార్యక్రమంలో 40 మంది మహిళలు పాల్గొనడం జరిగింది 1, వ బహుమతిగా శిరీష గారు 2, వ బహుమతి శ్రావణి గారు 3,వ బహుమతి మన్నెమ్మ గారు గెలుపొందడం జరిగింది గెలుపొందిన ముగ్గురు మహిళలకు వారితోపాటు 37 మంది మహిళలకు ఎమ్మెల్యే మేఘా రెడ్డి స్థానిక కౌన్సిలర్ మున్సిపల్ వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణయ్య మున్సిపల్ చైర్మన్ పుట్టపాక మహేష్ చేతుల మీదుగా బహుమతులు పంపిణీ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలనలో తెలంగాణ ప్రభుత్వం 6 గ్యారంటీల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం 10 లక్షల ఆరోగ్య బీమా 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు 500కు గ్యాస్ సిలిండర్ రెండు లక్షల రుణమాఫీ తెలంగాణ ప్రజలకు చేయడం జరిగింది ఈనెల 26వ తారీకు రైతు భరోసా ఇవ్వడం జరుగుతుందన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు చెప్పిన ఆరు గ్యారెంటీల్లో ఒక్కొక్కటిగా నెరవేర్చుకుంటూ తెలంగాణ ప్రభుత్వం ముందుకు వెళుతుందని, మన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కొత్త రేషన్ కార్డులు ,కొత్త పెన్షన్లు ,ఇల్లు లేని వారికి ఇందిరమ్మ ఇండ్లు కానీ త్వరలోనే ఒక్కొక్కటిగా నెరవేర్చుకుంటూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ముందుకు వెళుతుందన్నారు. గత ప్రభుత్వంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రజలకు ఏమి చేయలేదు పది సంవత్సరాలు అధికారంలో ఉండి ప్రజలను పట్టించుకోలేదు అధికారం కోల్పోయాక బీఆర్ఎస్ పార్టీ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారు తెలంగాణ రాష్ట్రంలో ఈనాడు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలనలో ఆరు గ్యారెంటీలు కచ్చితంగా నెరవేరుస్తాం రేపు రాబోయే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వనపర్తి ఎమ్మెల్యే మేఘా రెడ్డి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో వనపర్తి పట్టణ అధ్యక్షులు చీర్ల విజయ చందర్ వనపర్తి నియోజకవర్గం సమన్వయకర్త లక్కాకుల సతీష్ మున్సిపల్ కౌన్సిలర్స్ చంద్రకళ ఎల్ఐసి కృష్ణ సుమిత్ర యాదగిరి విభూతి నారాయణ జయసుధ మధు గౌడ్ వినోద్ గౌడ్ తిరుపతి రెడ్డి మాజీ కౌన్సిలర్ కృష్ణ బాబు టీపీసీసీ వనపర్తి అసెంబ్లీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ ద్యారపోగు వెంకటేష్ ఓబీసీ పట్టణ అధ్యక్షులు బొంబాయి మన్నెంకొండ ఈరపోగు శ్రీనివాసులు గంధం సంగాకర ఈరపోగు అంజి అస్లాం ఫజల్ కేడిఆర్ పజిల్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి క్రీడలకు ఎంపికైన విద్యార్థి



**మఖ్తల్, జనవరి 13 (జనంసాక్షి) :** గత నెల డిసెంబర్ 24 నుండి 26 వరకు నల్లగొండ జిల్లా కేంద్రం ఎన్జీ కాలేజీలో జరిగిన రాష్ట్రస్థాయి సీనియర్ మహిళల షూటింగ్ బాల్ క్రీడల్లో నారాయణపేట జిల్లా మహిళా జట్టు తరుపున సంగంబండ సోషల్ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థిని పాల్గొన్నారు. మేఘ వర్ష క్రీడా నైపుణ్యతను, క్రీడా ప్రతిభను చాటి జాతీయస్థాయి సీనియర్ మహిళల షూటింగ్ బాల్ క్రీడలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపల్ చంద్రకళ, కోచ్ బి. గోపాలం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. జాతీయస్థాయి సీనియర్ షూటింగ్ బాల్ మహిళ క్రీడలకు ఎంపికైన మేఘ వర్ష తెలంగాణ జట్టు తరఫున ఈనెల 17 నుండి 20 వరకు ఒరిస్సా రాష్ట్ర పూరి లో జరుగు జాతీయ స్థాయి సీనియర్ షూటింగ్ బాల్ మహిళ క్రీడల్లో పాల్గొంటుందని బి.గోపాలం తెలిపారు. పాఠశాల ప్రిన్సిపల్ చంద్రకళ మాట్లాడుతూ 15 రోజులపాటు షూటింగ్ బాల్ క్రీడల్లో కోచ్ బి.గోపాలం మెరుగైన శిక్షణ ఇవ్వడం మూలంగా మా విద్యార్థిని జాతీయస్థాయి క్రీడలకు ఎంపికైందని సంతోషాన్ని వ్యక్తపరుస్తూ గోపాలం కు కృతజ్ఞతలు తెలియజేశారు. జాతీయస్థాయి షూటింగ్ బాల్ క్రీడాకారిణి మేఘవర్ష సొంత ఊరు కొల్లాపూర్ మండలం ఎల్లూరు గ్రామానికి చెందిన అతి పేద కుటుంబం తల్లిదండ్రులు జ్యోతి, రామకృష్ణ కూలి పని చేస్తూ జీవనము సాగిస్తూ తమ అమ్మాయిని సంగంబండ బాలికల గురుకుల పాఠశాలలో చదివిస్తున్నారు. తమ కూతురు మేఘ వర్ష జాతీయస్థాయి క్రీడలకు ఎంపిక కావడం పట్ల ఆనందాన్ని, సంతోషాన్ని వ్యక్త పరుస్తూ, మా కూతురు ఉన్నత చదువు చదివి ఉద్యోగం సంపాదించాలని మా కోరికని వారన్నారు. జాతీయస్థాయి మహిళా షూటింగ్ బాల్ క్రీడలకు ఎంపికైన మేఘవర్షను రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఎం. శ్రీనివాసులు, సిహెచ్. ఐలయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి .గోపాలం, పాఠశాల ప్రిన్సిపల్ చంద్రకళ, పిఈటి శ్రీలత, ఉపాధ్యాయ బృందము, విద్యార్థులు అభినందించారు.

## దొంగలను పట్టుకున్న కొల్చారం పోలీసులు

- దొంగిలించిన సొత్తు రికవరీ



**మెదక్ జిల్లా బ్యూరో, జనవరి 13 (జనంసాక్షి) :** మెదక్ జిల్లా మండల కేంద్రమైన కొల్చారం లోని శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయంలో అమ్మవారి ముక్కుపుడక, హుండీని చోరీ చేసిన దొంగలను కొల్చారం పోలీసులు అతి చాకచక్యంగా పట్టుకున్నారు. ఈనెల 10వ తేదీ శుక్రవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో కొల్చారం లోని శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయంలో చోరీ జరిగింది. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్ఐ మమ్మద్ గౌస్ మెదక్ నుంచి క్లూస్ టీమ్ తెప్పించారు. క్లూస్ టీం సేకరించిన ఫింగర్ ప్రింట్ ఆధారంగా దొంగతనానికి పాల్పడింది పాత నేరస్తులుగానే గుర్తించారు. కేసును వేగవంతంగా విచారణ చేసి మెదక్ పట్టణానికి చెందిన పాత నేరస్తులు జహంగీర్, ప్రవీణ్ అనే దొంగలను పట్టుకొని వారి నుంచి సొత్తు రికవరీ చేసి కోర్టుకు రిమాండ్ చేసినట్లు కొల్చారం ఎస్సై మమ్మద్ గౌస్ తెలిపారు. అతి తక్కువ సమయంలో కేసును చేదించి దొంగలను పట్టుకున్న కొల్చారం పోలీసులను మండల ప్రజలు ప్రశంసిస్తున్నారు.

## బొంరాస్‌పేట, దుద్యాల మండలంలో జోరందుకున్న వరినాట్లు

- వరి సాగు చేసేందుకే మొగ్గు చూపుతున్న అన్నదాతలు



**బొంరాస్‌పేట, జనవరి 13 (జనంసాక్షి) :** యాసంగి పంట సాగులో రైతన్నలు తీరిక లేకుండా బిజీబిజీగా గడుపుతున్నారు. బొంరాస్ పేట, దుద్యాల మండలాల వ్యాప్తంగా వరి ,వేరుశనగ పంటలను అత్యధికంగా సాగు చేస్తారు. వేరుశెనగ పంట చేతికి రావడంతో రైతులు పంటను విక్రయించుకుంటున్నారు. ఇటీవల వర్షాకాలంలో కురిసిన వర్షాలతో చెరువులు కుంటలు జలమయం కావడంతో యాసంగిలో వరి నాట్లు వేసేందుకు రైతులు అత్యధికంగా మొగ్గు చూపుతున్నారు. బొంరాస్ పేట,ఏర్పుమళ్ళ, మెట్లకుంట, కొత్తూరు,బురాన్పుర్ గ్రామాల్లో చెరువులో నిండుకుండలా మారడంతో ప్రధానంగా వరి సాగు చేసేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే వరినట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

## సీసీ రోడ్ల నిర్మాణంతో గ్రామాలకు మహర్దశ

- జనగామ డీసీసీ అధ్యక్షులు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి
- వీరన్నపేటలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన



**చేర్యాల, జనవరి 13 (జనంసాక్షి) :** సీసీ రోడ్ల నిర్మాణంతో గ్రామాలు ఎంతో అభివృద్ధి చెందాయని జనగామ డిసిసి అధ్యక్షులు కొమ్మూరి ప్రతాపరెడ్డి అన్నారు. సోమవారం చేర్యాల మండలంలోని వీరన్న పేట గ్రామంలో సిసి రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలోని పల్లెలు పట్టణాల అభివృద్ధికి సిసి రోడ్లు మంజూరు చేసి గ్రామాల అభివృద్దే లక్ష్యంగా ప్రభుత్వం చొరవ తీసుకుంటుందని ఆయన అన్నారు. అనంతరం గ్రామంలో నెలకొన్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మంజె మల్లేశం, గ్రామ శాఖ అధ్యక్షులు సూర్ణ శ్రీకాంత్, ఉపాధ్యక్షులు పొన్నబోయిన కరుణాకర్, తాజా మాజీ సర్పంచ్ కొండపాక బిక్షపతి, మాజీ ఎంపిటిసి ఆరేళ్ల పాపయ్య, బుడిగ శ్రీనివాస్, కుందారపు సురేష్ రెడ్డి, పొన్నబోయిన ఎల్లయ్య, ఆరేళ్ల విద్యా సాగర్, కీసరి నరసింహులు, కొండపురం మధు, ఎండి కలీమ్ పాషా, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పెద్దింటి రాకేష్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలతో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది

- ఇంద్రకంటి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఇంద్రకంటి వెంకటేష్



**వీపనగండ్ల, జనవరి 13 (జనంసాక్షి) :** వీపనగండ్ల మండల పరిధిలోని సంగినేనిపల్లి గ్రామంలో సంక్రాంతి పండుగ సందర్భంగా ఇంద్రకంటి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విలేజ్ ప్రీమియం లీగ్ క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ ఇంద్రకంటి వెంకటేష్ మాట్లాడుతూ... మా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నిరుపేద ప్రజలకు చాలా సేవా కార్యక్రమాలు నిర్వహించామని, అదేవిధంగా ప్రతి సంవత్సరం సంక్రాంతి పండుగ సందర్భంగా యువకులలో ఆత్మవిశ్వాసాన్ని పెంచడానికి క్రీడలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యాంత్రిక జీవనం కొనసాగిస్తున్న ఇప్పటి రోజులలో క్రీడలు జీవితంలో ఆరోగ్యంగా ఉండడానికి చాలా ముఖ్య పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. క్రీడాకారులు స్నేహపూర్వకంగా ఆడాలని, గెలుపు కోసం క్రీడాకారులు ప్రయత్నించాలని, ఓడిపోతే ఒక అనుభవంగా తీసుకుని గెలుపు కోసం ప్రయత్నం చేయాలని వారు సలహా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆర్. మౌలాలి, కాంగ్రెస్ నాయకులు భాస్కర్ రెడ్డి, చిన్నారెడ్డి, మీసాల.మోహన్, ధనుంజయుడు, టైలర్ రాముడు, మీసాల కురుమయ్య, గ్రామ నాయకులు క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## గోదాదేవి అమ్మవారి దయ అందరిపై ఉండాలి

- సింగిరెడ్డి వాసంతి



**వనపర్తి, జనవరి 13 (జనంసాక్షి) :** మహిమాన్వితురాలైన గోదా దేవి అమ్మవారి దయ అందరిపై ఉండాలని మాజీ మంత్రి సింగిరెడి నిరంజన్ రెడ్డి సతీమణి వాసంతి కోరారు. స్థానిక బ్రాహ్మణ వీధిలో వెలిసిన విఠలేశ్వర పాండురంగస్వామి దేవాలయములో గోదాదేవి కళ్యాణోత్సవం ఘనంగా జరిగింది. స్థానిక కౌన్సిలర్ బండారు కృష్ణ ఆహ్వానం మేరకు సింగిరెడ్డి వాసంతి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేవతలను ఆరాధించడం వల్ల ప్రజల్లో పాపభీతి పెరుగుతుందని అన్నారు. ఆలయ అర్చకులు సింగిరెడ్డి వాసంతికి తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా కమిటీ ఆధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, పట్టణ అధ్యక్షుడు పలుస రమేశ్ గౌడ్,కౌన్సిలర్లు కాగితాల లక్ష్మీనారాయణ, బండారు కృష్ణ నాయకులు డ్యానియల్, పాపిశెట్టి శ్రీనివాసులు,పాండు శెట్టి,జగదీష్ శెట్టి తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో టీడీపీ పూర్వ వైభవం తీసుకొస్తాం

- పార్లమెంట్ అధికార ప్రతినిధి రమేష్



**చారకొండ, జనవరి 13 (జనంసాక్షి) :** నాగర్‌కర్నూల్ జిల్లాలో తెలుగుదేశం పార్టీకి పూర్వ వైభవం తీసుకొస్తామని టీడీపీ నాగర్ కర్నూల్ పార్లమెంట్ అధికార ప్రతినిధి రమేష్ , పార్లమె0ట్ ఉపాధ్యకుడు వెంకటరమణలు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో టీడీపీ మండల అధ్యక్షుడు సండూరి శ్రీనివాసులు ఆధ్యక్షతన ఆన్ లైన్ మొబైల్ సభ్యత్వ నమోదు.. కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా పార్లమెంట్ అధికార ప్రతినిధి రమేష్, ఉపాధ్యకుడు వెంకటరమణలు హజరయ్యారు. తెలంగాణాలో తెలుగుదేశం పార్టీకి ఓటు బ్యాంకు ఏమాత్రం దగ్గలేదని టీడీపీ నుంచి బయటకు వెళ్లిన నాయకులు తిరిగి మళ్లి సొంత గూటికి వస్తున్నారని అన్నారు. టిడిపీ వ్యవస్థాపకులు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామరావు బడుగు, బలహీన వర్గాల వారికి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టి అమలు చేశారని అన్నారు. టీడీపీ హాయం. లోనే తెలంగాణ అభివృద్ధి చెందిందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో టిడిపీ కూటమి ఘన విజయం సాధించడంతో పార్టీ అధినేత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వార చంద్రబాబ నాయుడు తెలంగాణ రాష్ట్రంపై ప్రత్యేక దృష్టి పెట్టారని అన్నారు. తెలుగుదేశం పార్టీ సభ్యత్వం తీసుకొన్నవారు సాధరణంగా మరణిస్తే రూ. ఒక లక్షా. ప్రమాదంలో మరణిస్తే రూ. 5 లక్షలు వారి కుటుంబాలకు బీమా వర్తిస్తుందని అన్నారు. ఈ అవకావాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ సెల్ కమిటీ సభ్యుడు తిరుపతయ్య, ఉప్పునుంతల మండల అధ్యక్షుడు ఆర్. కాశన్న, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## సాగు భూములకే పెట్టుబడి సాయం


- తహసీల్దార్ ఫర్వీన్ షేక్



**హత్నూర, జనవరి 13 (జనంసాక్షి) :** పంటలు పండించేందుకు అనుకూలమైన భూములకే ప్రభుత్వం రైతు భరోసా పథకం కింద పెట్టుబడి సాయం అందించడం జరుగుతుందని తహసీల్దార్ ఫర్వీన్ షేక్ అన్నారు. మండల కేంద్రమైన హత్నూర రెవెన్యూ కార్యాలయంలో సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. కలెక్టర్ ఆదేశానుసారం మండలంలోని వ్యవసాయ, వ్యవసాయేతర భూముల వివరాలను సర్వే ద్వారా గుర్తిస్తున్నామని వారు చెప్పారు. గుట్టలు, వెంచర్లు,భీడు భూములకు రైతు భరోసా వర్తించదన్నారు.

## రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత





- రోడ్డు నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు దూరం
- చేర్యాల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీను, ఎస్ఐ నీరేష్

**చేర్యాల, జనవరి 13 (జనంసాక్షి) :** జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా సోమవారం చేర్యాల మండల కేంద్రంలోని ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు నిబంధనల గురించి అవగాహన కల్పిస్తూ వాహనాదారులతో కలిసి పోలీస్ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ ఎల్. శ్రీను, ఎస్ఐ నిరేష్ లు మాట్లాడుతూ..రోడ్డు సేఫ్టీ గురించి ప్రతి ఒక్కరు తప్పనిసరిగా తెలుసుకోవాల్సిన బాధ్యత కలిగి ఉండాలన్నారు. దేశంలో ప్రతి నిమిషానికి ఒక రోడ్డు ప్రమాదం జరుగుతుండగా, ప్రతి మూడు నిమిషాలకు అదే రోడ్డు ప్రమాదంలో ఒకరు మృత్యువాత పడుతున్నారని తెలిపారు. ఎక్కువ శాతం అధిక వేగంతో రోడ్డుపై వాహనాలను నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రాణ నష్టం జరుగుతుందని వాపోయారు. వాహనాలలో ప్రయాణించేటప్పుడు సీటు బెల్టు తప్పకుండా ధరించాలని, ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్ పత్రాలను తీసుకెళ్లాలని సూచించారు. కండీషన్‌లో ఉన్న వాహనాలనే డ్రైవింగ్ చేయాలన్నారు. వాహనాలలో ప్రయాణించేటప్పుడు మద్యం సేవించడం, సెల్‌ఫోన్ చూడడం, నిద్రలేమి వంటి కారణాలతో డ్రైవింగ్ చేయడం వల్ల ప్రమాదాలకు గురవుతున్నారని, ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించకూడదని తెలిపారు. అనంతరం నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడుపుతామని వాహనదారులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా ప్రతి ఒక్కరికి వాటిపై పూర్తిస్థాయి అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు.

## అడ్డగోలుగా కలప అక్రమ రవాణా..

- చోద్యం చూస్తున్న ఫారెస్ట్ అధికారులు




**శివ్వంపేట, జనవరి 13 (జనంసాక్షి) :** వేల కోట్ల రూపాయల ప్రజాధానాన్ని ఉపయోగించి, ప్రభుత్వం ప్రతి సంవత్సరం కోట్లాది మొక్కలు నాటిస్తుంటే, పచ్చని చెట్లపై గుడ్డలు వేటుతో ఇక్కడికక్కడే ముక్కలు చేస్తూ, కలపను అడ్డగోలుగా అక్రమ రవాణా చేస్తున్నారు. అయితే ఇదంతా జరుగుతున్న ఫారెస్ట్, రెవేన్యూ అధికారులు అటువైపు కన్నెత్తి చూసిన దాఖలాలు కూడా కనిపించడం లేదు. కొందరి అధికారుల వైఖరి ఎలా ఉందంటే నెల నెల జీతాలు వస్తే చాలు, ఎక్కడ చెట్లు కోతకు గురైన మాకు ఎం సంబంధం, నవ్విపోదురుగాక మాకేమి సిగ్గు అన్నట్లుగా వారి వైఖరి ఉందంటున్నారు పలువురు. వివరాల్లోకి వెళితే మండల కేంద్రమైన శివ్వంపేట మండల పరిధిలోని ఎదల్లాపూర్ సరిహద్దు ప్రాంతంలో ఉన్న చామన్ చెరువు అలుగు గట్లపై ఉన్న భారీ వృక్షాలను తాళ్లపల్లి తండాకు చెందిన రాజు అనే వ్యక్తి కొందరూ వృక్షాలను కోత కోసేవారిని అంటే కూలీలను మాట్లాడుకొని గత రెండు రోజులుగా పలు రకాలైన భారీ వృక్షాలను ఇష్టానుసారంగా కోస్తూ, దుంగలను, డీసీఎం లోడ్ చేసి కలపను హైదరాబాద్ కు అక్రమంగా రవాణా చేస్తున్నాడు. ఇదేమి అన్యాయం అనీ ఎవరైనా ప్రశ్నిస్తే, తన దగ్గర అన్ని శాఖల అనుమతులు ఉన్నాయని, ఎవ్వరైనా ఫోన్ చేసి చెప్పిన ఫారెస్ట్ వాళ్ళు ఇటువైపురారని సమాధానం చెబుతున్నాడు. ఈ విషయంపై శివంపేట ఫారెస్ట్ సెక్షన్ అధికారి సత్యనారాయణ ను వివరణ కోసం సంప్రదించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

## మోతీమాతకు మాజీ మంత్రి హరీష్‌రావు ప్రత్యేక పూజలు





- అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పణ

**మొగుడంపల్లి, జనవరి 13 (జనంసాక్షి) :** జహీరాబాద్ నియోజకవర్గంలోని మొగుడంపల్లి మండలం ఉప్పరిపల్లి తండాలోని మోతీమాత ఆలయంలో సోమవారం మాజీ మంత్రి,సిద్ధిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. హరీష్ రావుతో పాటు జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు, సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ పూజ నిర్వహించారు. మోతీమాత జాతర ఉత్సవాల్లో భాగంగా హరీశ్ రావు సంప్రదాయ పద్ధతిలో అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు,గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ జాతర ఉత్సవాలు ప్రజల ఐక్యతకు ప్రతీకగా నిలుస్తాయని, సంప్రదాయాల పరిరక్షణలో ఇలాంటి ఉత్సవాలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. జహీరాబాద్ మండల అధ్యక్షుడు నారాయణ,డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

## భోగ భాగ్యాలతో రాష్ట్రం సుభిక్షంగా వెలుగొందాలి

- రాష్ట్ర ప్రజలకు సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**సూర్యాపేట ప్రతినిధి, జనవరి 13 (జనంసాక్షి) :** భోగ భాగ్యాలతో రాష్ట్రం సుభిక్షంగా వెలుగొందాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆకాంక్షించారు.సంక్రాంతి పర్వదినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన రాష్ట్ర ప్రజలకు ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు.కుల మతాలకు అతీతంగా సమస్త రాష్ట్ర ప్రజలు సంక్రాంతి పర్వదినాన్ని ఘనంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. రాష్ట్రానికి వెన్నెముకగా నిలిచిన రైతాంగానికి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న చేయూతతో ముందెన్నడూ లేని రీతిలో ధాన్యం దిగుబడి సాధించడం సంవత్సర కాలంలో ప్రభుత్వం సాధించిన అభివృద్ధికి ప్రతీకగా అభివర్ణించారు.ఇది రైతు నామ సంవత్సరమని, రాష్ట్ర ప్రభుత్వం రైతుపక్షపాతి అని చెప్పడానికి యావత్ భారత దేశంలోనే తెలంగాణ రైతాంగం కనీవినీ ఎరుగని రీతిలో 153 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి సాధించడం అద్దంపడుతుందన్నారు.రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసేందుకు గాను గడిచిన ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన ప్రాజెక్ట్‌ల నిర్మాణాలను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేసేందుకు గాను బృహత్ ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. అభివృద్ధికి విద్యనే తొలిమెట్టు అని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం 5 వేల కోట్ల అంచనా వ్యయంతో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన పాఠశాలలు నెలకొల్పుతున్నట్లు వెల్లడించారు. విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకున్న ప్రభుత్వం కామన్ డైట్ ప్రవేశ పెట్టడంతో పాటు ఏక కాలంలో 40శాతం డైట్ చార్జీలు,200 శాతం కాస్మొటిక్ చార్జీలు పెంచిన విషయాన్ని గుర్తు చేశారు.రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ వసతిగృహాలలో ఉంటూ విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు ఇకపై సన్న బియ్యం అన్నం వడ్డించబోతున్నట్లు తెలిపారు.రాష్ట్ర వ్యాప్తంగా అర్హులైన నిరుపేదలందరికి తెల్ల రేషన్ కార్డులు మంజూరు చేయడంతో పాటు తెల్ల రేషన్ కార్డుదారులందరికి సన్నబియ్యం పంపిణీ చేయనున్నట్లు ప్రకటించారు.పౌర సరఫరాల శాఖలో తెచ్చిన అనేక సంస్కరణలు అద్భుతమైన ఫలితాలు ఇచ్చాయని, నీటి పారుదల రంగాన్ని ఇప్పుడిప్పుడే గాడిలో పెడుతున్నామన్నారు.ఇదంతా రాష్ట్ర సర్వోముఖాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషి అని ఇందులో రాష్ట్ర ప్రజలు భాగస్వామ్యమై తోడ్పాటును అందించాలని రాష్ట్ర ప్రజలకు పిలుపునిచ్చారు.

## 'మీర్‌ఖాన్‌పేట'లో పునరుద్ధరించిన ప్రాజెక్టులు ప్రారంభం





**హైదరాబాద్, జనవరి 13 (జనంసాక్షి) :** అమెజాన్ వెబ్ సర్వీసెస్ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేట గ్రామంలో పునరుద్ధరించిన పలు ప్రాజెక్టులను అమెజాన్ వెబ్ సర్వీసెస్ గ్లోబల్ డేటా సెంటర్ ఆపరేషన్స్ వైస్ ప్రెసిడెంట్ సెర్జియో లొరెయిరో, ఏషియా పసిఫిక్, మధ్యప్రాచ్యం, ఆఫ్రికా డేటా సెంటర్ ఆపరేషన్స్ డైరెక్టర్ సాజీ పీకే, ఇండియా డేటా సెంటర్ ఆపరేషన్స్ డైరెక్టర్ అదిత్య చౌదరి సమక్షంలో ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ప్రారంభించారు. ఇక్కడ ప్రారంభించిన వాటిలో పబ్లిక్ పార్కు, వాటర్ ప్యూరిఫయర్ సిస్టమ్, పునర్నిర్మాణం చేసిన ఆరోగ్య ఉపకేంద్రం భవనాలు, స్వయం సహాయక సంఘ సమావేశ మందిరం ఉన్నాయి. ఈ ప్రాజెక్టులు 'సెర్ప్' సహకారంతో అమెజాన్ అభివృద్ధి చేసింది. అమెజాన్ పని చేస్తున్న ప్రాంతాల్లో సమాజంపై సానుకూల ప్రభావం చూపడం దీని ప్రధాన లక్ష్యం. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ కార్పొరేట్లు సమాజ అభివృద్ధిలో కీలక పాత్రధారులుగా ఉన్నారన్నారు. వీరు ఆర్థిక అభివృద్ధిని ప్రోత్సహించడమే కాకుండా జీవన ప్రమాణాలు మెరుగుపరచడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నారని చెప్పారు. తెలంగాణలోని గ్రామాలలో అభివృద్ధికి అమెజాన్ వెబ్ సర్వీసెస్ చురుకుగా వ్యవహరిస్తుందని చెప్పారు. వివిధ అభివృద్ధి పనుల ద్వారా సమాజంపై సానుకూ ప్రభావం చూపుతుందన్నారు. ఈ చర్యలు గ్రామంలోని అన్ని వర్గాలకు వినూత్న ప్రయోజనాలు అందిస్తాయని తెలిపారు. అయితే, అమెజాన్ అభివృద్ధి చేసిన వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనపైన ఉందన్నారు. ఫిల్టర్ వాటర్ మంచిదే కాదనడం లేదన్నారు. మిషన్ భగీరథ నీటిని కూడా వాడుకోవాలన్నారు. ఆరోగ్య కేంద్రాన్ని జాగ్రత్తగా చూసుకోవాలన్నారు.

## శివరావు షెట్కార్ చేసిన సేవలు చిరస్మరణీయం




**నాగిల్గిద్ద, జనవరి 13 (జనంసాక్షి) :** స్వతంత్ర సమరయోధులు క్రీస్తు శేషులు శివరావు శెట్కార్ చేసిన సేవలు చిరస్మరణీయమని జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ శెట్కర్,నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల డాక్టర్ సంజీవరెడ్డి అన్నారు. సోమవారం నారాయణఖేడ్ మున్సిపాలిటీ శివారులోని జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ శెట్కర్ తండ్రి క్రీస్తు శేషులు శివరావు శెట్కా ర్ 29 వర్ధంతి సందర్భంగా వారి సమాధి వద్ద ఏర్పాటు చేసిన సర్వ ధర్మ సమ్మేళన సభ కార్యక్రమంలో ఎంపీ సురేష్ కుమార్ శెట్కర్ , ఎమ్మెల్యే పట్లోళ్ల డాక్టర్ సంజీవరెడ్డి పాల్గొని మాట్లాడారు.. శివరావు శెట్క ర్ అడుగుజాడల్లో నడుస్తూ కాంగ్రెస్ కార్యకర్తల కష్టసుఖాల్లో పాలుపంచుకున్నారన్నారు. నారాయణఖేడ్ సర్వముఖా భివృద్ధికి స్వర్గీయ మాజీ ఎమ్మెల్యేలు అప్పారా వుషెట్కార్, శివరావుషెట్కార్, కిష్టారెడ్డి కృషి చేశారని వారి అడుగుజాడల్లో నడుస్తూ కాం గ్రెస్ కార్యకర్తల కష్టసుఖాల్లో పాలుపంచుకున్నామని అన్నారు. శివరావుషెట్కార్ దేశ స్వాతంత్ర్యం, నిజాం నిరంకుశ పాలనకు వ్యతి రేకంగా పోరాడినట్లు గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత సాధుసంతుల రాష్ట్ర ప్రతినిధి సంగ్రాం మహారాజ్, కర్ణాటకలోని బాల్కీ హీరేమఠం పీఠాధిపతి మహాలింగ పట్ట దేవరు,ఉమ్మడి జిల్లా మాజీ ప్రణాళిక సంఘం సభ్యులు నాగేష్ షెట్కార్,సంగీత జిత్తు షెట్కార్,రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి రాకేష్ షెట్కార్,టీపీసీసీ సభ్యులు కే. శ్రీనివాస్, శంకరయ్యస్వామి, డీసీసీ కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి,యువనేత సాగర్ షెట్కార్, శివరావు షెట్కార్,ఆనంద్ స్వరూప్ షెట్కార్, మాజీ సర్పంచ్ అప్పారావు షెట్కార్ , పోతుల సంగారెడ్డి, పోతుల మహిపాల్ రెడ్డి, సంజయ్ పాల్గొన్నారు.

## భోగీ మంటల్లో చెడు ఆహుతై మంచి ఉదయించాలి



- మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి

**సూర్యాపేట ప్రతినిధి, జనవరి 13 (జనంసాక్షి) :** భోగీ మంటల్లో చెడు ఆహుతై మంచి ఉదయించాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు.సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని పలు కూడళ్ళలో జరిగిన భోగి మంటల వేడుకల్లో పాల్గొన్నారు. విద్యానగర్ చౌరస్తాలో కౌన్సిలర్ గండూరి పావని కృపాకర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భోగి వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం బీఆర్ఎస్ నాయకులు భావ్ సింగ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భోగీ వేడుకల్లో పాల్గొన్నారు.పట్టణ ప్రజలు, యువత, చిన్నారులు పెద్ద ఎత్తున చేరి భోగి మంటల కాంతుల మధ్య కోలాటం వేస్తూ ఆనందంగా నృత్యాలు చేసారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరికీ భోగి శుభాకాంక్షలు తెలిపారు.అందరి చెడు ఆలోచనలు భోగి మంటల్లో బూడిదవ్వాలని అన్నారు. సరికొత్త ఆలోచనలు, అభివృద్ధితో ముందుకు సాగాలని అన్నారు.ఏడాదంతా పేర్లు మార్చడంతోనే గడిచిపోయిందన్నారు.కేసీఆర్ లాంటి అభివృద్ధి ఆలోచనలు కాంగ్రెస్ ప్రభుత్వానికి రావాలని పేర్కొన్నారు. పాడిపంటలు సమృద్ధిగా పండి తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.కేసీఆర్ పాలనలో గత పది సంవత్సరాలు రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుందన్నారు.
సంవత్సరం కాలంగా సీఎం రేవంత్ రెడ్డి పాలనలో మంచి ఫలితాలు పొందడంలో విఫలమైందన్నారు.ప్రజల కష్టాలు తొలగించి,ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ రాజ్యసభ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్,జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు సవరాల సత్యనారాయణ, నాయకులు గండూరి కృపాకర్,బావ్ సింగ్, జానీ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలతో క్రీడ నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

- క్రీడలను ప్రోత్సహిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి
- స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి





**స్టేషన్ ఘన్పూర్, జనవరి 13 (జనంసాక్షి) :** క్రీడలతో క్రీడ నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని, తెలంగాణ రాష్ట్రంలో క్రీడలను సీఎం రేవంత్ రెడ్డి అన్ని విధాల ప్రోత్సహిస్తున్నారని మాజీ ఉపముఖ్య మంత్రి,ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మండలం లోని చాగల్ ఉన్నత పాఠశాల ఆవరణలో స్వాగత్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల ముగింపు సమావేశానికి స్వాగత్ యూత్ గౌరవ అధ్యక్షుడు పోగుల సారంగపాణి అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథి హాజరైన ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ కబడ్డీక్రీడలకు పుట్టినిల్లు చాగల్లు గ్రామము అని ఇక్కడ నుండి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో కబడ్డీలో రాణించిన క్రీడాకారులు ఉన్నారని అన్నారు. క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని అన్నారు.ప్రస్తుతం కబడ్డీ క్రీడలకు గ్రామాలలో ఆదరణ ఉందని యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించాల న్నారు.యువత చెడు మార్గాలకు వెళ్లకుండా క్రీడలపై దృష్టి సారించడానికి గత 16 సంవత్సరాలుగా క్రీడలు నిర్వహిస్తున్నామన్నారు.క్రీడలవల్ల క్రీడాకారులు భవి ష్యత్తులో ప్రభుత్వఉద్యోగాలు సాధించవచ్చని తెలిపారు. క్రీడల ద్వారా శరీర దారుఢ్యంతో పాటు, మానసిక ఉల్లాసం కలుగుతుందని, క్రీడాకారుల మధ్య స్నేహ భావం పెరుగుతుందన్నారు. క్రీడాకారులు ఆరోగ్యకర మైన ఆహారం తీసుకోవాలని నిరంతరం సాధన చేయా లని పేర్కొన్నారు. కబడ్డీ క్రీడలను ప్రోత్సహించాలనే కడియం ఫౌండేషన్ ద్వారా నగదు బహుమతి తో పాటు మెమోంటో అందజేయడం జరిగిందన్నారు. కబడ్డీక్రీడలలో గెలుపొందిన టీములకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్వాగత్ యూత్ గౌర వధ్యక్షుడు పోగుల సారంగపాణి,ఏసీపి భీంశర్మ,నాయ కులు చింత కుంట్ల నరేందర్ రెడ్డి, జూలుకుంట్ల శిరీష్ రెడ్డి,కొలీపాక సతీష్, నాగరబోయిన శ్రీరాములు, నీల గట్టయ్య, కర్ణాకర్ రావు,రజాక్,గడ్డమీది సురేష్,రమేష్, దోమల ప్రభాకర్, నరసయ్య, స్వాగత్ యూత్ అసోసి యేషన్ అధ్యక్షుడు కూన రాజు, ఉపాధ్యక్షుడు రమం చారాజు, కార్యదర్శి కూన రమేష్, కోశా ధికారి అన్నెపు అనిల్,సహాయ కార్యదర్శి సోన్నాయిల ప్రజెస్,స్పోర్ట్ సెక్రెటరీ అల్లాడి అనిల్, సాంస్కృతిక కార్య దర్శి దోమల అరుణ్, వడ్లకొండ కిషోర్,కార్యవర్గసభ్యులు సోన్నాయిల సురేష్, రంగు యాకయ్య, సంపత్ రాజ్, మాజీ ఉపసర్పంచ్ పొన్న రజితరాజేష్,చేపూరి ప్రభాకర్, పొన్న రాజేష్, పీఈటీలు చందర్,అన్నెపు కుమార్, చింతకింది సుధాకర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## పట్టణ అభివృద్ధికి కృషి

- బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్

**బెల్లంపల్లి, జనవరి 13 (జనంసాక్షి) :** బెల్లంపల్లి పట్టణ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. సోమవారం ఆయన బెల్లంపల్లి పట్టణంలోని 13వ వార్డులో 70 లక్షల నిధులతో సైడ్ డ్రైన్స్ పనులకు శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేయడమే తన అభిమతం అన్నారు. ఎవరు ఎన్ని విమర్శలు చేసినా అభివృద్ధి విషయంలో వెనకడుగు వేసేది లేదన్నారు. గత పదేళ్లలో అభివృద్ధి చేయడం చేతకాని వాళ్ళు చేస్తున్న విమర్శలను పట్టించుకోనవసరం లేదన్నారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ జక్కుల శ్వేతా శ్రీధర్, కౌన్సిలర్ బండి ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## చేనేత సహకార సంఘం నూతన భవన నిర్మాణానికి కృషి

- మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి



**సూర్యాపేట ప్రతినిధి, జనవరి 13 (జనంసాక్షి) :** సూర్యాపేట చేనేత సహకార సంఘం నూతన భవన నిర్మాణానికి కృషి చేస్తానని మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో సూర్యాపేట చేనేత పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి, ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి ,పీసీసీ సభ్యులు, పబ్లిక్ క్లబ్ కార్యదర్శి కొప్పుల వేణారెడ్డి ,రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పోతు భాస్కర్ కి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి ఆర్డీఆర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేనేత ,జౌళి కార్మికుల అభివృద్ధి కోసం ఇప్పటికే 168 కోట్లు కేటాయించడం జరిగిందని తెలిపారు.చేనేత అభయ హస్తం మూడు పథకాలు చేనేత కార్మికులకు అభివృద్ధికి తోడ్పడుతుందని వెల్లడించారు.చేనేత కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని పేర్కొన్నారు. జియో ట్యాగ్ సహకార సంఘం భవనం ఏర్పాటుకు ప్రయత్నం చేస్తానని తెలిపారు. అనంతరం చేనేత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షులు కడారి బిక్షం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నేతన్నల భరోసాగా అభయహస్తంలో పొదుపునిధి భద్రత భరోసా మూడు పథకాలను అమలు చేస్తూ 168 కోట్లు ప్రకటించడం ధన్యవాదాలు తెలుపుట గురించి మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డిని కలవడం జరిగిందని తెలిపారు.కొంత మంది చేనేత కార్మికులకు జియో టాగ్ రాలేదని, అలాగే 75 సంవత్సరాల క్రితం నిర్మించబడిన సూర్యాపేట చేనేత సహకార సంఘ భవనం శిథిలావస్థకు చేరిందని వారి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని పేర్కొన్నారు. కూలటానికి సిద్ధంగా ఉన్న సహకార సంఘం భవనం నిర్మాణానికి నిధులు కేటాయించాలని వారికి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో సహకార సంఘం ప్రధాన కార్యదర్శి చిలువేరు నరసింహారావు, కోశాధికారి బాల్నేని మల్లయ్య, సంఘ నాయకులు గండూరి రమేష్, నాగుల శ్రీనివాస్, యలగందుల సాయి నేత, ముశం హరి, మోత్కూరి మధు, రుద్ర దామోదర్, కోట రమేష్, ముషం సూర్యం , సూరేపల్లి మార్కండేయ, యలగందుల లక్ష్మయ్య,ముషం శ్రీధర్ ,బూర రవి,మానుపురి వెంకటాచలం, జెల్లా శివాజీ, రుద్ర నారాయణ, బిక్షపతి, సూర్యనారాయణ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## భోగీ అందరి జీవితాల్లో భోగ భాగ్యాలు తేవాలి

- నర్సాపూర్ ఎమ్మెల్యే సునితాలక్ష్మారెడ్డి



**మెదక్ జిల్లా బ్యూరో, జనవరి 13 (జనంసాక్షి) :** తెలుగు ప్రజలకు నర్సాపూర్ ఎమ్మెల్యే సునితారెడ్డి భోగి పండుగ మనందరి జీవితాల్లో భోగ-భాగ్యాలను తీసుకురావాలి. సంక్రాంతి పండుగ రోజున ముగ్గుల్లాగా మన జీవితంలో సంతోషం వెల్లివిరియాలి ,కనుక పడుగ మనం కనేటటువంటి కళలను సాకారం చేయాలి అందరికీ భోగి..సంక్రాంతి, కనుమ పర్వదిన శుభాకాంక్షలు అని సునితారెడ్డి చెప్పారు.

## జిల్లా ప్రజలకు సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు

- కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట ప్రతినిధి, జనవరి 13 (జనంసాక్షి) :** జిల్లా ప్రజలకు సంక్రాంతి పండుగ శుభాకాంక్షలను జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు.ఈ సంక్రాంతి పండుగ ప్రతి ఇంటా ఆనందం వెల్లివిరియాలని, రైతులు పాడి పంటలతో తులతూగి, ఆయా రంగాల్లో శ్రేయస్సు సాధించాలని ఆకాంక్షించారు.సంక్రాంతి పండుగ మన సంప్రదాయాలకు, సంస్కృతికి ప్రతీక అని అన్నారు.ఈ పండుగ అందరిలో స్నేహభావం, సంతోషం, శ్రేయస్సు తీసుకురావాలని అన్నారు.ప్రజలందరూ పండుగను సంప్రదాయబద్ధంగా జరుపుకోవడంతో పాటు, స్వీయ భద్రతకు ప్రాముఖ్యత ఇవ్వాలని పేర్కొన్నారు.అందరూ హెల్మెట్,సీట్ బెల్ట్ వాడుతూ ప్రయాణాలు చేయాలని సూచించారు.పండుగ ప్రతి ఒక్కరి కుటుంబాల్లో ఆనందం నింపాలని, సుఖ సంతోషాలతో నిండిన జీవితం గడపాలని ఆకాంక్షించారు.



# గ్రామానికి మళ్లీ రెవెన్యూ అధికారి

## వీఆర్ఓల నియామకాలకు ప్రారంభమైన కసరత్తు

## పాత పద్ధతిలో భూముల రికార్డులు

**వనపర్తి,జనవరి09 (జనంసాక్షి)**

బీఆర్ఎస్ హయాంలో ఏర్పాటు చేసిన ధరణి స్థానంలో ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన భూ భారతి చట్టం ద్వారా వీఆర్వో వ్యవస్థను మళ్లీ తీసుకొస్తున్నది. దీంతో మళ్ళీ గ్రామస్థాయిలో రెవిన్యూ సిబ్బంది రానున్నారు. అందుకే గత ప్రభుత్వం రద్దు చేసి ఇతర డిపార్టుమెంటుల్లో సర్దుబాటు చేసిన విలేజ్ రెవిన్యూ ఆఫీసర్లు, విలేజ్ రెవిన్యూ అసిస్టెంట్ల నుంచి కొత్త వీఆర్ఓ పోస్టులను భర్తీ చేయడానికి కసరత్తు ప్రారంభించింది.వారి నుంచి ఆప్షన్లను స్వీకరించింది.గ్రామ రెవెన్యూ అధికారుల నియామకానికి పరీక్షలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. ఈ నేపథ్యంలో గ్రామ రెవెన్యూ అధికార వ్యవస్థపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. రెవెన్యూ శాఖలో అవినీతి ఎలా ఉంటుందనేది ఎవరూ చెప్పాల్సిన అవసరం లేదు. అయితే అవినీతి అంతా వీఆర్వోలే చేస్తున్నారని, రెవెన్యూ శాఖలో అవినీతికి కేరాఫ్ అడ్రస్ వారేనంటూ 2020 సెప్టెంబర్‌లో బీఆరెస్ ప్రభుత్వం గ్రామ రెవెన్యూ అధికారుల (వీఆర్వో) వ్యవస్థను రద్దు చేసింది. వారి వద్ద ఉన్న రెవెన్యూ రికార్డులన్నింటినీ ప్రభుత్వం స్వాధీనం చేసుకున్నది. మరి వీఆర్వో వ్యవస్థ రద్దు అయిన తరువాత ఆనాడు ప్రభుత్వం చెప్పినట్టుగా.. రెవెన్యూ శాఖలో అవినీతి అంతం అయిందా? అన్నదే పెద్ద మిస్టరీగా మారింది.

**గ్రామస్థాయి అధికారులతోనే సత్వర సేవలు**

గ్రామ స్థాయిలో రెవెన్యూ అధికారులు ఉంటేనే రైతులకు రెవెన్యూ సేవలు సత్వరం అందే అవకాశం ఉంటుందన్నది వాస్తవం. నేరుగా వీఆర్వోలకు సమస్యను పరిష్కరించే అధికారం లేక పోవచ్చు.కానీ క్షేత్రస్థాయిలో ఏమి జరుగుతుందో గ్రామస్థుల ద్వారా వీఆర్వోకు తెలుస్తుంది. నేరుగా సమస్య ఉన్న భూ కమతం వద్దకు వెళ్లి ప్రత్యక్షంగా పరిశీలించి, పక్క రైతుల చేత విచారణ చేసి, నివేదికను రూపొందించి తాసిల్దారుకు సమర్పిస్తాడు. తాసిల్దార్ దీనిని ధృవీకరించుకుని తగిన ఆదేశాలు జారీ చేస్తాడు. ఇలా గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు వీఆర్వోల ద్వారా సేవలు అందేవి. అయితే నాటి సర్కారు రాష్ట్రంలో ఏ ప్రభుత్వ విభాగంలో లేని విధంగా ఒక్క రెవెన్యూ శాఖలోని వీఆర్వోలే అవినీతికి పాల్పడు తున్నారన్నట్లుగా వ్యవహరించిన తీరు భూమి సమస్యల పరిష్కారాన్ని సంక్లిష్టంగా మార్చిందనే అభిప్రాయాలు బలంగా ఉన్నాయి. అవినీతి అధికారులు ఉంటే ఉపేక్షించాల్సిన అవసరం లేదు. విచారించి కఠిన శిక్షలు వేయడానికి అవకాశం ఉన్న తరువాత కూడా నాటి సర్కారు ఎలుకలున్నాయని ఇల్లు తగులబెట్టుకున్న తీరుగా వీఆర్వో వ్యవస్థను రద్దు చేసిందని సీనియర్ రెవిన్యూ అధికారులు వ్యాఖ్యానించారు. ఇప్పుడు గ్రామ స్థాయి రెవెన్యూ అధికారుల వ్యవస్థను తీసుకు వస్తున్నామని చెప్పుతున్న సర్కారు నిర్దిష్టమైన పని చేసేలా వర్కింగ్ రూల్స్ తీసుకొచ్చి, అమలు చేయించాలని రైతులు కోరుతున్నారు. గతంలో లాగా రెండు, మూడు గ్రామాలకు ఒక్క అధికారి కాకుండా ప్రతి ఊరికి ఒక్క అధికారి వచ్చేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తులు చేస్తున్నారు.

**వీఆర్వో వ్యవస్థ రద్దుతో అన్నీ ఇబ్బందులే**

గ్రామ స్థాయి రెవిన్యూ వ్యవస్థను రద్దు చేసినందున రైతులు పలు ఇబ్బందులను ఎదుర్కొన్నారు. వీఆర్వో వ్యవస్థ రద్దు తరువాత అవినీతి అమాంతం పెరిగిందన్న అభిప్రాయాన్ని రైతులు, భూమి సమస్యలపై పని చేస్తున్న న్యాయ నిపుణులు, ప్రజా సంఘాల నేతలు వ్యక్తం చేస్తున్నారు. ఏసీబీ అధికారుల సోదాలను పరిశీలిస్తే ఈ విషయం అర్థం అవుతోంది. అలాగే అబ్దుల్లాపూర్‌మెట్ తాసిల్దార్‌పై పెట్రోల్ పోసి నిప్పు అంటించిన సంఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం కలిగించిన విషయం అందరికీ తెలిసిందే. వీఆర్వో వ్యవస్థను రద్దు చేసిన తర్వాత భూమి సమస్య చెప్పుకొంటే వినడానికి ఒక్క అధికారి కూడా లేని పరిస్థితి ఏర్పడిందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా వీఆర్వోలు ఉన్నప్పుడు రెండు, మూడు రోజులకు ఒకసారి తమ కళ్ల ముందు కనిపించే వారని, గెట్టు సమస్య ఉన్నా, రెవెన్యూ రికార్డుల్లో తప్పుల్లాంటి ఏ సమస్య వచ్చినా చెప్పడానికి ఒక అధికారి కనిపించే వాడని అంటున్నారు. అయితే వీఆర్వో వ్యవస్థ రద్దు అయిన తరువాత ఏ చిన్న సమస్యకైనా తాసిల్దార్ వద్దకు వెళ్లి పరిష్కరించాలని చెప్పుకొనే అవకాశం కూడా లేకుండా పోయిందన్నారు. ఏమైనా ఉంటే మీ-సేవకు వెళ్లి దరఖాస్తు చేసుకోండని చెప్పే వాళ్లని, మీ-సేవ కేంద్రానికి వెళ్లి ధరణి పోర్టల్ ఓపెన్ చేసి ధరఖాస్తు చేయిస్తే రూ.1000 ఫీజు తీసుకునే వారని, ఆ తరువాత కొన్ని రోజులకు రిజక్ట్ అని సమాధానం వచ్చేదని అంటున్నారు. వీఆర్వో ఉన్నప్పుడు ఏదైనా పని ఉంటే ఒక వేయి రూపాయలు ఇస్తే ఎంత పని అయినా అయిపోయేదని, ధరణి చట్టం వచ్చిన తరువాత లంచాల రేటు 100 శాతం పెరిగిందని, భూమికి మార్కెట్ లో ఉన్న రేటు బట్టి డిమాండ్ చేసే వారన్న ప్రచారం బలంగా ఉందని న్యాయనిపుణుడొకరు అన్నారు. దీంతో వీఆర్వో వ్యవస్థ రద్దు తరువాత క్షేత్రస్థాయిలో సమస్యను వినే అధికారి కరువయ్యాడని, పైగా లంచాలు పెరిగాయని, లంచం ఇవ్వాలన్న ఎవరిని కలిసి ఇవ్వాలో కూడా సామాన్య రైతుకు అర్థం కాక మధ్య దళారీలను ఆశ్రయించి అనేక మంది రైతులు మోసపోయారని భూమి సమస్యలపై అవగాహన ఉన్న రైతు సంఘం నేత వెల్లడించారు. ధరణి చట్టం అమలులోకి వచ్చిన తరువాత భూమి సమస్యలపై కోర్టు కేసులు పెరిగాయి.తనకు వచ్చిన భూమి సమస్యను ఎక్కడ ఎలా పరిష్కరించుకోవాలో అర్థం కాని రైతులు న్యాయస్థానాలను ఆశ్రయించిన సంఘటనలు కోకొల్లలుగా ఉన్నాయి. ఇలా అనేక మంది రైతులు డాక్యుమెంట్ల కోసం, చిన్న చిన్న సమస్యలకు కూడా కోర్టుకు వెళ్లాల్సిన దుస్థితిని ధరణి చట్టం ద్వారా నాటి ప్రభుత్వ ం తీసుకు వచ్చిందని, వీఆర్ ఓ స్థాయిలోనే రైతులకు అందుబాటులో ఉండాల్సిన సేవలను నాటి ప్రభుత్వం వీఆర్వోలు అవినీతి పరులంటూ రద్దు చేసిందన్న విమర్శలు గత ప్రభుత్వంపై కొనసాగడం గమనార్హం.

# అధికారిక లాంఛనాలతో మందా జగన్నాథం అంత్యక్రియలు

## నిమ్స్‌లో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి కన్నుమూశారు



**నాగర్‌కర్నూల్ (జనం సాక్షి)** :మాజీ ఎంపీ మందా జగన్నాథం అంత్యక్రియలను అధికారిక లాంఛనాలతో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

నాగర్‌కర్నూల్ మాజీ ఎంపీ మందా జగన్నాథం అంత్యక్రియలను అధికారిక లాంఛనాలతో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు హైదరాబాద్ కలెక్టర్‌కు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. జగన్నాథం అంత్యక్రియలకు సంబంధించి ఏర్పాట్లు చేయాలని ఆదేశించింది.

గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న మందా జగన్నాథం.. నిమ్స్‌లో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి కన్నుమూశారు. ఆయన కొంతకాలంగా మధుమేహం, రక్తపోటు, గుండె, మూత్రపిండాల సమస్యలతో బాధపడుతున్నారు. గత నెల 22న ఊపిరితిత్తుల సమస్య రావడంతో కుటుంబసభ్యులు నిమ్స్‌లో చేర్చారు. రోజురోజుకూ పరిస్థితి విషమించడంతో ఆయనను ఆర్ఐసీయూలో వెంటిలేటర్‌పై ఉంచి చికిత్స అందించారు. ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా గుండెపోటు రాగా, వెంటనే అత్యవసర వైద్య చికిత్స అందించినా ఫలితం దక్కలేదు. రాత్రి 7.40గంటలకు మృతిచెందినట్టు నిమ్స్ వైద్యులు బులెటిన్ విడుదల చేశారు. మందా జగన్నాథం భౌతికకాయాన్ని నిమ్స్ నుంచి హైదరాబాద్‌లోని చంపాపేట్‌కు తరలించారు. సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు సంతోష్‌నగర్ శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు తెలిపారు.వైద్యవృత్తి నుంచి రాజకీయాల్లోకి..

జోగులాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండలం, ప్రస్తుత ఎర్రవల్లి మండలం కొండేరు గ్రామంలో పెద్దపుల్లయ్య- మంద సవారమ్మ దంపతులకు 1951 మే 22వ తేదీన మందా జగన్నాథం జన్మించారు. ఆయన తండ్రి నాగార్జునసాగర్‌లోని పైలాన్ కాలనీలో మెకానికల్ విభాగంలో వాచ్‌మెన్‌గా, తల్లి సవారమ్మ హిల్‌కాలనీలో ఆఫీస్ అటెండెంట్‌గా పని చేశారు. విద్యాభ్యాసం అనంతరం వైద్య వృత్తిలో కొనసాగారు. ఉమ్మడి రాష్ట్రంలో టీడీపీ నుంచి పోటీచేసి నాగర్‌కర్నూల్ ఎంపీగా విజయం సాధించారు. పొలిట్‌బ్యూరో సభ్యుడిగా కూడా కొనసాగారు. తర్వాత కొంతకాలానికి కాంగ్రెస్ పార్టీలో చేరారు. 1996, 1999, 2004, 2009 ఎన్నికల్లో టీడీపీ, కాంగ్రెస్ పార్టీల నుంచి ఎంపీగా పోటీచేసి విజయం సాధించారు. 2014 మలిదశ ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ అడుగు జాడల్లో నడిచారు.

ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సమయంలో ఎంపీ పదవిని త్యాగం చేశారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన తర్వాత ఆయన కుమారుడికి అలంపూర్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా, మందా జగన్నాథం నాగర్‌కర్నూల్ ఎంపీగా బీఆర్ఎస్ పార్టీ నుంచి బరిలో దిగగా, విజయం వరించలేదు. అయినా కేసీఆర్ వెంటే ఉన్నారు. ఆయన సేవలను గుర్తించిన కేసీఆర్ ఢిల్లీలో బీఆర్ఎస్ పార్టీ ప్రత్యేక ప్రతినిధిగా క్యాబినెట్ హోదాలో రెండుసార్లు అవకాశం కల్పించారు. మందా జగన్నాథంకు ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. మంద జగన్నాథం మృతితో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గం, అలంపూర్ అసెంబ్లీ నియోజకవర్గం మొత్తం శోకసంద్రంలో మునిగిపోయింది.

# ఖమ్మంలో సీక్రెట్‌గా కోడి పందాలు..



**(జనం సాక్షి)** సంక్రాంతి పండుగ సందర్భంగా తెలంగాణ శివారు జిల్లా అయిన ఖమ్మంలో సీక్రెట్‌గా కోడి పందాలు జోరుగా సాగుతున్నాయన్న సమాచారంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. సీక్రెట్‌గా సాగుతున్న కోడి పందాల స్థావరాలను కనిపెట్టేందుకు.. పోలీసులు సూపర్ ఐడియా వేశారు. డ్రోన్ల సాయంతో సీక్రెట్ స్థావరాలపై నిఘా పెట్టారు. సంక్రాంతి పండుగ అంటే.. రంగురంగుల ముగ్గులు, రకరకాల పిండి వంటలు, గంగిరెద్దులు, హరిదాసులే కాదు.. జోరుగా సాగే కోడి పందేలు కూడా. ఈ కోడి పందాలు ఎక్కువగా ఏపీలో జరరనుండగా.. తెలంగాణ బోర్డర్ జిల్లాలైన ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లోనూ అడపాదడపా ఈ సంస్కృతి కొనసాగుతుంటుంది. సంక్రాంతి పండుగ వేళ.. కోడిపందాలు, పేకాట స్థావరాల ద్వారా.. కొన్ని కోట్ల రూపాయలు చేతులు మారనున్నాయి. అయితే.. కోడి పందాలు, పేకాటకు ఎలాంటి అనుమతులు లేకపోయినా.. పందెం రాయుళ్లు సీక్రెట్‌గా పందాలు నడిపిస్తున్నారు. పోలీసులు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా పందెం రాయుళ్లు మాత్రం వెనక్కి తగ్గట్లేదు. పోలీసుల కళ్లుగప్పి కోడిపందాలు నిర్వహిస్తున్న స్థావరాలను కనిపెట్టేందుకు.. ఖమ్మం పోలీసులు సూపర్ ఐడియా వేశారు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో ఖమ్మంలో సీక్రెట్‌గా జరుగుతున్న కోడి పందాలను అరికట్టే దిశగా పోలీసులు చర్యలు చేపట్టారు. జిల్లా సరిహద్దుల్లో సీక్రెట్‌గా నిర్వహిస్తున్న పందాల స్థావరాలను కనిపెట్టేందుకు.. టాస్క్ ఫోర్స్ బృందాలు డ్రోన్ కెమెరాలు వాడుతున్నారు. ఈ ఆపరేషన్ కోసం 3 డ్రోన్ కెమెరాలు వినియోగిస్తున్నట్టు పోలీసులు తెలిపారు. కోడిపందాలను నియంత్రించేందుకు డివిజన్, మండల, గ్రామస్థాయిలో టీంలను ఏర్పాటు చేశామని.. కోడిపందాలు నిలువరించేలా పకడ్బందీగా ప్రణాళికలు రూపొందించామని పోలీసులు తెలిపారు. ఖమ్మం కమిషనరేట్ పరిధిలో కోడిపందాలు, జూదం జరుగుతున్నాయని సమాచారం అందిన వెంటనే అక్కడకు వెళ్లి తగిన చర్యలు తీసుకునేలా కమిషనర్ ఆదేశించారు. కోడిపందాలు, జూదం నిర్వహణకు తోటలు, భూములు, గెస్ట్ హౌసులు ఇచ్చి ప్రోత్సహించే వారిపై కూడా కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. డ్రోన్ కెమెరాల ద్వారా కోడి పందెలు, బెట్టింగ్, పేకాట స్థావరాలను కనిపెట్టి.. దాడులు చేసి కేసులు నమోదు చేస్తామని పోలీసులు హెచ్చరించారు. గతేడాది కూడా కోడి పందాలు నిర్వహించిన వారిని, కోళ్లకు కత్తులు కట్టే వారిని గుర్తించి బైండోవర్ కేసులు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. ఇప్పుడు కూడా.. కోడిపందేల నిర్వహణ నిషేధంపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని పోలీసులు తెలిపారు.

## పల్లెల్లో ప్రభుత్వ వైద్యం పటిష్టపరిచేందుకు

# ప్రత్యేక చర్యలు




**వనపర్తి బ్యూరో జనవరి 13(జనంసాక్షి)**

**రాష్ట్రస్థాయి నుంచి గ్రామీణ స్థాయి వరకు ఒకే వైద్యం**

**విద్యా, వైద్యం, ఇరిగేషన్ పై ప్రత్యేక దృష్టి సారించిన కాంగ్రెస్ ప్రభుత్వం**

**వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యం ఇరిగేషన్ పై ప్రత్యేక దృష్టి సారించిందని రాష్ట్ర స్థాయి నుంచి గ్రామీణ స్థాయి వరకు ప్రభుత్వ పరంగా అందించే వైద్యం మెరుగ్గా ,అందించేందుకు తగిన చర్యలు చేపట్టిందని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు.పద్మభూషణ్ డాక్టర్ ప్రసాద్ రావు సారధ్యంలో జన విజ్ఞాన వేదిక సంస్థ సోమవారం వనపర్తి పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన వైద్య అవగాహన సదస్సుకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన పద్మభూషణ్ అవార్డు గ్రహీత ప్రసాద్ రావుకు పూలమాలలు శాలువా జ్ఞాపకలతో సత్కరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వనపర్తి నియోజకవర్గం పరిధిలో వైద్య సేవలను బలోపేతం కావలసిన మౌలిక సదుపాయాలన్నీ ఏర్పాటు చేశామని జిల్లా కేంద్రానికి 502 బిడ్డ నూతన ఆసుపత్రి మంజూరు అవుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.జన విజ్ఞాన వేదిక చేపట్టే కార్యక్రమాలకు తాను ఎల్లవేళలా సహాయ సహకారాలు అందిస్తానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గాంధీ ఆసుపత్రి ప్రొఫెసర్ డాక్టర్ రమాదేవి, జన విజ్ఞాన వేదిక సమన్వయకర్త నరేందర్, నారాయణ, జితేందర్, మున్సిపల్ చైర్మన్ పుట్టపాకుల మహేష్, పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పతంగుల వలె మన మనసు కూడా

# స్వేచ్ఛ కలిగి ఉండాలి



పతంగుల పండుగలో ఎమ్మెల్యే నాయిని



**వరంగల్ ఈస్ట్, జనవరి 13 (జనం సాక్షి)**

సంక్రాంతి పండుగ ప్రజలందరి జీవితాల్లో వెలుగులు నింపాలని,భోగి భాగ్యాలు,సంక్రాంతి సంబరాలు, కనుమ కృప కటాక్షాలు అందరికీ ఉండాలని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని నీలిమ రాజేందర్ రెడ్డి గారు అన్నారు.సోమవారం రోజున "నాయిని విశాల్ ట్రస్ట్ "ఆధ్వర్యంలో హనుమకొండ ఆర్ట్స్ అండ్ సిన్స్ కాలేజ్ మైదానంలో ఏర్పాటు చేసిన పతంగుల పండుగ కార్యక్రమానికి కుటుంబ సమేతంగా నగర మేయర్ గుండు సుధారాణి, వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు శ్రీమతి ఎర్రబెల్లి స్వర్ణ గార్లతో కలిసి ముఖ్య అతిథులుగా హాజరైనారు. స్థానిక ప్రజా ప్రతినిధులతో,చిన్నారులతో కలసి సరదాగా పతంగులను ఎగురవేశారు.ఈ పతుంగుల మాదిరిగానే మనిషి తన మనసును స్వేచ్ఛాయుత వాతావరణంలో గడిపేందుకు వీలుగా నడుచుకోవాలని కోరారు.కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికి స్వేచ్ఛాయుతమైన వాతావరణంలో అభివృద్ధి కార్యక్రమాలు సంక్షేమ పథకాల అమలు జరుగుతున్నదని తెలిపారు.తెలుగు సంప్రదాయాల్లో సంక్రాంతి పండుగ ఎంతో ప్రత్యేకమైనదని సనాతన సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించే పండుగ సంక్రాంతి అని పేర్కొన్నారు.భోగి,సంక్రాంతి,కనుమ మూడు రోజులు ఎంతో ఆనందంగా జరుపుకునే పండుగలో ప్రజలందరికీ భోగ భాగ్యాలు కలగాలని ఆకాంక్షించారు.పతంగుల పండుగలో చిన్నారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని,తల్లితండ్రుల పర్యవేక్షణ తప్పనిసరి అని గుర్తు చేశారు.ప్రతియేటా నాయిని విశాల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించే పలు సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా పతంగులను పంపిణీచేసి,విచ్చేసినా వీక్షకులకు,పిల్లలు సదుపాయాలు కల్పించారు.స్టేడియం ఆవరణలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు,నాయకులు,డివిజన్ అధ్యక్షులు, కార్యకర్తలు,ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# రైతు భరోసా రూ.15,000 ఇవ్వాలని బీఆర్ఎస్ నిరసన

**అదిలాబాద్ (జనం సాక్షి)**:అధికారమే పరమావధిగా అమలకు సాధ్యంకాని హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. ఆరు గ్యారంటీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్న తీరుపై బీఆర్ఎస్ ఉద్యమ బాట పట్టింది.

లఅధికారమే పరమావధిగా అమలకు సాధ్యంకాని హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. ఆరు గ్యారంటీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్న తీరుపై బీఆర్ఎస్ ఉద్యమ బాట పట్టింది. హామీల అమలు కోసం సబ్బండ వర్ణాలను కలుపుకొని కాంగ్రెస్ పాలనపై ఉద్యమిస్తున్నారు. తాజాగా. రైతు భరోసా కింద రూ.15000 అందజేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆదిలాబాద్‌లో ఆందోళన చేపట్టారు.

మాజీ మంత్రి

జోగురామన్న ఆధ్వర్యంలో అదిలాబాద్ బస్టాండ్ ముందు బైఠాయించి నిరసన తెలిపారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన మాట తప్పి మోసం చేసిందని జోగు రామన్న ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు పోరాడుతామన్నారు. కాగా, పోలీసులు శాంతియుతంగా నిరసన చేపడుతున్న జోగు రామన్న అడ్డుకున్నారు.

# నోరూరించే కాశ్మీర్ రేగుపండ్ల తోటలు వరంగల్‌లో...

- ఎరుపు పసుపు రంగుల్లో తియ్యటి టేస్ట్
- ఆరోగ్యానికి ఎంతో దోహదం
- ఎకరాకు రెండున్నర లక్షల నుండి మూడు లక్షల వరకు ఆదాయం
- వివరాలు వెల్లడించిన రైతు ఆవునూరి రాముర్తి





**వరంగల్ బ్యూరో, జనవరి 13 (జనంసాక్షి) :** చూడటానికి ఎరుపు పసుపు రంగులో ఉండి తింటే తీయగా ఉన్న కాశ్మీర్ రెడ్ ఆపిల్ బేర్( రేగు పండ్లు) తోటలు వరంగల్ నగరంలో ప్రస్తుతం కనిపిస్తున్నాయి. ఇలాంటి తోటలు ఎక్కువగా బంగ్లాదేశ్లో ఉండగా అక్కడి నుంచి ఇండియాలోని పశ్చిమబెంగాల్ రాష్ట్రానికి మొక్కలు తీసుకొచ్చి రైతులు ఈ పంటను పండించడం జరుగుతుంది. అయితే ఈ రకం కాశ్మీర్ రెడ్ ఆపిల్ బేర్ రేగి పండ్లు ప్రస్తుతం ఇండియాలోని దాదాపు అన్ని రాష్ట్రాలలో రైతులు సాగు చేయడం జరుగుతుంది. ఈ క్రమంలో వరంగల్ జిల్లాలోని బట్టుపల్లి రోడ్డు అమ్మవారిపేట, పంతిని, అంబాల రోడ్డు, ఊరుగొండ సింగారం మొదలైన ప్రాంతాలలో రైతులు ఈ రకం రేగుపల్ల తోటలను పెట్టడం సుమారు మూడు నాలుగు సంవత్సరాలుగా కొనసాగుతుంది. ఈ విషయమై కాశ్మీర్ రెడ్ ఆపిల్ బేర్ రేగుపండ్ల తోటను సాగు చేస్తున్న పురుసు ప్రాంతానికి చెందిన రైతు ఆవునూరి రాముర్తి పలు వివరాలు వెల్లడించారు. హైబ్రిడ్ రేగుపండ్ల సాగును చేయాలనే ఉద్దేశంతో రాముర్తి భద్రాచలం కొత్తగూడెం ప్రాంతం నుండి రేగుపండ్ల మొక్కలను తీసుకురావడం జరిగింది. ఇక్కడ ఎకరానికి 250 నుంచి 300 మొక్కలను నాటవచ్చని ఒక్కో మొక్క సుమారు 100 రూపాయలు ఉంటుందని తెలిపారు. తాను మూడు ఎకరాల వరకు ఈ కాశ్మీర్ రెడ్ ఆపిల్ బేర్ రేగుపండ్ల మొక్కలు నాటినట్లు తెలిపాడు. చెట్టు ఎదిగి సుమారు 15 నుంచి 20 కిలోల రేగు పనులను ఇస్తుందని వివరించారు. అయితే మొక్కను ఏప్రిల్ మే నెలలో మూరెడు వరకు కట్ చేసి నాటిన తర్వాత జూన్ జూలైలో వర్షాకాలం సమయంలో ఇగురు రావడం జరుగుతుందని ఆ తర్వాత ఆరు నెలల సమయంలో పంట చేతికి వస్తున్నట్లు తెలిపాడు. మొక్కలు ఎదగడానికి డిఏపి లేదా కోడి ఎరువు, పశువుల పెంటను వాడడమే కాకుండా క్రమం తప్పకుండా నీరు అందించాలని తెలిపారు. ఒక ఎకరాకు లక్ష రూపాయలు ఖర్చు పెడితే రెండు లక్షల 50 వేల నుండి మూడు లక్షల వరకు ఆదాయం సమకూర్తున్నట్లు తెలిపాడు. ప్రస్తుతం మార్కెట్‌లో రెడ్ ఆపిల్ బేర్ రేగుపండ్లకు డిమాండ్ ఉందని ఒక్కోకిల రేగు పండ్లు 200 నుంచి 220 వరకు ధర ఉన్నట్లు రైతు ఆవునూరి రాముర్తి పేర్కొన్నారు. కాశ్మీర్ రెడ్ ఆపిల్ బేర్ రేగుపండ్లలో సాధారణ ఆపిల్స్ కంటే ఎక్కువగా పోషక పదార్థాలు ఉండడం వల్ల ఇవి ఎంతో ఆరోగ్య దాయకమైనవిగా గుర్తించారు. సాధారణ పంటలకు భిన్నంగా ఈ రకమైనటువంటి పంటలను వేయడం వల్ల తమలాంటి రైతులకు ఆర్థికంగా ఉపయోగకరంగా ఉంటుందని రైతు రాముర్తి వివరించారు. ఈ రకమైనటువంటి పంటలను పండిస్తున్న రైతులను ప్రభుత్వం రుణాలు ఇచ్చి ఆర్థికంగా ఆదుకోవాలని కోరుతున్నాడు.

# రక్తదానం చేయండి.. ప్రాణాలు కాపాడండి..



**హయత్‌నగర్, జనవరి 13 (జనంసాక్షి) :** భారత కమ్యూనిస్టు పార్టీ హయత్ నగర్ మండల సమితి ఆధ్వర్యంలో, ఎల్బీనగర్ నియోజకవర్గ కార్యదర్శి సామిడి శేఖర్ రెడ్డి జన్మదిన సందర్భంగా..కార్యదర్శి శేషరాజు పల్లి శ్రీదేవి అధ్యక్షతన హయత్ నగర్ లో ఉచిత రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిపిఐ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవింద్రాచారి హాజరైనారు. ఈ సందర్భంగా రవీంద్ర చారి మాట్లాడుతూ సమాజ సేవ, రోగులకు ఉచితంగా బ్లడ్ డొనేషన్ చేయడం అనేది మంచి విషయమని అన్నారు. భవిష్యత్తులో పార్టీని బలోపేతం చేస్తూ, బ్లడ్ డొనేషన్ కార్యక్రమం ఏర్పాటు చేసి, రక్తహీనత ఉన్నటువంటి పేషెంట్లకు అందించే విధంగా ప్రయత్నం చేయ్యాలని కార్యకర్తలకు వారు పిలుపునిచ్చారు.
రక్తదానం చేసి, ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షులు పోలోజు లక్ష్మణాచారి, మండల సహాయ కార్యదర్శులు మర్రి శోభన్, అరుణ్ కుమార్ గౌడ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సామిడి వంశి వర్ధన్ రెడ్డి, ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యులు రమావత్ సక్రు, నాగరాజు, నాగేష్ గౌడ్, శ్రీధర్ రెడ్డి, చెంది వెంకట్, వీరన్న, సురేందర్, బాలు, బీచుపల్లి, లచ్చు, కృష్ణ, కొమ్ము సురేందర్, వేణు, చంటి, లింగస్వామి,శీను, ప్రసాదు, నందు తదితరులు పాల్గొని రక్తదానం చేశారు.

# కోడిపందాలపై పోలీసుల దాడి

- 12 మందితో నగదు 43,220, రెండు కార్లు, మూడు బైకులు, 2 కోడి కత్తులను స్వాధీనం



**చెన్నూర్, జనవరి 13 (జనంసాక్షి) :** నియోజకవర్గంలోని జైపూర్ మండలం లోని కిష్టాపూర్ గ్రామ శివారులో డబ్బులు పందెముగా పెట్టి కోళ్ల పందాలు ఆడుతున్నారని సమాచారంతో జైపూర్ ఎస్సై సిబ్బందితో స్థావరాలపై దాడి నిర్వహించారు. కోడిపందాలు వస్తావరాల లో కోడిపందాలు ఆడుతున్న 12 మందిని వారి వద్ద నగదు 43,220 రూపాయలు, రెండు కార్లు, మూడు బైకులను ,రెండు కోడి కత్తులను, ఎనిమిది సెల్ఫోన్లను స్వాధీనం చేసుకొని పందేలు నిర్వహిస్తున్న వారిపై ఎస్సై శ్రీధర్ కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు.

# యువకులపై తేనెటీగల దాడిచేసిన వారికి పరామర్శ..

- ఆర్బీఓఎల్ సీఈవో బుయ్యని శ్రీనివాస్ రెడ్డి



**తాండూరు, జనవరి 13 (జనంసాక్షి) :** యువకులపై తేనెటీగల దాడి చేసిన ఘటనలో తీవ్రంగా గాయపడిన యువకులను ఆర్బీఓఎల్ సీఈవో బుయ్యని శ్రీనివాస్ రెడ్డి పరామర్శించారు. తాండూర్ నియోజకవర్గంలోని బషీరాబాద్ మండలానికి చెందిన యువ రైతులపై తేనెటీగలు దాడి చేసిన ఘటన విషయం బాధిత సూర్యనాయక్ ద్వారా ఆర్బీఓఎల్ సీఈవో బుయ్యని శ్రీనివాస్ రెడ్డికి సమాచారం అందజేశారు స్పందించిన బుయ్యని శ్రీనివాస్ రెడ్డి పట్టణంలోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి చేరుకొని తేనెటీగల దాడలో గాయపడిన యువకులను పరామర్శించి మనోధైర్యం కల్పించారు.తేనె టీగల బాధితుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులని కోరారు. బాధితులకు ఎలాంటి సాయం కావాలన్నా అందిస్తానని హామీ ఇచ్చారు. అధైర్య పడకండి అండగా ఉండాలని వెల్లడించారు.

# క్రీడలతోనే శారీరక, మానసిక ఉల్లాసం



**తలకొండపల్లి, జనవరి 13 (జనంసాక్షి) :** క్రీడలతోనే మానసిక ప్రశాంతత,శారీరక దారుణ్యానికి దోహదపడతాయని తలకొండపల్లి మాజీ ఎంపీపీ బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సిఎల్ శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సోమవారం తలకొండపల్లి మండలంలోని చెన్నంపల్లి (సిపిఎల్) ఇశ్రాయపల్లి (ఐపిఎల్) క్రికెట్ టోర్నమెంట్లను సిఎల్ శ్రీనివాస్ యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఓటమి మరో గెలుపునకు నాంది పలుకుతుందని,పోటీల్లో ఓడిన వారు నిరుత్సాహం చెందకుండా రాబోయే ఆటల్లో గెలిపే లక్ష్యంగా ముందుకు వెళ్లాలన్నారు.క్రీడలు ఆడటం మూలాన మనిషి ఆరోగ్యంతో పాటు శరీర దారుఢ్యానికి ఎంతో ఉపయోగ ఉంటుందని అన్నారు.ఇరుజట్ల క్రీడాకారులను ఆయన అభినందించి షేక్ హ్యాండ్ అందజేశారు.ఈ కార్యక్రమంలో గట్టు ఇప్పలపల్లి మాజీ సర్పంచ్ జయమ్మ వెంకటయ్య,వీరన్నపల్లి మాజీ సర్పంచ్ లింగం గౌడ్,సింగల్ విండో డైరెక్టర్ గట్టిప్పలపల్లి కృష్ణయ్య,బిజెపి నాయకులు శేఖర్ రెడ్డి,వెల్జాల్ మాజీ ఉపసర్పంచ్ అజీజ్,నాయకులు మస్క వెంకటయ్య,పురం జంగయ్య,టీ షర్టు దాత వారణాసి వెంకటేష్,గట్టు రాఘవేందర్,శ్రీకాంత్,విజయ్ యాదవ్,మాడుగుల రాజు,రాఘవేందర్ గౌడ్,కిరణ్,రఘుగౌడ్,శివ మస్కరాజు తదితరులు పాల్గొన్నారు.

# డీడీఎస్ ఆధ్వర్యంలో పాత పంటల జాతర

- నేడు వడ్డీ గ్రామంలో పాతిక వసంతోత్సవ వేడుక



**న్యాల్‌కల్, జనవరి 13 (జనంసాక్షి) :** కాలక్రమేనా కనుమరుగౌవుతున్న చిరుధాన్యాల ఉత్పత్తే ప్రధాన లక్ష్యంగా నాలుగు దశాబ్దాలుగా మహిళా సంఘాలు, మహిళ రైతులతో దిగ్విజయంగా కొనసాగుతున్న డెక్కన్ డెవలప్మెంట్ సొసైటీ (డిడిఎస్) జహీరాబాద్ / పస్తాపూర్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న "పాత పంటల జాతర" నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను డిడిఎస్ సంస్థ సర్వం సిద్ధం చేసింది. సంస్థ ఏర్పాటై పాతిక సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా.."డిడిఎస్ పాత పంటల జాతర"ను ఘనంగా నిర్వహించేందుకు మహిళా సంఘాలు, మహిళ రైతులు ఏర్పాట్లు చేశారు. ఈ నెల14, మంగళవారం మకర సంక్రాంతి పర్వదినం రోజు నుండి ఫిబ్రవరి.11.2025 వరకు 23 రోజుల పాటు పాత పంటల జాతరోత్సవాలు జరగనున్నాయి.

**నేడు వడ్డీలో డిడిఎస్ జాతర ప్రారంభం**

సంగారెడ్డి జిల్లా, న్యాల్‌కల్ మండలం, వడ్డీ గ్రామంలో డెక్కన్ డెవలప్మెంట్ సొసైటీ (డిడిఎస్) ఆధ్వర్యంలో పాత పంటల జాతరను నిర్వహించేందుకు నిర్వాహకులు అవసరమగు ఏర్పాట్లు సిద్ధం చేశారు. డిడిఎస్ సంస్థ గత పాతిక సంవత్సరాలుగా "సంక్రాంతి పర్వదినం" రోజున ప్రతి ఏటా జాతరోత్సవాన్ని నిర్వహిస్తోంది. తాజాగా ఉత్సవాల్లో భాగంగా ఈనెల14, మంగళవారం వడ్డీ గ్రామంలో జాతరను ప్రారంభించి ఫిబ్రవరి 11, ఝరాసంఘం మండలం, మాచ్నూర్ లోని డిడిఎస్ ప్రధాన కార్యాలయం ఆవరణలో జాతరోత్సవాన్ని ముగించనున్నారు. 23 రోజుల పాటు జరగనున్న జాతరలో దాదాపు 400 కిలో మీటర్ల మేర ప్రయాణిస్తూ.. సంస్థ ప్రధాన ఉద్దేశాన్ని రైతులకు అవగాహన కల్పించనున్నారు. డప్పు వాయిద్యాల మధ్య మహిళా సంఘాలు పాత పంటల విశిష్టతను ఆట, పాటలతో వివరిస్తూ సందడి చేయనున్నారు. పాతిక సంవత్సర జాతరోత్సవ కార్యక్రమానికి జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షెట్కర్, ఐసీఏఆర్ సంస్థ డైరెక్టర్ డాక్టర్ షేక్ ఎన్. మీరా, గిరిధర్ బాబు, దివ్య, మాణిక్యం, నరసింహులు, మహిళా సంఘాల సభ్యులు, తదితరులు హాజరుకానున్నారు.

# విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

- మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త



**హైదరాబాద్, జనవరి 13 (జనంసాక్షి) :** విద్యార్థులు క్రీడల్లో రాణించి సమాజానికి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని మేడ్చల్ మల్కాజ్ గిరి బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త గారు అన్నారు. సోమవారం గోవర్దన్ బ్యాడ్మింటన్ అకాడమీ ఉప్పల్ లో పీ. గోవర్దన్ ఆధ్వర్యంలో గత 3 రోజుల నుండి నిర్వహిస్తున్న తెలంగాణ స్టేట్ మినీ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ -2025 ముగింపులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడల్లోరాణించాలి అని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడలకు అన్ని విధాల కృషి చేస్తుంది అని ఆయన అన్నారు. క్రీడాకారులకు అవసరమైన అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని ఆయన తెలిపారు. రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆయన కోరారు. ఈ టోర్నమెంట్ లో మొత్తం 230 మంది క్రీడాకారులు పాల్గొన్నారు ఈ టోర్నమెంట్ లో అండర్ 13 గర్ల్స్ డబుల్స్ విభాగంలో విజేతగా అనుముల శ్రీ వైభవి పొద్దుట్టూరు అన్యా, రన్నర్‌గా అండర్ 13 బాయ్స్ కేటగిరి విజేత కార్తికేయ మహర్షి తలారి శివాన్స్ అండర్ 13 గర్ల్స్ సింగిల్స్ విజేత లోష రన్నర్ జాదవ్ ,అండర్ 13 అండర్ సింగిల్స్ విజేత శివం రన్నర్ అద్విత్ షర్టు అండర్ 11 గర్ల్స్ డబుల్ విజేత దుర్గాహరని సైనా శర్మ రన్నర్ ఆఫ్ అబ్లిన్ సన్వి, అండర్ 11 బాయ్స్ డబుల్ విన్నర్‌గా శ్రీరామ్ అండర్ 11 గర్ల్స్ సింగిల్ విజేత సైనా శర్మ మన్విత్ రెడ్డి వేదర్ష్ రెడ్డి, రన్నర్ బాయ్స్ సింగిల్స్ విజేత శ్రీరామ్ తోట రన్నర్ సిద్ధార్థ పేరూరి తదితరులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ క్రీడాకారుడు విష్ణువర్ధన్ ,రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీనివాస్ రావు, బ్యాడ్మింటన్ మెంబర్ సూరి వెంకట్, పీవీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వ రాయితీలు కల్పించాలి



**బెల్లంపల్లి, జనవరి 13 (జనంసాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తొలి తరం తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వపరంగా రాయితీలు కల్పించి ఆదుకోవాలని తెలంగాణ తొలి తరం ఉద్యమకారులు కోరారు. సోమవారం బెల్లంపల్లి ప్రెస్ క్లబ్ లో వారు మాట్లాడారు. 1968 లో బెల్లంపల్లి ప్రాంతంలో టి.నాగయ్య ఆధ్వర్యంలో తెలంగాణ తొలి దశ ఉద్యమంలో పోరాటం ప్రారంభించామన్నారు. అనేకసార్లు పోలీసుల చేతిలో నాటే దింపలు తిని జైలకు కూడా వెళ్లి వచ్చామన్నారు. 1969లో ఉద్యమకారులుగా అరెస్టయి జైలుకు వెళ్ళామన్నారు. తొలిదశ ఉద్యమంలో 369 మంది పోలీసు కాల్పుల్లో మరణించడం దేశంలోనే చారిత్రక ఘట్టంగా నిలిచిందన్నారు. మలిదశ సకలజనుల సమ్మెలో కూడా తాము పాల్గొన్నామన్నారు. గత కేసిఆర్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులను తీవ్రంగా మోసం చేసిందని ఆవేదన చెందారు. తెలంగాణ ఉద్యమకారుడు నలుమాసు స్వామి తమ కేసును వాదించి హైకోర్టులో తమకు అనుకూలంగా తీర్పు వచ్చేలా చేశారని చెప్పారు. ప్రస్తుతం తాము వయోభారంతో, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తొలి తరం తెలంగాణ ఉద్యమకారుల కుటుంబాలకు అండగా నిలిచి ఆదుకోవాలని వారు వేడుకున్నారు. తమకు భూమి, రిజర్వేషన్, తమ పిల్లలకు విదేశీ ప్రయాణాలు రాయితీ, ఆరోగ్యశ్రీ సేవలను అందించాలని ప్రభుత్వాన్ని వేడుకున్నారు. ఈ సమావేశంలో ఉద్యమకారులు జంజీరాల రాజం, జాగాటి బాపు, తోకల లింగయ్య, కే. ఎం సత్యనారాయణ, పంగ బొంద్యాలు, రాజం రెడ్డి, జహంగీర్ పాషా, మలిగొండ సత్యనారాయణ, జెర్రీ బోతుల మొగిలి, కాసర్ల పెద్దులు, సింగారావు రామచందర్, ఈట మల్లేష్, గోసిక లక్ష్మి, పబ్బెల గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# వెంటనే ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలి

- ఎమ్మార్పీఎస్ కళాకారుల సంఘం జాతీయ అధ్యక్షులు అశోక్
- మాజీ ఎంపీ మంద జగన్నాథం మృతికి నివాళి



**బొంరాస్‌పేట, జనవరి 13 (జనంసాక్షి) :** మండల పరిధిలోని రేగడి మైలారం,చౌదర్పల్లి, నాందాపూర్, తుంకిమెట్ల గ్రామాల్లో ఫిబ్రవరి 7న జరిగే లక్ష డప్పులు,వెయ్యి గొంతుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. ఏబిసిడి వర్గీకరణకు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును గౌరవించి వెంటనే అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలని డిమాండ్ వచ్చేనెల ఫిబ్రవరి 7న హైదరాబాద్లో జరిగే లక్ష డప్పులు వెయ్యి గొంతుల కార్యక్రమంలో భాగంగా ఎమ్మార్పీఎస్ కళాకారుల సంఘం జాతీయ అధ్యక్షులు %చీ% అశోక్ బృందం వివిధ జిల్లాలు తిరుగుతూ సోమవారం రేగడిమైలారం గ్రామంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు చేవిటి విజయ్ కుమార్ అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలదండ వేసి నిర్వహించారు. అనంతరం మాజీ ఎంపీ మంద జగన్నాథం మృతి పట్ల ఒక నిమిషం మౌనం పాటించడం జరిగింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ గత 30 సంవత్సరాల నుండి ఏబిసిడి వర్గీకరణ కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన గొప్ప మహోన్నతవాదని అదేవిధంగా రాజ్యాంగం ప్రసాదించిన ప్రజాస్వామ్య దేశంలో మేమెంతనో,మాకంత రిజర్వేషన్ శాతం ఉండాలని కేవలం ఇది మాల, మాదిగల కోసం కాదు ఎస్సీల్లో ఉన్న 58 ఉప కులాల కోసం నడుస్తున్న ఈ పోరాటం న్యాయమైన, ధర్మమైన ఈ పోరాట ఫలితంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలని డిమాండ్ చేశారు .ఈ కార్యక్రమంలో అరుణోదయ సంస్కృతి సమైక్య రాష్ట్ర కార్యదర్శి అనిత,తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు ఎరన్ పల్లి శ్రీనివాస్, అంబేద్కర్ సంఘం తాలూకా అధ్యక్షులు యు. రమేష్ బాబు, ఎస్సీ ఎస్టి మానిటరింగ్ మెంబర్ కోస్గి దస్తప్ప, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు మల్లికార్జున్ మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి సుభాష్ మాదిగ, కళాకారులు/జర్నలిస్టు సాక్షి అంజిలప్ప, కృష్ణయ్య,తెలంగాణ ఉద్యమకారులు మైలారం శ్రీనివాస్,ఎమ్మార్పీఎస్ మైలారం అధ్యక్షులు ఏసు, కాంగ్రెస్ పార్టీ నాయకులు చంద్రప్ప, మండల కో కన్వీనర్ గోవర్ధన్, అంబేద్కర్ సంఘం అధ్యక్షులు రఘుపతి, చౌదర్ పల్లి తుప్పుడు బందయ్యా,జోగు రాములు, లింగన్ పల్లి అధ్యక్షులు యాలప్ప,%చీ%. క్రిష్ణ కార్యనిర్వాహన అధ్యక్షులు షేరి సాయిలు, రాజేష్, చిన్న కాశప్ప, పెద్దరాజు, ప్రభు, పురుషోత్తం, మహేష్, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# క్షీణించిన రూపాయి విలువ

భారత కరెన్సీ సరికొత్త ఆల్‌టైమ్ కనిష్ఠ స్థాయికి పతనమైంది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 0.4 పైసలు క్షీణించి రూ.86.39 వద్ద ముగిసింది. ఒతర్జాతీయంగా డాలర్ బలపడటంతోపాటు అమెరికాలో ఉద్యోగ కల్పన పెరగడంతో రూపాయి విలువ మరింత పడిపోయింది.

భారత కరెన్సీ సరికొత్త ఆల్‌టైమ్ కనిష్ఠ స్థాయికి పతనమైంది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 0.4 పైసలు క్షీణించి రూ.86.39 వద్ద ముగిసింది. అంతర్జాతీయంగా డాలర్ బలపడటంతోపాటు అమెరికాలో ఉద్యోగ కల్పన పెరగడంతో రూపాయి విలువ మరింత పడిపోయింది. అదేవిధంగా అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీరేట్ల తగ్గింపు అంచనాలతో డాలర్ బలపడుతున్నది. గత నెలలో కొత్తగా 2.56 లక్షల మందికి ఉద్యోగాల కల్పన జరిగిందని యూఎస్ నాన్‌ఫార్మ్ పేరోల్స్ డాటా వెల్లడించింది. సర్వీస్ సెక్టార్, తయారీ రంగంలో 1.60 లక్షల ఉద్యోగాలను మాత్రమే కొత్తగా సృష్టించే అవకాశం ఉందని అంచనా వేసినప్పటికీ.. దానికి అదనంగా మరో ఉద్యోగాలు కల్పించడం కూడా డాలర్ బలపడటానికి కారణంగా మార్కెట్ వర్గాలు పేర్కొన్నాయి.

దీనికితోడు అమెరికా ట్రెజరీలకు ప్రాధాన్యం ఇస్తున్న విదేశీ ఇన్వెస్టర్లు భారత ఈక్విటీ మార్కెట్ల నుంచి నిధులను ఉపసంహరించుకుంటున్నారు. ఇది మూలధన ప్రవాహానికి దారితీసింది. ఈ ఒక్క నెలలోనే విదేశీ పెట్టుబడిదారులు భారత స్టాక్ మార్కెట్ల నుంచి 4 బిలియన్ డాలర్లను ఉపసంహరించుకున్నారు. దీంతో రూపాయిపై మరింత ఒత్తిడి పెరుగుతున్నది. అదేవిధంగా ట్రంప్ మరో వారం రోజుల్లో అధ్యక్షుడిగా బాధ్యతలు తీసుకోనున్నారు. అధికారంలోకి వచ్చీరాగానే వాణిజ్యానికి సంబంధించి కఠిన చర్యలు తీసుకుంటారనే అంచనాలు కూడా తోడవడంతో డాలర్ విలువ పెరుగుతూ వస్తున్నది. కాగా, గత మూడు నెలలుగా రూపాయి పతనం కొనసాగుతున్నది. రూపాయి క్షీణత మరికొన్ని రోజులు ఇలాగే కొనసాగే అవకాశం ఉందని, మార్చి నాటికి రూ.88కి పడిపోతుందని ఫారెన్ ఎక్స్ఛేంజ్ గ్లోబల్ హెడ్ బ్రాడ్ బెచెల్ అన్నారు.



# కుప్పకూలిన స్టాక్ మార్కెట్‌లు..

సెన్సెక్స్, నిఫ్టీ భారీగా పతనం దేశీయ స్టాక్ మార్కెట్లు ఇవాళ ట్రేడింగ్ ప్రారంభంలోనే కుప్పకూలాయి. వరుసగా నాలుగోరోజు మార్కెట్‌లు నష్టపోయాయి. అన్ని సెక్టార్లలో అమ్మకాల ఒత్తిడితో సెన్సెక్స్ నిఫ్టీ 50 భారీగా పతనమయ్యాయి. దేశీయ స్టాక్ మార్కెట్లు ఇవాళ ట్రేడింగ్ ప్రారంభంలోనే కుప్పకూలాయి. వరుసగా నాలుగోరోజు మార్కెట్‌లు నష్టపోయాయి. అన్ని సెక్టార్లలో అమ్మకాల ఒత్తిడితో సెన్సెక్స్ నిఫ్టీ 50 భారీగా పతనమయ్యాయి. బీఎస్ఈ సూచీ సెన్సెక్స్ 800 పాయింట్లకుపైగా క్షీణించి 76,500కు పడిపోయింది. ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ కూడా 23,172 పాయింట్లకు దిగి వచ్చింది.

మిడ్ క్యాప్, స్మాల్ క్యాప్ సెగ్మెంట్లు తీవ్ర అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కోవడంతో సూచీలపై ప్రతికూల ప్రభావం పడింది. బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ విలువ 5 నిమిషాల్లోనే రూ.5 లక్షల కోట్లు ఆవిరై రూ.430 లక్షల కోట్ల నుంచి రూ.425 లక్షల కోట్లకు పడిపోయింది. గత నాలుగు సెషన్లలో చూస్తే ఇన్వెస్టర్ల సంపద ఏకంగా రూ.17 లక్షల కోట్లు ఆవిరైంది. ఇవాళ స్టాక్ మార్కెట్ల భారీ నష్టాలకు కొన్ని ముఖ్యమైన కారణాలున్నాయని నిపుణులు చెబుతున్నారు.

చమురు ధరలు..

అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు గత మూడు నెలల్లోనే గరిష్ట స్థాయికి చేరుకున్నాయి. అమెరికా ఆంక్షలు రష్యా చమురు సరఫరాపై ప్రభావం చూపే అవకాశం ఉందని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. భారత్, చైనా దేశాలకు రష్యా అధిక చమురును సరఫరా చేస్తోంది. రష్యా లక్ష్యంగా జో బైడెన్ చమురు, గ్యాస్ సరఫరాపై ఆంక్షలు విధించారు.

రూపాయి పతనం

అమెరికా డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ ఆల్ టైమ్ కనిష్టస్థాయికి అంటే రూ.86.27 కు పడిపోయింది. ముడి చమురు ధరలు పెరగడం, డాలర్ బలపడటం మార్కెట్లపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతోంది.

ట్రంప్ విధానాలపై అనిశ్చితి

అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ జనవరి 20న బాధ్యతలు చేపట్టనున్నారు. భారత్, చైనా సహా ఇతర దేశాలు లక్ష్యంగా ఆయన టారిఫ్‌లు విధించే అవకాశం ఉందని ఆందోళనలు ఉన్నాయి. అయితే ఇది కచ్చితంగా జరుగుతుందని చెప్పే పరిస్థితి లేదు. ఒకవేళ టారిఫ్‌లు పెంచితే మాత్రం ఆసియా ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం తప్పదు.

ఫారెన్ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు 2025లో జనవరి 10వ తేదీవరకే రూ.21,350 కోట్ల విలువచేసే షేర్లను విక్రయించారు. డిసెంబర్‌లో రూ.16,982 కోట్లతో పోల్చితే అధికంగా విక్రయాలు జరిపారు. అక్టోబర్ నుంచి వారు వరుసగా విక్రయాలు జరుపుతూనే ఉన్నారు.

# త్రైమాసిక ఫలితాలపై ఆధారం




దేశీయ స్టాక్ మార్కెట్లు నష్టాల్లో కొట్టుమిట్టాడుతున్నాయి. కొత్త ఏడాదిలో మదుపరులు పెట్టుబడుల ఉపసంహారణలకే పెద్దపీట వేస్తున్నారు. ఇటీవలి ఒడిదొడుకులు దీనికి రుజువు. ఈ క్రమంలోనే అంతకుముందు వారం ముగింపుతో చూస్తే గత వారం బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 1,844.20 పాయింట్లు లేదా 2.32 శాతం క్షీణించి 77,378.91 వద్ద నిలిచింది. దేశీయ స్టాక్ మార్కెట్లు నష్టాల్లో కొట్టుమిట్టాడుతున్నాయి. కొత్త ఏడాదిలో మదుపరులు పెట్టుబడుల ఉపసంహారణలకే పెద్దపీట వేస్తున్నారు. ఇటీవలి ఒడిదొడుకులు దీనికి రుజువు. ఈ క్రమంలోనే అంతకుముందు వారం ముగింపుతో చూస్తే గత వారం బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 1,844.20 పాయింట్లు లేదా 2.32 శాతం క్షీణించి 77,378.91 వద్ద నిలిచింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 573.25 పాయింట్లు లేదా 2.38 శాతం పతనమై 23,431.50 దగ్గర స్థిరపడింది. దీంతో ఈ వారం కూడా ట్రేడింగ్‌లో ఒడిదొడుకులకు ఆస్కారముందని మెజారిటీ నిపుణులు అంచనా వేస్తున్నారు. అయితే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25) మూడో త్రైమాసికానికి (అక్టోబర్–డిసెంబర్)గాను ఆయా సంస్థలు ప్రకటించే ఆర్థిక ఫలితాలు మార్కెట్లను నడిపిస్తాయన్న అభిప్రాయాలూ ఉన్నాయి. ఇక డాలర్‌తో పోల్చితే అంతకంతకూ పడిపోతున్న రూపాయి మారకం విలువ.. మార్కెట్ లాభాలను ఆవిరిచేస్తున్నది. దీంతో రూపీ పెరిగితే మార్కెట్లకు కలిసిరానున్నది. అలాగే గ్లోబల్ స్టాక్ మార్కెట్ల తీరుతెన్నులు, విదేశీ మదుపరుల పెట్టుబడులు, ముడి చమురు ధరలు, అంతర్జాతీయ పరిణామాలూ ముఖ్యమే. కాగా, అమ్మకాల ఒత్తిడి కనిపిస్తే నిఫ్టీకి 23,100 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 22,800 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం నిఫ్టీ 23,800–24,100 స్థాయికి వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.

**నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 573.25 పాయింట్లు లేదా 2.38 శాతం పతనమై 23,431.50 దగ్గర స్థిరపడింది. దీంతో ఈ వారం కూడా ట్రేడింగ్‌లో ఒడిదొడుకులకు ఆస్కారముందని మెజారిటీ నిపుణులు అంచనా వేస్తున్నారు. అయితే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) మూడో త్రైమాసికానికి (అక్టోబర్-డిసెంబర్)గాను ఆయా సంస్థలు ప్రకటించే ఆర్థిక ఫలితాలు మార్కెట్లను నడిపిస్తాయన్న అభిప్రాయాలూ ఉన్నాయి.**




# ఆరోగ్య బీమా క్లెయిములు కొత్త మార్గదర్శకాలు తెలుసా..!

ప్రస్తుతం ప్రతీ ఒక్కరికీ ఆరోగ్య బీమా ఎంత అవసరం? అనేది ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. మారిన జీవన ప్రమాణాలు, పెరుగుతున్న కాలుష్యం, పుట్టుకొస్తున్న వైరస్‌లు.. అన్నీ కలిసి అనారోగ్య సమస్యల వలయంలోకి అందర్నీ నెట్టేస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో నిజంగా హెల్త్ ఇన్సూరెన్స్ కొండంత ధైర్యమే. అందుకే అంతా ఆరోగ్య బీమాకు ఇంతలా ప్రాధాన్యాన్నిస్తున్నారు.

రెండేండ్లుగా ఏటా ప్రీమియంలనూ చెల్లిస్తున్నాడు. ఇంతలో తన కుమారుడికి అనారోగ్య సమస్య వచ్చింది. వెంటనే హెల్త్ ఇన్సూరెన్స్ ఉంది కదా.. అన్న ధైర్యంతో సమీపంలోని ఓ పెద్ద కార్పొరేట్ దవాఖానలో చేర్చాడు. కానీ చికిత్స జరుగుతుండగా.. బీమా క్లెయిమ్ తిరస్కరణకు గురైంది. సరైన పత్రాలు లేవంటూ బీమా సంస్థ చెప్పింది. అన్ని పత్రాలను సమర్పించినా ఈ రకమైన సమాధానం రావడం ప్రదీప్‌ను ఎంతగానో నిరాశపర్చింది. ఏం చేయాలో తెలియక అయోమయంలోపడ్డ ప్రదీప్‌ను ఆసుపత్రి బిల్లులు ఇంకింత ఆందోళనలోకి నెట్టాయి. ఈ పరిస్థితి మనలో చాలామందికి ఎదురయ్యే ఉంటుంది. అందుకే ఇలాంటి కేసుల్లో ఐఆర్‌డీఏఐ కొత్త మార్గదర్శకాలను తీసుకొచ్చింది. మరి అవేంటో తెలుసా..

ప్రస్తుతం ప్రతీ ఒక్కరికీ ఆరోగ్య బీమా ఎంత అవసరం? అనేది ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. మారిన జీవన ప్రమాణాలు, పెరుగుతున్న కాలుష్యం, పుట్టుకొస్తున్న వైరస్‌లు.. అన్నీ కలిసి అనారోగ్య సమస్యల వలయంలోకి అందర్నీ నెట్టేస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో నిజంగా హెల్త్ ఇన్సూరెన్స్ కొండంత ధైర్యమే. అందుకే అంతా ఆరోగ్య బీమాకు ఇంతలా ప్రాధాన్యాన్నిస్తున్నారు. అయితే పెరుగుతున్న క్లెయిముల్లో ఎక్కువగా తిరస్కరణకు గురవుతుండటం కనిపిస్తున్నది. వీటన్నింటినీ పరిశీలించిన బీమా రంగ రెగ్యులేటర్ ఐఆర్‌డీఏఐ.. కొన్ని మార్గదర్శకాలను విడుదల చేసింది. అవి ఏం చెప్తున్నాయో తెలుసుకుందాం.

ఇదీ సంగతి..

గత ఏడాది పాలసీదారుల ప్రయోజనాల రక్షణార్థం ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఐఆర్‌డీఏఐ) తెచ్చిన మార్గదర్శకాలు.. డాక్యుమెంటేషన్ అవసరాలను చాలా సులభతరం చేసింది. దీంతో పాలసీదారులపై అనవసరపు పత్రాలను సమీకరించే భారం తగ్గిందని చెప్పవచ్చు. అయినప్పటికీ కావాల్సిన డాక్యుమెంట్లు లేవని బీమా సంస్థలు మీ ఆరోగ్య బీమా క్లెయిమ్‌ను తిరస్కరిస్తే.. ఏం చేయాలో ఐఆర్‌డీఏఐ తమ మార్గదర్శకాల్లో స్పష్టంగా పేర్కొన్నది. క్లెయిమ్‌లో మీకున్న న్యాయపరమైన హక్కులనూ తెలియజేసింది. వాటిలో.. కావాల్సిన డాక్యుమెంట్లు లేవని, లేదా క్లెయిమ్ ఆలస్యమైందన్న కారణంతో బీమా సంస్థ పాలసీదారుల అభ్యర్థనను తిరస్కరించరాదు. ఒకవేళ క్లెయిమ్‌ను తిరస్కరిస్తే బీమా కంపెనీలు అందుకుగాను లిఖితపూర్వక వివరణను పాలసీదారులకు ఇవ్వాలి. క్లెయిమ్ నిరాకరణకు బీమా సంస్థ చూపిన కారణాలు పాలసీ నిబంధనలకు లోబడే ఉన్నాయా? అని పాలసీదారులు తెలుసుకోవచ్చు. తద్వారా తప్పిదాలను సరిదిద్దుకోవచ్చు. నేరుగా క్లెయిమ్‌కు కావాల్సిన ప్రధాన డాక్యుమెంట్లను మాత్రమే బీమా సంస్థలు పాలసీదారుల నుంచి కోరవచ్చు. పాలసీని జారీ చేసేటప్పుడు ప్రామాణిక సూచనల్ని తప్పక చేయాలి.

# కార్చిచ్చు వేళ అందినకాడికి దోచుకుంటున్న దొంగలు..



అమెరికాలో కార్చిచ్చు బీభత్సం సృష్టిస్తోంది. ఈ వైల్డ్‌ఫైర్ కారణంగా అమెరికాలోని సంపన్నుల నగరంగా పేరొందిన లాస్ ఏంజెల్స్ మరభూమిని తలపిస్తోంది. బీభత్సం సృష్టిస్తోంది. ఈ వైల్డ్‌ఫైర్ కారణంగా అమెరికాలోని సంపన్నుల నగరంగా పేరొందిన లాస్ ఏంజెల్స్ మరభూమిని తలపిస్తోంది. ఖరీదైన ఇళ్లు, కార్లు, విలువైన సామగ్రి మంటల్లో కాలిబూడిదవుతున్నాయి. చాలా మంది ధనవంతులు, సెలబ్రిటీలు తమ సామాన్లు, కార్లను ఇళ్లలోనే వదిలేసి బతుకుజీవుడా అంటూ సురక్షిత ప్రాంతాలకు తరలిపోతున్నారు. ఈ విపత్తును కొందరు అవకాశంగా చేసుకొని దోపిడీలకు పాల్పడుతుండటం ప్రస్తుతం హాట్‌టాపిక్‌గా మారింది.

బిలియనీర్లు, హాలీవుడ్ స్టార్స్ వదిలేసి వెళ్లిన ఇళ్లను దోపిడీ దొంగలు దోచుకుంటున్నారు. ఇప్పుడు స్థానిక పోలీసులకు ఇది ఓ సవాల్‌గా మారింది. కార్చిచ్చు కారణంగా జనాలను రక్షించడంతోపాటు ఇటు దొంగతనాలను అరికట్టాల్సి రావడంతో తలలు పట్టుకుంటున్నారు. ఇప్పటి వరకూ దొంగతనాలకు పాల్పడుతున్న 29 మందిని అరెస్ట్ చేశారు. అందులోని ఓ వ్యక్తి పోలీసుల నుంచి తప్పించుకునేందుకు ఏకంగా అగ్నిమాపక సిబ్బంది వేషం ధరించి మరీ దొంగతనాలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. వారందరినీ అరెస్ట్ చేశారు. దొంగతనాలను అరికట్టేందుకు షరీఫ్ డిపార్ట్‌మెంట్ గస్తీలను నిర్వహిస్తోంది.

**24కు పెరిగిన కార్చిచ్చు మృతులు**

వేగంగా వీస్తున్న గాలులతో మంటలు కొత్త ప్రాంతాలకు వ్యాపిస్తున్నాయి. దీంతో వేలాది ఇండ్లు కాలి బూడిదవుతున్నాయి. లక్షల కోట్ల రూపాయల ఆస్తి నష్టం వాటిల్లుతోంది. ప్రాణనష్టం సైతం క్రమంగా పెరుగుతోంది. ఇప్పటి వరకూ అందిన సమాచారం ప్రకారం.. కార్చిచ్చులో మరణించిన వారి సంఖ్య 24కు పెరిగింది. మరణించిన వారిలో అత్యధికంగా ఏటోన్ ఫైర్‌లోనే 16 మంది కాగా, పాలిసేడ్స్‌లో 8 మంది ఉన్నారు. మరణాల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఇక ఈ అగ్ని ప్రమాదాల్లో సుమారుగా 16 మంది తప్పిపోయినట్లు స్థానిక మీడియా నివేదించింది. మంటల ధాటికి ఇప్పటి వరకూ 12,000 నిర్మాణాలు అగ్నికి ఆహుతయ్యాయి. అంతేకాదు, పాలిసేడ్స్‌లో 23,707, ఏటోన్‌లో 14,117ఎకరాలు, కెన్నెత్‌లో 1,052, ముర్సెట్‌లో 779 ఎకరాలు దగ్ధమైనట్లు పేర్కొంది.



# భూ కేంద్రంలో మరో పొర.. ఆ రహస్య నిర్మాణం ఏమై ఉంటుంది?

భూమి అనేక పొరలతో కూడిన అంతుబట్టని అద్భుత నిర్మాణం. అత్యంత సంక్లిష్టమైన ఈ నిర్మాణాన్ని సైంటిస్టులు ప్రధానంగా నాలుగు (క్రస్ట్, మాంటెల్, ఔటర్ కోర్, ఇన్నర్ కోర్) పొరలుగా విడగొట్టారు. నాలుగు కాదు..ఐదో పొర కూడా ఉందని గత కొంత కాలంగా ఆస్ట్రేలియన్ నేషనల్ యూనివర్సిటీ సైంటిస్టులు చెబుతున్నారు.

భూమి అనేక పొరలతో కూడిన అంతుబట్టని అద్భుత నిర్మాణం. అత్యంత సంక్లిష్టమైన ఈ నిర్మాణాన్ని సైంటిస్టులు ప్రధానంగా నాలుగు (క్రస్ట్, మాంటెల్, ఔటర్ కోర్, ఇన్నర్ కోర్) పొరలుగా విడగొట్టారు. నాలుగు కాదు..ఐదో పొర కూడా ఉందని గత కొంత కాలంగా ఆస్ట్రేలియన్ నేషనల్ యూనివర్సిటీ సైంటిస్టులు చెబుతున్నారు.

అయితే ఇందుకు సంబంధించి శాస్త్రీయ ఆధారాలు లభ్యమయ్యాయని వారి పరిశోధన పేర్కొన్నది. 'జర్నల్ ఆఫ్ జియోగ్రఫికల్ రీసెర్చ్' ప్రచురితమైన కథనం ప్రకారం, భూమి పొరల్లో కేంద్ర భాగమైన 'ఇన్నర్ కోర్'లో అదనంగా మరో పొర ఉందని శాస్త్రవేత్తల పరిశోధన చెబుతున్నది. ఇన్నర్ కోర్ లోతుల్లో ఉన్న మరో పొర ఇనుము–నికెల్ లోహ మిశ్రమంతో కూడి ఉందని గుర్తించారు. భూకంపం సంభవించాక.. శక్తి తరంగాలు, భూకంప తరంగాలు భూమిలో ఎలా ప్రయాణిస్తున్నాయన్న దానిపై సైంటిస్టులు అధ్యయనం చేస్తున్నారు.

ఈ తరంగాలు వేర్వేరు దిశల్లో వేర్వేరు వేగాలతో పయనిస్తున్న సంగతిని గుర్తించారు. అంతర్గత కేంద్రం (కోర్)లో ఒకటికి బదులు రెండు పొరలు ఉండటం వల్లే ఇది సాధ్యమవుతుందని సైంటిస్టులు చెబుతున్నారు. మానవులు సహ జంతు జీవ జాలమంతా నివసిస్తున్న బయట పొరను 'క్రస్ట్'గా పిలుస్తారు. దీని కింద ఉన్నది 'మాంటిల్'. ఇక భూమి కేంద్ర భాగాన్ని 'కోర్'గా పేర్కొన్నారు. దీనిని ఇన్నర్, ఔటర్..అనే రెండు భాగాలుగా విడగొట్టారు. భూ అయస్కాంత శక్తి ఇక్కడి నుంచే ఉత్పత్తి అవుతున్నది.

# అమెరికా వలసదారుల దేశం



అమెరికా ఒక వలసదారుల దేశమని, ఇక్కడ చట్టబద్ధమైన వలసలకు విస్తృత మద్దతు ఉందని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ దేశీయ విధానాల సలహాదారు, భారత సంతతి అమెరికన్ నీరా టాండన్ పేర్కొన్నారు.

అమెరికా ఒక వలసదారుల దేశమని, ఇక్కడ చట్టబద్ధమైన వలసలకు విస్తృత మద్దతు ఉందని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ దేశీయ విధానాల సలహాదారు, భారత సంతతి అమెరికన్ నీరా టాండన్ పేర్కొన్నారు. భారతీయులు ఎక్కువగా పొందే హెచ్1బీ వీసాలపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతున్న నేపథ్యంలో పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె కీలక వ్యాఖ్యలు చేశారు. 'అమెరికా ఒక వలసవాద దేశం. ఇక్కడ చట్టబద్ధమైన వలసలకు విస్తృత మద్దతు ఉందనే విషయాన్ని వలస విధానంపై జరుగుతున్న చర్చలో విస్మరిస్తున్నారు' అని ఆమె పేర్కొన్నారు. 'భారతీయ అమెరికన్లపై ప్రదర్శిస్తున్న ద్వేషంపై నేను స్పందించినప్పుడు నాపైనా ద్వేషపూరిత ట్వీట్లు చేశారు. నేను భారత్‌కు తిరిగి వెళ్లిపోవాలని మాట్లాడుతున్నారు. భారతీయ అమెరికన్లను లక్ష్యంగా చేసుకొని కొందరు మాటల దాడి చేస్తుంటే ట్రంప్ మౌనం పాటించడం సరికాదు. భారత అమెరికన్లు, ప్రత్యేకించి రిపబ్లికన్ పార్టీలో ఉన్నవారు ఈ ద్వేషానికి వ్యతిరేకంగా గళమెత్తాలి' అని ఆమె అన్నారు.

**'అమెరికా ఒక వలసవాద దేశం. ఇక్కడ చట్టబద్ధమైన వలసలకు విస్తృత మద్దతు ఉందనే విషయాన్ని వలస విధానంపై జరుగుతున్న చర్చలో విస్మరిస్తున్నారు' అని ఆమె పేర్కొన్నారు. 'భారతీయ అమెరికన్లపై ప్రదర్శిస్తున్న ద్వేషంపై నేను స్పందించినప్పుడు నాపైనా ద్వేషపూరిత ట్వీట్లు చేశారు. నేను భారత్‌కు తిరిగి వెళ్లిపోవాలని మాట్లాడుతున్నారు.**

# పాకిస్థాన్‌కు జాక్‌పాట్!



ప్రపంచంలోని అత్యంత పురాతన నాగరికతల్లో ఒకటైన సింధు లోయ నాగరికతలో అంతర్భాగమైన చారిత్రతక సింధు నది ఇప్పుడు స్వర్ణ గంగగా మారింది. ఈ నది ఇప్పుడు పాకిస్థాన్‌కు బంగారు రాశులిచ్చే కల్పవల్లిగా మారింది.

ప్రపంచంలోని అత్యంత పురాతన నాగరికతల్లో ఒకటైన సింధు లోయ నాగరికతలో అంతర్భాగమైన చారిత్రతక సింధు నది ఇప్పుడు స్వర్ణ గంగగా మారింది. ఈ నది ఇప్పుడు పాకిస్థాన్‌కు బంగారు రాశులిచ్చే కల్పవల్లిగా మారింది. ఈ నదిలో ఎవరూ ఊహించనంత బంగారు నిక్షేపాలు దాగి ఉన్నట్టు పాక్ మీడియా ఇటీవల వెల్లడించింది. వాటి విలువ పాకిస్థాన్ కరెన్సీలో రూ.60 వేల కోట్లు (భారత కరెన్సీలో దాదాపు రూ.18,500 కోట్లు) ఉండవచ్చని మీడియా కథనాలు వెలువడ్డాయి.

పంజాబ్ ప్రావిన్సులో ప్రవహించే సింధు నదిలో బంగారంతోపాటు ఇతర విలువైన ఖనిజ నిక్షేపాలు ఉన్నట్టు పత్రికలు తెలిపాయి. పాకిస్థాన్‌కు ఉత్తరం వైపున ఉన్న హిమాలయాల నుంచి వేగంగా వస్తున్న నదీ ప్రవాహంలోకొట్టుకువస్తున్న బంగారు రేణువులు నది ఒడ్డుకు చేరుకుంటున్నాయని పత్రికలు తెలిపాయి. హిమాలయాల నుంచి సింధు నది రవాణా చేస్తున్న బంగారు నిల్వలు దాదాపు 32.6 మెట్రిక్ టన్నులు ఉంటాయని పాకిస్థాన్‌కు చెందిన పార్లమెంట్ టైమ్స్ దినపత్రిక వెల్లడించింది. ఈ బంగారు నిక్షేపాలు 32 కిలోమీటర్లు విస్తరించి ఉన్నాయని తెలిపింది.

# ఏఐ రోబో గర్ల్‌ఫ్రెండ్..

## మగవారి ఒంటరితనాన్ని దూరం చేస్తుందట!

హాలీవుడ్ సైన్స్ ఫిక్షన్ మూవీ 'హర్'ను తలపిస్తూ అమెరికా టెక్ కంపెనీ ఏఐ రోబో గర్ల్‌ఫ్రెండ్‌ను తీసుకొచ్చింది. దీని ధర కేవలం రూ.1.5 కోట్లు(సుమారుగా 1,75,000 డాలర్లు). అచ్చు గుద్దినట్టు మనుషులను పోలి ఉండటమే కాదు, మనిషిని..రోబోను వేరు చేయలేనంతగా ఇది మనుషుల్లో కలిసిపోతుందట.

హాలీవుడ్ సైన్స్ ఫిక్షన్ మూవీ 'హర్'ను తలపిస్తూ అమెరికా టెక్ కంపెనీ ఏఐ రోబో గర్ల్‌ఫ్రెండ్‌ను తీసుకొచ్చింది. దీని ధర కేవలం రూ.1.5 కోట్లు(సుమారుగా 1,75,000 డాలర్లు). అచ్చు గుద్దినట్టు మనుషులను పోలి ఉండటమే కాదు, మనిషిని..రోబోను వేరు చేయలేనంతగా ఇది మనుషుల్లో కలిసిపోతుందట. పురుషుల ఒంటరితనాన్ని దూరం చేయగల సహచరిణిగా ఈ రోబో ఉండగలదని దీన్ని తయారుచేసిన 'రియల్ బోటిక్స్' కంపెనీ చెబుతున్నది.

లాస్ వెగాస్‌లో జరుగుతున్న '2025–కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్' షోలో తాము అభివృద్ధి చేసిన 'ఆరియా' రోబో గర్ల్‌ఫ్రెండ్‌ను రియల్‌బోటిక్స్ ఆవిష్కరించింది. దీని గురించి కంపెనీ సీఈవో ఆండ్రూ కిగ్వెల్ మాట్లాడుతూ, 'పురుషుల ఒంటరితనాన్ని దూరం చేయగలిగేది, మనుషుల నుంచి వేరు చేయలేని విధంగా ఉండేలా ఓ రోబోను తీసుకురావాలనుకున్నాం' అని అన్నారు. ఇంతవరకు ఎవ్వరూ చేయని విధంగా భావోద్వేగాలను పంచుకునే ఒక రియలిస్టిక్ రోబోను తయారుచేశామని ఆయన అన్నారు. సహచరణిగా 'ఆరియా' కొంత మందికి మనోహరమైనది, మరికొంత మందికి భయంకరమైనదని కిగ్వెల్ చమత్కరించారు.

# రైతాంగం బాగుంటేనే అందరూ బాగుంటారు





రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి జనవరి 13 (జనంసాక్షి)

రైతాంగం బాగుంటేనే అందరూ బాగుంటారని, రాజన్న ఆలయంలో జరగనున్న నిత్య అన్నదానానికి రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తన అన్నదమ్ములు కుటుంబ సభ్యుల పేరుపై రూ 40 లక్షల విరాళం ప్రకటించగా, ప్రభుత్వ విప్పు వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తన తల్లిదండ్రులు కుటుంబ సభ్యుల పేరున రూ 10 లక్షల విరాళాన్ని ప్రకటించారు. ఆరుద్ర నక్షత్రం సోమవారం పౌర్ణమి సందర్భంగా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ,ప్రభుత్వ విప్ ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్, ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ గెస్ట్ హౌస్ లో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రైతాంగం బాగుంటేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని ప్రజలంతా బాగుంటారన్నారు. ఈ సీజన్ లో కూడా మంచి పుష్కలమైన వర్షాలు పడి, ఆయు ఆరోగ్యాలతో పాడి పంటలతో, ప్రజలంతా సుఖ సంతోషాలతో తెలంగాణ సమాజం బాగుండాలని రాజన్న స్వామిని మొక్కుకున్న అన్నారు. దక్షిణ కాశీ వేములవాడ అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తో పాటు నాది ,ఈ ప్రాంత ప్రజల చిరకాల స్వప్నం నిత్య అన్నదాన సత్రం ఏర్పాటు చేయడమనిముఖ్యమంత్రిని మేము కోరగానే అన్నదాన సత్రం భవన నిర్మాణానికి రూ 35 కోట్లు మంజూరు చేస్తూ జీవో కూడా విడుదల చేశారన్నారు. రూ 35 కోట్లతో అన్నదాన సత్రం భవన నిర్మాణానికి టెండర్ ప్రక్రియ జరుగుతుందన్నారు. ప్రస్తుతం రాజన్న ఆలయంలో నిర్వహిస్తున్న నిత్య అన్నదానం కొంతమందికే చేపడుతున్నారని అలా కాకుండా నిరంతరం జరగడానికి ట్రస్ట్ లో వంద కోట్లు చేసే బాధ్యత జిల్లా ప్రజా ప్రతినిధులది ఈ ప్రాంత ప్రజలదన్నారు .అన్నదాన సత్రం కోసం మా కుటుంబ సభ్యులు ,మా అన్నదమ్ములు కలిసి రూ 40 లక్షలు నిత్యాన్నదాన సత్రంకు విరాళం ఇస్తున్నామన్నారు. శ్రీరాజరాజశ్వర స్వామి భక్తులుగా దాతలు ఉంటే విరాళాలు ఇవ్వాలని కోరుతున్నామన్నారు. స్వామి ఆశీర్వాదంతో నిత్యాన్నదాన సత్రం విజయవంతం కావడానికి భక్తులు అంత సహకరించాలన్నారు. వేములవాడ రాజన్న అన్నదాన ట్రస్ట్ కి సంబంధించి విరాళాలుగా రైతులు బియ్యం ,కూరగాయలు కూడా ఇవ్వచ్చన్నారు. అన్ని పార్టీల వాళ్లు ఎవరెవరు ఆర్థికంగా ఉన్న ఆ దేవాలయానికి వెచ్చిస్తే సంతోషమన్నారు. మేము ఇద్దరం కలిసి హైదరాబాద్ లో దాతలను కలుస్తామన్నారు. రాజన్న ఆలయాన్ని అభివృద్ధి చేయాలని వీఐపీ ప్రోటోకాల్ దర్శనం చేసుకునే వారు టికెట్ తీసుకోవాలన్నారు. బ్రేక్ దర్శనం ఆలస్యం లేకుండా త్వరత్వరగా జరుగుతుం దని,మహా శివరాత్రికి సంబంధించి ఇప్పటికే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సమీక్షా సమావేశం నిర్వహించారన్నారు. శ్రీశైలం లో ఉన్న మాదిరి మ్యూజికల్ ఫౌంటెన్ వేములవాడలో లార్డ్ శివ ఉండేలా త్వరలో చేస్తమన్నారు. ధర్మపురి నుండి ఏసీ బస్సు స్టార్ట్ అయిందని,వేములవాడ నుండి కూడ ఏసీ బస్సు ప్రారంభిస్తమన్నారు. వేముల వాడ,ధర్మపురి బస్టాండ్లను అభివృద్ధి చేస్తమన్నారు. ప్రభుత్వ విప్ ధర్మపురి ఎమ్మెల్యే ఆలూరి లక్ష్మణ్ మాట్లాడుతూవేముల వాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి మా ఇలవేల్పు కులదైవమన్నారు. హైదరాబాద్ నుండి వచ్చే భక్తులు రాత్రి వేములవాడకు వచ్చి ఉదయం దర్శనం చేసుకొని తరువాత కొండగట్టు, ధర్మపురి దర్శనం చేసుకుంటారన్నారు. రాజన్నలయం కొండగట్టు అంజన్న ఆలయం ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని టూరిజం కారిడార్ గా ఏర్పాటు చేయాలని మంత్రిని ఆయన కోరారు. కేంద్ర ప్రభుత్వం నుండి నిధులు తీసుకొచ్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలన్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూవేములవాడ ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ తీసుకున్నారన్నారు. దేశ వ్యాప్తంగా ఎంతో చరిత్ర ఉన్నా కోరిన కోర్కెలు తీర్చి పేదల పెన్నిధి దక్షిణ కాశీ గా వేములవాడ పేరొందిందన్నారు. రూ 20 కోట్లు ఉన్న అన్నదాన సత్రంను రూ 100 కోట్లకు పెంచుకుంటమన్నారు. దాతల విరాళాలు డిస్ ప్లే బోర్డులో వేయడం జరుగుతుందని,నా తల్లి తండ్రి,కొడుకు పేరు మీద రూ10 లక్షలు అన్నదాన సత్రం కి విరాళం ఇస్తునట్లు ప్రకటిం చారు .హైదరా బాద్ నుండి వేములవాడకు రెండున్నర గంటల ప్రయాణమని హైదరాబాద్ ప్రజలు ఆలయాన్ని సందర్శించండని కోరారు. మీరు ఒక్కరోజు ప్లాన్ చేసుకుంటే వేములవాడ, కొండగట్టు,ధర్మపురి దేవాలయాలు దర్శనం చేసుకోవచ్చన్నారు .టూరిజం గా కూడా అభివృద్ధి చేస్తమన్నారు. టెండర్ల ప్రక్రియ ప్రారంభం అవుతుందని,ఆలయ విస్తీర్ణం,రోడ్ల విస్తీర్ణం, అన్నదాన సత్రం నిర్మాణాలకు టెండర్ల ప్రక్రియ జరుగుతుందన్నారు.

**అన్నదానానికి 40 లక్షల విరాళం ప్రకటించిన మంత్రి పొన్నం**
**అన్నదానానికి 10 లక్షలు విరాళం ప్రకటించిన ప్రభుత్వ విప్ ఆది**

# కౌశిక్ రెడ్డి ప్రవర్తన సిగ్గుచేటు



కరీంనగర్ బ్యూరో, జనవరి 13 (జనంసాక్షి) :

**హుజురాబాద్ నియోజకవర్గ ప్రజలు అసహించుకుంటున్నారు**
**స్పీకర్ కు, డీజీపీకి, కరీంనగర్ సిపికి ఫిర్యాదు చేస్తాం**
**చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం**

బీఆర్ఎస్ హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ప్రవర్తనపై కాంగ్రెస్ చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తీవ్ర విమర్శలు చేశారు. సోమవారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఆదివారం కరీంనగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన రివ్యూ సమావేశంలో కౌశిక్ రెడ్డి వ్యవహార శైలి సిగ్గుచేటు అన్నారు. జగిత్యాల కాంగ్రెస్ ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పట్ల కౌశిక్ రెడ్డి దూకుడుగా ప్రవర్తించడం దుర్మార్గం అన్నారు. కెసిఆర్, కేటీఆర్ ఇలాంటి సైకోలను ప్రోత్సహిస్తూ.. శిఖండిలాంటి రాజకీయాలకు పాల్పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పట్ల ప్రజల్లో పెరుగుతున్న ఆదరణను చూసి బీఆర్ఎస్ నాయకులు తట్టుకోలేక ఎత్తుగడలు పన్నుతున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ కుట్రలతో ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందకుండా అడ్డుపడుతున్నారని, ప్రతిపక్ష హోదా లేకుండా చేయడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని కించపరిచారని మండిపడ్డారు. కౌశిక్ రెడ్డి రివ్యూ సమావేశంలో కాంగ్రెస్ నాయకుల పై చేసిన గొడవ తీరును ఖండిస్తూ, ఇలాంటి ప్రవర్తన వల్ల హుజురాబాద్ ప్రజలు తనను ఎమ్మెల్యేగా గెలిపించినందుకు బాధపడుతున్నారని అన్నారు. ఇలాంటి వ్యవహారాలకు పాల్పడితే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు ఇలాంటి సైకోలను అదుపులో పెట్టకపోతే తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. తోటి ఎమ్మెల్యే ఇప్పటికైనా పాడి కౌశిక్ రెడ్డి ముక్కు నెలకు రాసి క్షమాపణ కోరాలని డిమాండ్ చేశారు. మీరు ఇటుకలతో కొడితే మేము రాళ్లతో కొడతామని మా నిబద్ధతను, సౌమ్యతను అలుసుగా తీసుకుంటే ఊరుకునేది లేదన్నారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా వంటి పథకాల అమలుతో ప్రజల్లో, రైతుల్లో ప్రభుత్వంపై నమ్మకం పెరిగిందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి వాగ్దానాలపై నిబద్ధత చూపుతూ సంక్షేమ పథకాలను ముందుకు తీసుకెళ్తున్నారని కొనియాడారు. పాడి కౌశిక్ రెడ్డి పార్టీ ఫిరాయింపులపై చరిత్ర తెలుసుకోని మాట్లాడాలన్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తరువాత కాంగ్రెస్, టిడిపి తదితర పార్టీల ఎమ్మెల్యేలను తమ పార్టీలో చేర్చుకుని ప్రతిపక్ష హోదా లేకుండా చేసిందని తెలిపారు. ఇప్పుడు కాంగ్రెస్‌లో ఇతర పార్టీలు స్వచ్ఛందంగా చేరితే తట్టుకోలేక అక్కసు వ్యక్తం చేస్తున్నారని ఘాటుగా విమర్శించారు. పాడి కౌశిక్ రెడ్డి వ్యవహరించిన తీరుపై స్పీకర్‌కు , డీజీపీకి, కరీంనగర్ పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు బీఆర్ఎస్ అరాచకాలకు ఎదురొడ్డి నిలబడతామన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, ఆకారపు భాస్కర్ రెడ్డి, పులి ఆంజనేయులు, ముత్యం శంకర్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు , కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# శాత్రాజుపల్లి గ్రామాన్ని గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాలి



ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కు గ్రామస్తుల వినతి

వేములవాడ(జనంసాక్షి) :

వేములవాడ మున్సిపాలిటి లో విలీనమైన శాత్రాజుపల్లి గ్రామాన్ని గతంలో గ్రామ సభ, పాలక వర్గం తీర్మాణం లేకుండా బలవంతంగా ఏకపక్ష నిర్ణయంతో వేములవాడ మున్సిపల్ లో శాత్రాజుపల్లి గ్రామాన్ని విలీనం చేశారని, విలీనాన్ని వెంటనే రద్దుపరిచి తిరిగి గ్రామపంచాయతీగా మార్చాలని ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ కు గ్రామస్తులు సోమవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామస్తులమంతా గతంలో విలీనాన్ని తప్పుపడుతూ హైకోర్టు ను ఆశ్రయించిన ఫలితం లేకుండాపోయిందని, వీలినమైనప్పటి నుండి గ్రామ అభివృద్ధి కుంటుపడిరదని, అలాగే గ్రామంలో ప్రధానంగా బహుజనులందరూ కూలి పని చేసుకొని, జీవించే కుటుంబాలకు ఎలాంటి ఉపాది (ఉపాది హామి పథకం) లేకుండా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని,ఇంటి పన్ను, నల్లా పన్ను, రిజిస్ట్రేషన్ పన్నులు, ఇంటి నిర్మాణ అనుమతులు తదితర గ్రామ ప్రజలపై అధిక ఆర్థిక భారం పడుతుందని, వేములవాడ మున్సిపల్ శాత్రాజుపల్లికి దూరంగా ఉండటం వలన ఏ చిన్న పనికైన వేములవాడకు రావడం ప్రజలకు భారంగా మారిందని, 2023 సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో శాత్రాజుపల్లి గ్రామానికి వచ్చినప్పుడు బస్టాండు ఆవరణలో విరీరు మాట్లాడి నేను గెలిచిన తరువాత విరీ గ్రామాన్ని తిరిగి గ్రామ పంచాయితిగా ఏర్పాటు చేసిస్తానని గ్రామ ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని ఆది శ్రీనివాస్ కు వినతి పత్రం అందజేశారు . ఈ కార్యక్రమంలో గ్రామస్తులు గుడిసె సదానందం, గుడిసె మనోజ్ కుమార్,మహేందర్,అనీల్, తదితరులున్నారు.

# పాడి కౌశిక్ రెడ్డి , మాజీ ముఖ్య మంత్రి కేసిఆర్‌లపై కేసునమోదు చేయాలని ఏసీపీ పిర్యాదు

సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి.

కరీంనగర్ బ్యూరో, జనవరి 13 (జనంసాక్షి) :



కౌశిక్ రెడ్డి పదే పదే మంత్రుల పై, ఎమ్మెల్యేలపై దాడి చేయడం చూస్తే వెనకాల ఉండి ప్రతిపక్షనాయకుడు కేసిఆర్ ప్రోత్సహిస్తున్నట్టు స్పష్టంగా అనుమానం కలుగుతోందని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి తెలిపారు. కరీంనగర్ సిటీ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ... ఆదివారం రోజు కలెక్టరేట్ ఆడిటోరియంలో తోటి ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పై ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి దాడి పథకం ప్రకారమే జరిగిందని తెలిపారు. పేదలను, రైతులను అన్ని వర్గాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకుంటుంటే, ఓర్వలేక వ్యక్తిగత దాడులకు పాల్పడుతున్నారని ఇటువంటి దాడులను ఇప్పటికైనా ఆపాలంటే దాడిలో ప్రత్యక్షంగా పాల్గొన్న కౌశిక్ రెడ్డి తో పాటు దాడులను పరోక్షంగా ప్రోత్సహిస్తున్న కేసిఆర్ పై కూడా కేసు నమోదు చేయాల్సిందిగా కరీంనగర్ టౌన్ ఏసిపి వెంకటస్వామికి ఫిర్యాదు చేశామని వారు తెలిపారు. ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి కి పార్టీలు మారడం భాదయితే, పథకం ప్రకారం దాడి చేయలేదని రుజువు చేసుకోవాలనుకుంటే కేసిఆర్ దగ్గరికి వెళ్ళి 2018 లో 88 మంది ఎమ్మెల్యేలు గెలిచినప్పటికి 15 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను బిఆర్ఎస్ పార్టీలో ఎందుకు చేర్చుకున్నారని, దళితుడు మల్లు బట్టి విక్రమార్క సిఎల్పి లీడర్ గా ఉంటే ఎందుకు ప్రతి పక్ష హోదా లేకుండా చేశావని ప్రజలకు తెలిసేలా మీడియా ప్రతినిధుల ముందు నిలదీయాలని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మైనార్టీ సెల్ చైర్మన్ మహ్మద్ తాజోద్దీన్, ఎస్టి సెల్ చైర్మన్ కొరివి అరుణ్ కుమార్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రాజ్య సభ సభ్యులు ఆర్ కృష్ణయ్యకి ఘన సన్మానం.

**జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిగుర్ల శ్రీనివాస్.**

కరీంనగర్ బ్యూరో, జనవరి 13 (జనంసాక్షి) :



సోమవారం రోజు బీసీ భవన్ లో జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య రెండవసారి రాజ్యసభ సభ్యులుగా ఎన్నికైన సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ.. వారికి ఘనంగా సన్మానం చేశారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు బీసీ యువజన సంఘం నూతన సంవత్సరం క్యాలెండర్ ఆవిష్కరించారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిగుర్ల శ్రీనివాస్ ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఉద్యమాల సూర్యుడు అలుపెరుగని పోరాట యోధుడు బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి రాజ్యసభ సభ్యులు శ్రీ ఆర్ కృష్ణయ్య నూతన సంవత్సరంలో బీసీ కులాలలో ఈ భోగి మంటలలో బీసీ కులాల కష్టాలన్నీ భోగి మంటలలో వేసి బడుగు బలహీన వర్గాల జీవితాలలో కొత్త వెలుగులు రావాలని మకరసంక్రాంతి నుండి అందరి జీవితాల్లో సుఖ శాంతులతో , వృత్తి ఉద్యోగాలలో విజయవంతంగా సాగాలని అన్నారు. విద్యార్థులకు పెండింగ్లో ఉన్న బకాయి ఫీజు రియంబర్మెంట్స్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో 50% శాతం కన్నా ఎక్కువ గల జనాభా కలిగిన బీసీ కులాలకు కులగణ వెంటనేన పూర్తి చేసి వాటి వివరాలను బహిరంగపరచాలని తెలంగాణ ప్రభుత్వం వెంటనే బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికలలో విద్యా ఉద్యోగులలో బీసీల వాటా 50% పైగా ఇవ్వాలని కోరారు. ముఖ్యమంత్రి కులగనన చేపట్టినారు కులాల గణాంకాల వాటి వివరాలు వెంటనే ప్రజలకు తెలియజేయాలని కోరారు. అదేవిధంగా విద్యాపరంగా ఉద్యోగ పరంగా రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. లేనియెడల ప్రతి పల్లె నుండి పట్నం వరకు ఉద్యమాలు ఉవ్వెత్తున కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేష్ , బిసి యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు జిల్లపల్లి అంజి, రక్షక దళం చైర్మన్ ఉదయ్, కరీంనగర్ జిల్లా యువజన సంఘం అధ్యక్షులు నర్సింగోజు శ్రీనివాస్, మహిళా సంక్షేమ సంఘం అధ్యక్షురాలు గుంటి స్వరూప, యువజన సంఘం జిల్లా కార్యదర్శి లింగంపల్లి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

# భోగి మంటల్లో రైతు వ్యతిరేక నల్ల చట్టాల పత్రాలు దగ్ధం

నర్సంపేట, జనవరి 13 ( జనం సాక్షి)




రైతు వ్యతిరేక నల్ల చట్టాలను రద్దు చేయాలని ఢిల్లీ కేంద్రంగా ఉద్యమంలో దాదాపు 700 మంది రైతుల ఆత్మ బలిదానాల సాక్షిగా నరేంద్ర మోడీ ప్రభుత్వం నల్ల చట్టాలను రద్దు చేస్తామని ప్రకటించిన అది నేటి వరకు కార్యరూపం దాల్చలేదని, వెంటనే నల్ల చట్టాలను రద్దు చేస్తూ రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరల చట్టాన్ని రూపొందించాలని డిమాండ్ చేస్తూ సోమవారం నర్సంపేటలోని అంబేద్కర్ సెంటర్లో అఖిల భారత రైతు కూలి సంఘం ఆధ్వర్యంలో సంక్రాంతి భోగి పండుగ రోజున భోగిమంటలో రైతు వ్యతిరేక నల్ల చట్టాల ప్రజలను దగ్ధం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ప్రగతిశీల యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎలకంటి రాజేందర్ అఖిల భారత రైతు సంఘం ఏఐకేఎంఎస్ రాష్ట్ర నాయకులు గట్టి కృష్ణ మాట్లాడుతూ.. కేంద్రంలో మూడోసారి అధికారులకు వచ్చినటువంటి బిజెపి మోడీ ప్రభుత్వం ఆనాడు రైతులకు ఇచ్చినటువంటి హామీలను పూర్తిగా విస్మరించిందని, తిరిగి దేశ రాజధాని సరిహద్దు ప్రాంతాలలో రైతంగం ఉద్యమిస్తూ రైతు ఉద్యమ నేత జగ్జీత్ సింగ్ దల్లే వాలే గత 46 రోజులుగా ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్నప్పటికీ కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రిగాని, ప్రధానమంత్రి గాని, అమిత్ ఓ మంచి హోంశాఖ మంత్రులుగాని రైతన్న ఉద్యమం పట్ల స్పందించకపోవడం బాధాకరమని అన్నారు. దేశానికి అన్నం పెడుతున్న రైతు నేడు నల్ల చట్టాల వలన ఆత్మహత్యల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే రైతుల ప్రయోజనాలకు నష్టం కలిగిస్తున్నటు వంటి కార్పొరేట్ శక్తులకు మేలు చేస్తున్నటువంటి రైతు చట్టాలను వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల మహిళా సంఘం పిఓడబ్ల్యు జిల్లా ప్రధాన కార్యదర్శి పూలక్క, అఖిల భారత రైతు సంఘం నాయకులు రమేష్, ఆకుతోట రాజు, ఎడ్ల రాజేశ్వర్, ఎర్రబెల్లి నరసయ్య, కలకోట కుమార్, ఐఎఫ్ టి యు నాయకులు ఏసబోయిన ఐలన్న, ప్రదీప్ పిఓడబ్ల్యు నాయకులు విజయ, వీరలక్ష్మి, సులోచన, సావిత్రి, సుజాత, నిర్మల, లింగమ్మ, ప్రగతిశీల, యువజన సంఘం జిల్లా నాయకులు బిక్షపతి పాల్గొన్నారు.

# ప్రియాంకా గాంధీని కలిసిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, ఝాన్సీ రెడ్డి

పాలకుర్తి, జనవరి 13 (జనంసాక్షి)



ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీని వయనాడ్ ఎంపీగా ప్రశంసిస్తూ, పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, పాలకుర్తి నియోజకవర్గ ఇన్చార్జి హనుమాండ్ల ఝాన్సీ రెడ్డి ఢిల్లీలోని ప్రియాంక గాంధీ నివాసంలో మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా యశస్విని రెడ్డి, ఝాన్సీ రెడ్డిలు ప్రియాంక గాంధీకి జన్మదినం, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. వయనాడ్‌లో భారీ మెజారిటీతో ఎంపీగా ఎన్నికైనందుకు వారిని అభినందించారు. ఎన్నికల సమయంలో ప్రియాంక గాంధీ పాలకుర్తి నియోజకవర్గానికి వచ్చారని, మరోసారి పాలకుర్తి నియోజకవర్గాన్ని సందర్శించాలని,అభివృద్ధి పనులను పరిశీలించాలని వారు కోరినట్లు తెలిపారు,

# వైద్య విద్యార్థి భరతనాట్య ప్రదర్శన

నిర్మల్ బ్యూరో, జనవరి13,జనంసాక్షి,



ప్రముఖ వైద్యులు వేణుగోపాలకృష్ణ నీలిమ ల కూతురు హైదరాబాద్ లో వైద్య విద్యానభ్యసిస్తున్నారు. నిర్మల్ ఉత్సవాల్లో ఆమె చేసిన భారత నాట్యప్రదర్శన పలువురిని ఆకర్షింపచేసింది. గతంలో ప్రేమతో నాన్న చిత్రానికి ఉత్తమ నటిగా నంది పురస్కారం అందుకున్నారు. వైద్య విద్యను అభ్యసిస్తూ అనేక లఘు చిత్రాల్లో నటిస్తూ ఉత్తమ నటిగా మన్నలను పొందారు. మినిస్టేడియంలో వేదికపై భరత నాట్యం చేసిన డా,, సుహాసిని వేణుగోపాలకృష్ణలను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డితో పాటు పలువురు అధికారులు,అభినందించారు.

# వాహనాల దొంగతనం.. ఒక్కడిదే నేరం

## ఆన్ లైన్ బెట్టింగులకు, చెడు అలవాట్లకు బానిస

## వివిధ మండలాల్లో వరుసగా వాహనాలు చోరీ

**స్టేషన్ ఘన్పూర్, జనవరి 13 , (జనం సాక్షి) :**



డివిజన్ కేంద్రంలోని రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన వ్యక్తిని విచారించగా వాహనాలు దొంగతనం చేసినట్టు తేలింది. వర్ధన్నపేట మండలం రామవరం గ్రామానికి చెందిన వాహనాల దొంగతనాలకు పాల్పడుతున్న ఉడుత హరీష్ ను అరెస్ట్ చేసి రిమాండ్ పంపినట్టు జనగామ డిసిపి బి రాజమహేంద్ర నాయక్ తెలిపారు. డివిజన్ కేంద్రంలోనిపోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ రాజమహేంద్ర నాయక్ మాట్లాడుతూ.. బైక్ మెకానిక్ అయినటువంటి హరీష్ 2020లో ఆన్ లైన్ బెట్టింగులకు, చెడు అలవాట్లకు అలవాటు పడి డబ్బుల కోసం ములుగు, స్టేషన్ ఘన్పూర్ మండలాలలో నాలుగు కేసులలో కొన్ని నెలలు జైలుకు వెళ్లడం జరిగిందన్నా రు.జైలు నుండి వచ్చినతర్వాత ఆత్మకూరు మండలంలోని హౌస్ బుజుర్గుగ్రామంలో హీరో గ్లామర్, పాలకుర్తి మండలంలోని పెద్ద తండాలో టీవీఎస్ ఎక్సెల్, శివుని పెల్లిలో యాక్టివా 6 జి, బజాజ్ పల్సర్150, లింగాల ఘన్పూర్ మండలంలోని చీటూర్లో హెూండా ప్యాషన్ ప్లస్, 2025లో బజాజ్ పల్సర్, తానేదార్పల్లి గ్రామంలో బజాజ్ ఆటో దొంగతనాలు చేసినాడని అన్నారు. స్టేషన్ఘన్పూర్ పరిధిలో వరుస దొంగతనాలు అవుతుం డగా సోమవారం ఘన్పూర్ అండర్ బ్రిడ్జి వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా అనుమానస్పదంగా ఓ వ్యక్తి ఆటోలో రాగా అతన్ని ఆపి అడగగా తన పేరు హరీష్ అని నేరాన్ని ఒప్పుకొని ఆటో దొంగతనం చేయ డం జరిగిందని, దొంగతనంచేసిన ఆరు మోటర్ సైకిల్లు ఇంటి దగ్గర ఉన్నాయని చెప్పగా అట్టి బైకులను స్వాధీ నంచేసుకొని అరెస్టుచేసి రిమాండ్ కు పంపడం జరిగింది. దొంగను పట్టుకున్న సీఐ జీ వేణును, ఎస్సై రమేష్ ను కానిస్టేబుల్స్ గౌస్, కుమార్, రజాక్, ఏకాంబ రంలను సిపి అభినందించారు. ఈ సమావేశం లో ఏసీపీ భీమ్ శర్మ,సీఐ జీ వేణు, ఎస్సై రమేష్, కానిస్టేబుల్స్ గౌస్, కుమార్, రజాక్, రవీందర్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# టోకెన్ సమ్మెను విజయవంతం చేయండి



హెచ్ఎంఎస్ శ్రీరాంపూర్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ తిప్పారపు సారయ్య,సెక్రటరీ అనిల్ రెడ్డి

**నస్పూర్, జనవరి 12, (జనంసాక్షి):**

హెచ్ఎంఎస్ అనుబంధ సంఘమైన ఎస్టిపిపి కాంట్రాక్టు కార్మిక సంఘం ఈనెల 18వ తేదీన ఇచ్చిన ఒక్కరోజు టోకెన్ సమ్మెను సింగరేణి ప్రభావిత గ్రామాల ప్రజలు,కాంట్రాక్ట్ కార్మికులు విజయవంతం చేయాలని హెచ్ఎంఎస్ శ్రీరాంపూర్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ తిప్పారపు సారయ్య, సెక్రటరీ అనిల్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం శ్రీరాంపూర్ ఏరియాలోని హెచ్ఎంఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు.జైపూర్ సింగరేణి థర్మల్ పవర్ ప్రాజెక్టులో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. గత 2022 వ సంవత్సరం నుండి ఇప్పటివరకు ఆర్ఎల్సి వద్ద 15 సార్లు సమావేశం అయినప్పటికీ ఆర్ఎల్సి వారి సూచనలను కూడా ఏ మాత్రం లెక్కచేయకుండా యాజమాన్యం మొండి వైఖరి అవలంబిస్తుందని తెలిపారు. పవర్ ప్లాంట్ లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు బెస్ట్ అలవెన్స్ 5000 రూపాయలు ఇవ్వాలన్నారు. భూనిర్వాసితులను,గత కొన్ని సంవత్స రాల నుండి పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు.దత్తత తీసుకున్న పెగడపల్లి గ్రామంలో వైద్య సదుపాయం, స్కూలు,ప్లే గ్రౌండ్ నిర్మించాలన్నారు.సిఎస్ఆర్ నిధులను జైపూర్ మండలంలోని ప్రభావిత ప్రాంతాలలో అభివృద్ధికి ఖర్చు చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కార్యదర్శి దుర్గం లక్ష్మణ్, ఏరియా నాయకులు పొన్నగంటి అశోక్,తుల అనిల్,ఐత వెంకటస్వామి, సదిరం రాజేంద్రప్రసాద్, చెవుల శ్రీనివాస్,మీసాల మహేందర్, మందపల్లి శ్రీనివాస్, ఉడుత వినయ్ కుమార్, ఎర్రంశెట్టి సాయి, తదితరులు పాల్గొన్నారు.

# సర్వేంద్రియాం నయనం ప్రధానం

## ఎమ్మెల్యే గడ్డం వినోద్

**బెల్లంపల్లి, జనవరి 13, (జనంసాక్షి )**

సర్వేంద్రియాం నయనం ప్రదానం అని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. సోమవారం బెల్లంపల్లి నియోజకవర్గం నెన్నెల మండలం గంగారం గ్రామంలో కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు జాడి రాజ్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటి అద్దాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని ఉచిత కంటి అద్దాలను సతీమణి రమ, నాయకుల తో కలిసి పంపిణీ చేశారు. కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికి పూల వర్షం కురిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత నెలలో తన కూతురు వర్ష పేదల కుటుంబాల్లో వెలుగులు నింపాలనే సంకల్పంతో మెగా కంటి శిబిరం ఏర్పాటు చేయడంతో ఎంతో మంది పేదలకు మేలు జరిగిందన్నారు. సేవ కార్యక్రమాలు, బీద





ప్రజల కుటుంబాలను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామన్నారు. సేవ చేయడం అదృష్టం గా భావిస్తున్నామని సహకరించిన కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. రాజ్ కుమార్ గ్రామ అభివృద్ధి కోసం చేస్తున్న శ్రమను అభినందిస్తున్నట్లు తెలిపారు. ఏ సమస్య ఉన్న తమ దృష్టి కి తీసుకు రావాలన్నారు.అభివృద్ధి లక్ష్యమే తమ ధ్యేయమని హామీ ఇచ్చారు. అనంతరం రాజ్ కుమార్ స్వగృహంలో కుటుంబ సభ్యులను కలిశారు. కార్యక్రమంలో బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గట్టు మల్లేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొమ్ము రాజన్న, డీసీసీ సభ్యుడు గట్టు భానేశ్, గంగారం మాజీ సర్పంచ్ కామెర సుధ శ్రీనివాస్, నెన్నెల సర్పంచ్ తోట సుజాత శ్రీనివాస్, సీనియర్ నాయకురాలు కటికల మల్లికా దేవి, బొమ్మెన శ్రీమతి దేవి, గోలేటి సంధ్యారాణి, నాయకులు చెన్నోజీ శంకరయ్య, మల్ల గౌడ్, జనగామ తిరుపతి, శ్రీరాముల దేవేందర్, మహ్మద్ జలీల్, మంచర్ల వెంకటేష్, అశోక్, పోశం, స్వామి రెడ్డి, రాజన్న, మల్లేష్, ప్రశాంత్, రాజేందర్, అంకులు, అంకన్న, పాల్గొన్నారు..

# రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి తనిఖీ చేసిన ఎమ్మెల్యే పాయల్

**అదిలాబాద్ ప్రతినిది (జనంసాక్షి)**



రిమ్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని సోమవారం ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడారు. వారికి అందుతున్న వైద్య సేవలను వైద్యులతో మాట్లాడి అడిగి తెలుసుకున్నారు. అలాగే రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో మరుగుదొడ్లు, మూత్రశాలలు అపరిశుభ్రంగా ఉండడంతో శానిటేషన్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అదిలాబాద్ కు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి కేటాయించిందన్నారు. ఆస్పత్రితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఎప్పటికప్పుడు ఉంచాలని సంబంధిత కాంట్రాక్ట్ సిబ్బందికి సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తేఉపేక్షించేది లేదన్నారు.నిరుపేద రోగులు ఎంతో నమ్మకంతో వస్తారని వారికి కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించాలని రిమ్స్ డైరెక్టర్ జై సింగ్ రాథోడ్ సూచించారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు దయాకర్ మయూరిచంద్ర నిఖిల్, లింగన్న, నారాయణ తదితరులున్నారు

# మంజులకు నంది అవార్డు



**బెల్లంపల్లి, జనవరి 13 (జనంసాక్షి)**

బెల్లంపల్లి నియోజకవర్గం నెన్నెల మండలం కుశ్నపల్లి గ్రామానికి చెందిన మాడెపు మంజులకు నంది అవార్డు వరించింది. బాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ఆదర్శ కళా సేవాసంస్థ 25వ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన అవార్డుల ప్రధానోత్సవం కార్యక్రమంలో భాగంగా మారుమూల గ్రామానికి చెందిన మాడెపు మధునయ్య - మధునక్క దంపతుల కూతురు ధూమ్ ధామ్ కళాకారిణి మంజులకు అవార్డును నేర్నాల కిషోర్, అంతడుపుల రమాదేవి, తెల్లం మురళి, మధు, సినీ రచయిత రమాదేవి, రేలారే రేలా రవి చేతుల మీదుగా అవార్డు అందుకుంది. నంది అవార్డు అందుకున్న మంజులను గ్రామస్తులు అభినందించారు. రాబోవు కాలంలో మరిన్ని అవార్డులు పొంది గ్రామానికి మంచి పేరు ప్రఖ్యాతులు తేవాలని కోరారు.

## జాతీయ స్థాయిలో వెండి పథకం సాధించిన ఓరగంటి అక్షయ

**నెరడిగొండ జనవరి13(జనంసాక్షి)**



మెదక్ జిల్లా లోని 21వ సౌత్ జోన్ జాతీయ స్థాయి ఎంపిక పక్రియలో ప్రతిభ కనబరచి సాఫ్ట్ బాల్ సౌత్ జోన్ తెలంగాణ జట్టుకు ఎంపికై పుదీచేరీ రాష్ట్రములో జరిగే 21వ సౌత్ జోన్ సాఫ్ట్ బాల్ పురుషుల,మహిళాల ఛాంపియన్షిప్ లో పాల్గొని ఫైనాలో కేరళ పై 2-3 తేడాతో తెలంగాణ జట్టు ద్వితీయ స్థానం కైవసం సేసుకోంది.దీనిలో ఆదిలాబాద్ జిల్లా నుండి నేరడిగొండ నుండి ఓరగంటి అక్షయ పాల్గొని జట్టులో ప్రతిభ కనబరచి జట్టుకు కిలకమైనా పాత్ర పోసించింది.కేరళ పై 2-3 తో తెలంగాణ జట్టు ద్వితీయ స్థానం కైవసం సేసుకుంది.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు జాదవ్ అనిల్ ప్రధాన కార్యదర్శి గస్కంటి గంగాధర్ జిల్లా అసోసియేషన్ సభ్యులు మోహన్ శ్యామ్ నాగరాజ్ ఆర్గానేజర్ సెక్రటరీ అఖిల్ పీడీలు అభినందనలు తెలిపారు.

# అభివృద్ధి పనులను అభినందించిన సీఎం రేవంత్ రెడ్డి



మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమసాగర్ రావు

**మంచిర్యాల ప్రతినిధి జనవరి 13 (జనంసాక్షి)**

మంచిర్యాల జిల్లా కేంద్రంలో చేపడుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ప్రణాళికలు, పట్టణ సుందరీకరణలో భాగంగా వ్యాపార కూడళ్లలో చేపట్టిన రోడ్డు వెడల్పు కార్యక్రమాలను సిఎం రేవంత్ రెడ్డి అభినందించారని మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ పేర్కొన్నారు .సోమవారం నాడు గోదావరి తీరాన మహాప్రస్థానం నిర్మాణ పనులను పరిశీలించి,అనంతరం మంచిర్యాల పట్టణంలో జరుగుతున్న రోడ్ వెడల్పులో భాగంగా కూల్చివేతలను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మార్కెట్ రోడ్ మెయిన్ రోడ్, శ్రీనివాస టాకీస్ రోడ్, వాటర్ ట్యాంక్ రోడ్ లలో భూగర్భ మురికి కాలువలు, ఫుట్ పాత్ నిర్మాణం జరుపుతామని చెప్పారు. ఫిబ్రవరిలో పనులు చేపట్టి జూన్ వర్షాకాలం లోపు నిర్మాణాలు పూర్తి చేసి పట్టణ సుందరీకరణ చేస్తానని భరోసా ఇచ్చారు. భూగర్భ మురికి కాలువలు, కేబుల్ వ్యవస్థ గురించి రాష్ట్ర ముఖ్యమంత్రికి వివరించగా విన్న ముఖ్యమంత్రి రాష్ట్రంలోని పలు మున్సిపాలిటీ లలో ఇదే ప్రణాళిక అమలు చేస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారని తెలిపారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో చేపడుతున్న పలు అభివృద్ధి పనులను సి ఎం రేవంత్ రెడ్డి ప్రశంసించారని తెలిపారు. రోడ్డు వెడల్పులో ప్రజలు అభివృద్ధి కి సహకరించాలని ఎవరు ఆటంకం కల్పించవద్దని కోరారు. మంచిర్యాల నియోజకవర్గం ప్రజలకు ఆయన సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. సంక్రాంతి పండుగ ముందు రైతులకు పంటలు చేతికొచ్చిన సమయంలో చేసుకొనే ఎంతో ఇష్టమైన పండుగ సంక్రాంతి అని అన్నారు. కుటుంబసభ్యుల సందడి, పిండి వంటలు, కొత్త బియ్యంతో భోజనం ఇలా సంతోషంగా పండుగ జరుపుకుంటారని తెలిపారు

# వర్గీకరణ విషయంలో మాట నిలబెట్టుకోవాలి



పర్వతగిరి మాదిగ కుల సంఘం డిమాండ్

**పర్వతగిరి, జనవరి 13 (జనం సాక్షి)**

పర్వతగిరి మండల కేంద్రంలో తక్షణ మే వర్గీకరణ బిల్లును అమలు చేయాలని ఫిబ్రవరి ఏడో తారీఖున హైదరాబాదులో నిర్వహించే లక్షల డప్పులు, వెయ్యిల గొంతుకలు కార్యక్రమం విజయవంతం కోసం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో మాదిగ కుల సభ్యులందరూ కలిసి డప్పు చాటింపుతో ఎమ్మార్పీ ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జిల్లా ధర్మయ్య మాట్లాడుతూవర్గీకరణ జరిగేంత వరకు మా పోరాటం ఆగదని తక్షణమే వర్గీకరణకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని ముఖ్యమంత్రి అసెంబ్లీ సాక్షిగా వర్గీకరణకు అనుకూలమని చెప్పిన మాట ప్రకారం వర్గీకరణ బిల్లును ఆమోదించాలని రాష్ట్రంలో ఉన్న మాదిగ మరియు ఉప కులాలకు జనాభా ప్రాతిపదికన,రాజ్యాంగం ప్రకారం విద్యా ,ఉపాధి రంగాల్లో సమన్యాయం జరగాలని కోరడం జరిగింది ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం పట్టణ అధ్యక్షుడు జిల్లా శ్రీనివాస్,బిజెపి ఎస్సీ మార్చ నియోజకవర్గం కన్వీనర్ బొట్ల మధు, మాదిగ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు బొట్ల భాస్కర్, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల కన్వీనర్ నరుకుడు రవీందర్, మాజీ ఎంపిటిసి దెబ్బేట యాలాద్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బొట్ల కనకరాజు, మాజీ సర్పంచ్ బొట్ల కిష్టయ్య, చిన్న పెల్లి దేవేందర్, చిన్న పెల్లి శ్రీనివాస్, బరిగల విజయ, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బర్ల యాకయ్య, బొట్ల యాకయ్య, బొట్ల చిన్న వెంకటేశ్వర్, బొట్ల వెంకన్న, హర్షం కుమార్, బోట్లయాకరాములు, ఒగ్గు దుర్గయ్య, దబ్బేట నరేష్, బరిగల ఉప్పలయ్య, బొట్ల రవి ,బొట్ల శ్రీధర్, గాడి పెల్లి చేరాలు, మునిగే యాకయ్య, చిన్న పెల్లి గోపాల్, బొట్ల కుమారస్వామి, చిర్ర సునీల్, పాల్గొన్నారు

# జాతరకు వచ్చే భక్తులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

హనుమకొండ జిల్లా డిఎంహెచ్వో డాక్టర్ ఏ అప్పయ్య

**భీమదేవరపల్లి, జనవరి 13(జనంసాక్షి)**




కొత్తకొండ జాతరకు వచ్చే భక్తులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని హనుమకొండ జిల్లా డిఎంహెచ్వో డాక్టర్ ఏ.అప్పయ్య, పేర్కొన్నారు. సోమవారం మండలంలోని కొత్తకొండ వీరభద్ర స్వామి జాతరలో ఏర్పాటు చేసినటువంటి వైద్య శిబిరమును సందర్శించారు. అక్కడ అందిస్తున్నటువంటి సేవలను ఏర్పాట్లను పరిశీలించి తగు సూచనలు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ జాతర ఈనెల18వ వరకు వైద్య శిబిరం కొనసాగుతుందన్నారు. డాక్టర్లను 36 మంది పారా మెడికల్ సిబ్బందిని మూడు షిఫ్టులలో డ్యూటీ లు వేయడం జరిగిందన్నారు.ఈ శిబిరంలో ప్రాథమిక వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు.అలాగే అత్యవసర సేవల నిమిత్తం రెండు 108 సర్వీసులను కూడా అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు.అవసరమైన చికిత్సలతో పాటుగా ప్రజల్లో వివిధ అరోగ్య కార్యక్రమాల పట్ల అవగాహన కల్పించడం అలాగే వైద్య సిబ్బంది వచ్చినటువంటి భక్తులకు

చలికాలం జాగ్రత్తలు వివిధ ఆరోగ్య కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలను కూడా భక్తులకు అందించడం జరుగుతుందన్నారు. జాతరలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు సంబంధించిన కరపత్రాన్ని డాక్టర్ అప్పయ్య ఆవిష్కరించారు. ఇప్పటివరకు 126 మంది భక్తులకు వైద్య సేవలు అందించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పి ప్రదీప్ రెడ్డి,డెమో వి. అశోక్ రెడ్డి,డాక్టర్ ఎస్. మౌనిక, డాక్టర్ ఎస్. వినోద్ కుమార్, హెచ్ ఈ ఓ ఎస్ రాజేశ్వర్ రెడ్డి, సూపర్వైజర్లు విమల కుమారి, విప్లవ కుమార్, ఏఎన్ఎం అనిత, ఆశ కార్యకర్తలు ఎమ్మెన్వోలు 108 సిబ్బంది పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
14 జనవరి 2025

# కిషన్ రెడ్డి నివాసంలో ఘనంగా సంక్రాంతి వేడుకలు

- ముఖ్య అతిథిగా హాజరైన ప్రధాని మోడీ,స్పీకర్ ఓం బిర్లా
- చిరంజీవి, పలువురు కేంద్రమంత్రులు, నేతల రాక





**న్యూఢిల్లీ, జనవరి 13 (జనంసాక్షి) :** తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటుతున్నాయి. రంగురంగుల రంగవల్లులతో గ్రామాలు, పట్టణాలు ముస్తాబు కాగా.. కోడి పందేలు, ఎడ్ల పందేలతో పండగను ఘనంగా నిర్వహిస్తున్నారు. మరోవైపు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి ఇంట్లో సంక్రాంతి సంబరాలు హోరెత్తిపోతున్నాయి. దేశ రాజధాని ఢిల్లీలోని ఆయన నివాసంలో సోమవారం సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ వేడుకకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీతోపాటు పలువురు కేంద్ర మంత్రులు, సినీ, రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతిప్రజ్వలన చేశారు. ఈ వేడుకల్లో స్పీకర్ ఓం బిర్లా, కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసరాజు, సినీనటుడు చిరంజీవి, ఏఐజీ ఆసుపత్రి ఛైర్మన్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి, పీవీ సింధు వివిధ రంగాల ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను మోదీ వీక్షించారు. గాయని సునీత పాటలతో అలరించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీకి వెంకటేశ్వరస్వామి ప్రతిమను కిషన్‌రెడ్డి అందజేశారు. ఎంపీలు లక్ష్మణ్, అనురాగ్ ఠాకూర్, ఈటెల రాజేందర్, ధర్మపురి అరవింద్, రఘునందన్ రావు, లక్ష్మణ్, గోడెం నగేష్, బాలశౌరి, కొండ విశ్వేశ్వర్ రెడ్డి , డి.కె.అరుణ సహా పలువురు తెలంగాణ బీజేపీ నేతలు సైతం వేడుకలో పాల్గొన్నారు. అలాగే లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా, హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, కేంద్ర మంత్రులు గజేంద్ర సింగ్ షెకావత్, జ్యోతి రాధిత్య సింధియా, మనోహర్ లాల్ కట్టర్, పెమ్మసాని చంద్రశేఖర్, బండి సంజయ్, సతీశ్ చంద్ర దూబే, శ్రీనివాస్ వర్మ హాజరయ్యారు. మరోవైపు పలువురు ఎంపీలు, పారిశ్రామికవేత్తలు, బీజేపీ నేతలు కిషన్ రెడ్డి నివాసానికి భారీగా చేరుకున్నారు. కేంద్ర మంత్రి నివాసానికి చేరుకున్న ప్రధాని మోదీకి కిషన్ రెడ్డి, చిరంజీవి, పెమ్మసాని చంద్రశేఖర్ సాదర స్వాగతం పలికారు. సంక్రాంతి వేడుకల నేపథ్యంలో తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా కిషన్ రెడ్డి ఇంటిని ముస్తాబు చేశారు. అతిథులకు తెలుగు వంటలను సైతం రుచి చూపించేలా పలు వంటకాలను సిద్ధం చేశారు.

## యువ ఉడాన్ యోజన్ పేరుతో మరో హామీ

**న్యూఢిల్లీ, జనవరి13 (జనంసాక్షి) :** దిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధిస్తే ఏడాదిపాటు దిల్లీలోని నిరుద్యోగ యువతకు రూ.8,500 ఇస్తామని కాంగ్రెస్ పార్టీ మరో హామీని ప్రకటించింది. 'యువ ఉడాన్ యోజన' ద్వారా ఆర్థికసాయాన్ని అందించనున్నట్లు వెల్లడించింది. అయితే ఈ పథకం ఉచితం కాదని, షరతులు వర్తిస్తాయని పేర్కొంది. 'ఏదైనా కంపెనీ లేదా ఫ్యాక్టరీలో తమకు ఉన్న నైపుణ్యాలను చూపించిన యువతకు ఆర్థిక సాయం చేస్తాం. వారు ఈ కంపెనీల నుంచి ఆ సొమ్మును పొందుతారు.




## ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాయంతో ఇచ్చిమెచ్చినట్లు క్రియేట్

- ప్రముఖుల ఫొటోలను మార్ఫింగ్
- తాజాగా జాన్వీకపూర్, హర్దిక్‌పాండ్యా క్లోజ్‌గా ఉన్నట్లు వైరల్

**న్యూఢిల్లీ, జనవరి 13 (జనంసాక్షి) :** ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ సాయంతో కొందరు ఇచ్చిమెచ్చినట్లుగా ప్రముఖుల ఫొటోలను మార్ఫింగ్ చేసి నెట్టింట్లో పోస్టు చేస్తున్నారు. దీంతో దానిని చూసిన నెటిజన్లు అది నిజమోనని ఆరా తీయడం మొదలు పెడుతున్నారు. ఇది ఈ మధ్యకాలంలో బాగా పెరిగింది. ఇందుకు ప్రధాన కారణంగా ఎఐ ఆర్టిఫిషియల్ ఇంకా మరింత అభివృద్ధి చెందటమే కారణంగా. ఈ నేపథ్యంలో క్రికెటర్ హార్దిక్ పాండ్యా, స్టార్ నటి జాన్వీ కపూర్ డేటింగ్‌లో ఉన్నారంటూ సోషల్ మీడియాలో తెగ ప్రచారం జరుగుతోంది. అందుకు కారణం ఇద్దరూ చనువుగా ఉన్న ఫొటోలు వైరల్ కావడమే. వీరిద్దరూ కలిసి ఇటీవలే మాల్దీవుల్లో విహరించినట్లు ఆ ఫొటోలను బట్టి తెలుస్తోంది. జాన్వీ-పాండ్యా సముద్ర తీరంలో విహరిస్తూ, సన్నిహితంగా కనిపించారు. ఈ ఫొటోలను చూసిన నెటిజన్లు హార్దిక్ జాన్వీ పీకల్లోతు ప్రేమలో ఉన్నారంటూ మాట్లాడుకోవడం మొదలు పెట్టారు. దీంతో రంగంలోకి దిగిన నేషనల్ మీడియా ఫ్యాక్ట్ చెక్ నిర్వహించగా అసలు విషయం బయటపడింది. ఈ ఫొటోలు నిజం కాదని తేల్చింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాయంతో క్రియేట్ చేసినవిగా తేల్చింది. దీంతో వీరిద్దరూ డేటింగ్‌లో ఉన్నారంటూ వచ్చిన వార్తలు కేవలం పుకార్లు మాత్రమే అని స్పష్టమైంది. కాగా, హార్దిక్ పాండ్యా ఇటీవలే తన భార్య నటాషా స్టాంకోవిక్‌తో విడాకులు తీసుకున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం తన దృష్టిమొత్తం కెరీర్‌పైనే పెట్టాడు. ఇక జాన్వీ కపూర్ వరుస బాలీవుడ్ ప్రాజెక్టులతోపాటు టాలీవుడ్ సినిమాలతో బిజీగా మారిపోయింది.

## కేరళ స్వతంత్ర ఎమ్మెల్యే అన్వర్ రాజీనామా



**తిరువనంతపురం, జనవరి 13 (జనంసాక్షి) :** కేరళలోని నిలంబూర్ నియోజకవర్గానికి చెందిన స్వతంత్ర ఎమ్మెల్యే పి.వి. అన్వర్ రాజీనామా చేశారు. సోమవారం కేరళ స్పీకర్ ఎ.ఎన్.శ్యాంసీర్‌కి తన రాజీనామా లేఖను అందజేశారు. కోల్‌కతా టిఎంసి నేతలతో సమావేశమైన కొద్ది రోజుల అనంతరం అన్వర్ ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. కేరళలో పార్టీ కార్యకలాపాలను సమన్వయం చేస్తానని అన్వర్ చెప్పారు. అయితే టిఎంసి సభ్యత్వాన్ని ఆమోదిస్తున్నారా లేదా అనే వివరాలను వెల్లడించకుండా దాటవేశారు. తన అసెంబ్లీ సీటును కోల్పోవడంతో పాటు ఫిరాయింపుల నిరోధక చట్టం కింద చట్టపరమైన చర్యలను తప్పించు కునేందుకు ఈ వివరాలను వెల్లడించకపోవచ్చని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. కేరళ స్టూడెంట్స్ యూనియన్ (కెఎస్‌యు) నేతగా రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన అన్వర్ కాంగ్రెస్‌లో చేరారు. 2005లో కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పి కె. కరుణాకరన్‌కి చెందిన డెమోక్రటిక్ ఇందిరా కాంగ్రెస్ (కరుణాకరన్)తో పొత్తు పెట్టుకున్నారు. అనంతరం ఎల్‌డిఎఫ్‌తో చేతులు కలిపారు.




## కుంభమేళాకు ఆపిల్ సహ వ్యవస్థాపకులు స్టీవ్ జాబ్స్ భార్య



**ప్రయాగ్‌రాజ్, జనవరి 13 (జనంసాక్షి) :** ఆపిల్ సహ వ్యవస్థాపకులు దివంగత స్టీవ్ జాబ్స్ భార్య, ప్రపంచంలో అత్యంత ధనవంతురాలైన మహిళల్లో ఒకరైన లారెన్ పావెల్ మహా కుంభమేళాకు హాజరయ్యారు. 40 మంది సభ్యులతో కూడిన బృందంతో ఆమె ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌కు తరలివచ్చారు. రెండు రోజుల క్రితమే (ఈ నెల 11న) భారత్‌కు చేరుకున్న 61 ఏండ్ల లారెన్.. నిరంజని అఖాడాకు చెందిన ఆచార్య మహామండలేశ్వర్ స్వామి కైలాషానంద శిబిరంలో ఉన్నారు. ఆదివారం సాయంత్రం ప్రయాగ్‌రాజ్‌కు వచ్చిన ఆమెకు శిబిరం వద్ద స్వామీజీలు ఘనంగా స్వాగతం పలికారు. లేత పసుపు వర్ణంలో వస్త్రాలు ధరినంచిన లారెన్.. చేతికి రక్షా సూత్ర, మెడలో రుద్రాక్ష మాల ధరించి ఉన్నారు. ఆమె ఈ నెల 15 వరకు అక్కడే ఉంటారు. అనంతరం నూతన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో పాల్గొనేందుకు అమెరికాకు తిరిగి వెళ్లనున్నారు. ప్రయాగ్‌రాజ్ రావడానికి ముందు వారణాసిలోని కాశి విశ్వనాథ ఆలయాన్ని సందర్శించారు. లారెన్ పావెల్.. ప్రపంచంలోని అత్యంత సంపన్న మహిళల్లో ఒకరు. ఆమె ఆస్తి 15 బిలియన్ల డాలర్లు. స్టీవ్ జాబ్స్ భార్య అయిన లారెన్ పావెల్ యాపిల్ కంపెనీ షేర్స్ నుంచి ఆస్తిని వారసత్వంగా పొందారు. 2021లో ఆమె వేవెర్లీ స్ట్రీట్ ఫౌండేషన్‌ను ప్రారంభించారు. దీనికి వచ్చే నిధులను పర్యావరణ మార్పులను పరిష్కరించేందుకు కేటాయిస్తున్నారు. ఆపిల్ వ్యవస్థాపకుల్లో ఒకరైన స్టీవ్ జాబ్స్ 2011, అక్టోబర్ 5న మరణించిన విషయం తెలిసిందే.




## అంగరంగ వైభవంగా కొత్తకొండ జాతర




**భీమదేవరపల్లి, జనవరి 13 (జనం సాక్షి) :** కొత్తకొండలోని వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాల జాతర కన్నుల పండుగగా సాగుతూ ఉంది. భక్తి పారవశ్యంతో జాతర ఓలలాడుతోంది.తమ ఇలవేల్పు, ఇష్ట దైవం వీరభద్రుడికి భక్తులు మొక్కులు సమర్పించి, పూజాధికాలు చేస్తున్నారు.

వేల సంఖ్యలో హాజరైన భక్త జనంతో కొత్తకొండ ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. సోమవారం సంక్రాంతి పర్వదినం సందర్భంగా భక్తులు భారీ సంఖ్యలో జాతరకు హాజరయ్యారు. మంగళవారం బండ్లు తిరగడంతో మరింత జోరుతో జాతర సాగనున్నది. ఉత్తర తెలంగాణలో ప్రసిద్ధి గాంచిన హన్మకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండలో కొలవైన వీరభద్రుడి జాతర బ్రహ్మోత్సవాలు ఈ నెల 10న భద్రకాళీ సమేతా వీరభద్రుడి కళ్యాణంతో అధికారికంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలకు ఐదు లక్షలకు పైగా భక్తులు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర నుండి వస్తారు. ఇప్పటికే లక్షలాదిమంది హాజరయ్యారు. ఈనెల 10న వీరభద్రుడి కళ్యాణంతో ప్రారంభమై 18న అగ్నిగుండాలు వరకు స్వామి పర్యటన జరుగనున్నది. మకర సంక్రాంతి రోజున భద్రకాళీ సమేతా వీరభద్రుడి సర్వాలంకార నిజరూపాన్ని దర్శిస్తే సర్వపీడల నుండి విముక్తి కలుగుతుందని శాస్త్రోక్తి.సోమవారం భోగి పండుగ సందర్భంగామొక్కులు సమర్పించారు. మకర సంక్రాంతి ఆదివారం తెల్లవారు జామున అనగా ఉత్తరాయణ పుణ్యకాలమందు వందలాది ఎడ్లబండ్లతో రథయాత్ర జరుగనున్నది. మొదట కుమ్మరుల బండ్లతో వీరభోనంతోనే జాతర ఊగిపోతుంది.

## వర్గీకరణ అమలుకు లక్ష డప్పులు - వేల గొంతులై గర్జిద్దాం

- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్ మాదిగ



**స్టేషన్ ఘన్పూర్, జనవరి 13, (జనం సాక్షి ) :** ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అమలు కోసం ఫిబ్రవరి 7న హైదరాబాద్ మహానగరంలో వేల గొంతులు - లక్ష డప్పుల దండోరా సంస్కృతిక మహా ప్రదర్శన జరగబో తున్నదని మందకృష్ణమాదిగ పిలుపునందుకొని ధరణి దద్దరిల్లేలా దండోరెద్దాం మండే మాదిగల గుండె చప్పుడు వినిపిద్దామని హైదరాబాద్ కు ప్రతి వ్యక్తి డప్పుతో తరలిరావాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్ మాదిగ పిలుపునిచ్చారు. డివిజన్ కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట ఎమ్మార్పీఎస్ నూతనక్యాలెండర్ ఆవిష్కరణకార్యక్రమాన్ని ఎమ్మార్పీ ఎస్ మండల అధ్యక్షుడు గుర్రం నవీన్ మాదిగ అధ్యక్ష తన నిర్వహించగా ఈ కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు గోవిందు నరేష్ మాదిగ ముఖ్యఅతిథిగా హాజరై నూతన క్యాలెండర్ను ఆవిష్కరించి ప్రసంగించడం జరిగింది. ఈసభలో ఎమ్మార్పీఎస్ జాతీయ అధికారప్రతినిధి బొర్ర బిక్షపతిమాదిగ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల్ల ఉపేంద్ర మాదిగ,దండోరా డిజిటల్ మీడియా స్టేట్ ఇంచార్జ్ సోమారపు మురళీకృష్ణ మాదిగ, దండోరా కళామండలి జిల్లా అధ్యక్షుడు గజవెల్లి ప్రతాప్, ఎమ్మెస్పీ జిల్లా అధికారప్రతినిధి సందెల రవీందర్ మాదిగ,జిల్లా ఎమ్మె స్పి మాజీ ఇన్చార్జ్ ఇనుముల నర్సయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి జేరిపోతుల సుధాకర్ మాదిగ,ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధానకార్యదర్శి బోట్ల మహేష్ మాదిగ, ఎమ్మెస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు చాడ ఏలియ మాదిగ తదితరులు పాల్గొన్నారు.




Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370